ప్రతిపక్షం

www.prathipaksham.in

గురువారం 27.11.2025 | Published from: Hyderabad | సంపుటి: 18 సంచిక: 247 పేజీలు:12 వెల రూ. 5/-

@prathipaksham | prathipaksham tv telugu

సఫారీల చేతిలో టీమిండియా దారుణ ఓటమి 12

తమ ప్రగతిశీల పారిశ్రామిక విధానం, ఎమ్ఎస్ఎమ్ఈ విధానం దేశంలోనే అత్యుత్తమమైన వాటిలో ఒకటిగా నిలిచిందని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, ఏరోస్పేస్ పార్కులు, సెజ్‌లు ప్రముఖ ప్రపంచ కంపెనీల నుంచి అనేక భారీ పెట్టుబడులను ఆకర్షించాయన్నారు. సఫ్రాన్, బోయింగ్, ఎయిర్ బస్, టాటా, భారత్ ఫోర్జ్ వంటి సంస్థలు హైదరాబాద్‌ను తయారీ, పరిశోధన, అభివృద్ధి కోసం ఎంచుకున్నాయని తెలిపారు. భారతదేశంలోని ప్రముఖ ఎమ్ఆర్‌వో, ఏరో ఇంజిన్ హబ్‌లలో హైదరాబాద్ ఒకటన్నారు. ఏరోస్పేస్, రక్షణ రంగంలో ఎగుమతులు నిరుడు రెట్టింపయ్యాయన్నారు.

తెలంగాణ వృద్ధికి సఫ్రాన్ మైలురాయి

వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోడీ

- ఎంఎస్ఎంఈ విధానంలో అత్యుత్తమం
- రాష్ట్రంలో 25 అంతర్జాతీయ కంపెనీలు
- సమగ్రంగా ఎదుగుతున్న హైదరాబాద్
- ఇంజనీరింగ్ కంపెనీలకు కొత్త అవకాశాలు
- ప్రగతిశీల పారిశ్రామిక విధానంతో మేలు
- భారీ పెట్టుబడులకు చక్కని అవకాశం
- కంపెనీలకు 'గ్లోబల్ సమ్మిట్' ఆహ్వానం
- 2035 నాటికి వన్ ట్రిలియన్ డాలర్ ఎకానమీ
- 2047 నాటికి త్రీ ట్రిలియన్ డాలర్లకు చేరాలి
- 'సఫ్రాన్' ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 26: సఫ్రాన్ ఏరోస్పేస్ రక్షణ రంగంలో తెలంగాణ వృద్ధికి ఒక మైలురాయిగా నిలుస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ మీద నమ్మకంతో హైదరాబాద్‌ను ఎంచుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. ఇది భారతదేశంలో లీప్ ఇంజిన్ మొట్టమొదటి మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్ హాల్ సెంటర్ అని పేర్కొన్నారు. రూ.1,300 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన ఈ సదుపాయంతో 1,000 మందికి పైగా నైపుణ్యం కలిగిన సాంకేతిక నిపుణులు, ఇంజనీర్లకు ఉపాధి లభిస్తుందని చెప్పారు. శంషాబాద్ సమీపంలోని జీఎంఆర్ ఏరోపార్క్ లో ఫ్రాన్స్‌కు చెందిన ప్రముఖ సంస్థ సఫ్రాన్ నెలకొల్పుతున్న లీప్‌ఇంజిన్ ఎంఆర్ఓ సెంటర్‌ను బుధవారం ప్రధాని నరేంద్ర మోడీ ఆన్ లైన్ ద్వారా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర పౌర విమానయానమంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు. అనంతరం సీఎం మాట్లాడుతూ ఇది స్థానిక ఎంఎస్ఎంఈలకు, ఇంజనీరింగ్ కంపెనీలకు కొత్త వ్యాపార అవకాశాలను

..:: మిగతా 2లో

పకడ్బందీగా 'పంచాయతీ' ఎన్నికలు

అధికారులు సమన్వయంతో పని చేయాలి

- అన్ని వివరాలను పోర్టల్‌లో నమోదు చేయాలి
- ఎన్నికల కోడ్ ను పటిష్టంగా అమలు చేయాలి
- ఫిర్యాదులను వెంటవెంటనే పరిష్కారించాలి
- ఇందుకు నోడల్ అధికారులను నియమించాలి
- పోలింగ్ కేంద్రాలలో అన్ని వసతులు కల్పించాలి
- పంపిణీ కేంద్రాలు మండల కేంద్రాలలోనే ఉండాలి
- కౌంటింగ్ కు మూడు రోజులు ముందుగానే ఏర్పాట్లు
- కలెక్టర్లు, సీపీలు, ఎస్పీలతో ఎస్ఈసీ రాణి కుముదిని
- ఎన్నికల ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 26: గ్రామపంచాయతీ ఎన్నికలను రాష్ట్రంలో పకడ్బందీగా నిర్వహించే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం ఆమె హైదరాబాద్ నుండి అదనపు డీజీపీ మహేశ్ భగవత్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు, అదనపు కలెక్టర్లు, జిల్లా పంచాయతీ అధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. రిజర్వేషన్ వివరాలు, విడతల వివరాలు పోలింగ్ కేంద్రాలు, జియో లోకేషన్, టీఈ పోల్ పోర్టల్ లో నమోదు చేయాలని సూచించారు. పోర్టల్ లో గ్రీవెన్స్ ప్లాట్ ఫామ్ గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. దరఖాస్తులు, ఫిర్యాదుల పరిష్కారానికి నోడల్ అధికారిని నియమించి, ఫిర్యాదులను మూడు రోజులలోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల

..:: మిగతా 2లో

41 మంది మావోయిస్టుల లొంగుబాటు

..:: 11లో

'గ్లోబల్ సమ్మిట్' ప్రారంభానికి ప్రధాని

- కేంద్ర మంత్రులకు కూడా ఆహ్వానం
- సదస్సులో ఎలాంటి లోటుపాట్లు ఉండొద్దు
- దేశ, విదేశాల నుంచి ప్రతినిధులు వస్తారు
- క్రమశిక్షణతో కూడిన ప్రణాళిక ఉండాలి
- సమీక్షలో అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 26: నగరంలో డిసెంబర్ 8, 9 తేదీలలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025 ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో పాటు కేంద్ర మంత్రులను ఆహ్వానించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు సూచించారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహణ, ఏర్పాట్లపై ముఖ్యమంత్రి కమాండ్ కంట్రోల్ సెంటర్ లో మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, సలహాదారు వేం నరేందర్ రెడ్డితో కలిసి బుధవారం నాడు సమీక్ష నిర్వహించారు. సమ్మిట్‌కు దేశ, విదేశాలకు చెందిన వ్యాపారవేత్తలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను ఆహ్వానించేందుకు ముందుగానే జాబితాను సిద్ధం చేయాలని చెప్పారు. ఆహ్వానితులకు ఎక్కడా లోటు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సదస్సుకు హాజరు కావాలని కోరుతూ ఇప్పటికే 2600 మంది ప్రతినిధులకు ఆహ్వానాలు అందించామని అధికారులు వివరించారు. పెట్టుబడులకు సంబంధించి సదస్సులో ఒప్పందాలు కుదుర్చుకునే విషయంలో స్పష్టమైన ప్రణాళికతో ముందుకు వెళ్లాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇటు విభాగాల వారీగా వివిధ అంశాలపై మాట్లాడేందుకు వక్తలకు సంబంధించిన పక్కా ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని, వక్తలకు సమయం ముందుగానే నిర్దేశించి క్రమశిక్షణతో కూడిన ప్రణాళిక

..:: మిగతా 2లో

జీఓ నం.46ను ఉపసంహరించుకోవాలి

- బీసీ కోటా వచ్చేదాకా పోరు కొనసాగుతుంది
- పంచాయతీ ఎన్నికలలో బీసీలకు అన్యాయం
- కాంగ్రెస్ ప్రభుత్వం నమ్మించి మోసం చేస్తోంది
- రిలే నిరాహార దీక్షలో జాతీయ బీసీ నేత ఆర్. కృష్ణయ్య
- సర్కారు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి
- సినీ దర్శకుడు, నటుడు ఆర్. నారాయణమూర్తి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 26 : జీఓ నంబరు46ను భేషరతుగా ఉపసంహరించుకుని, 42 శాతం రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం ముందుకు రావాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ జేఏసీ చైర్మన్ ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. కోర్టులో వాదనలు పూర్తికాకముందే జీఓ విడుదల చేయడం, ఎన్నికల నోటిఫికేషన్ కూడా ప్రకటించడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నగరంలోని విద్యానగర్ బీసీ భవన్‌లో బుధవారం కృష్ణయ్య ఒక రోజు రిలే నిరాహార దీక్షను చేపట్టారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డా. వకుళాభరణం కృష్ణమోహనరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రసంగించిన కృష్ణయ్య జీఓ 46 కారణంగా సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాల కేటాయింపులో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. పలు గ్రామాలలో బీసీలకు ఒక్క సర్పంచ్

..:: మిగతా 2లో

మార్చి 18 నుంచి పరీక్షలు

- పదో తరగతి పరీక్షల షెడ్యూల్ ఖరారు!
- ఒక్కో పరీక్షకు మధ్య 2 రోజుల వ్యవధి
- విద్యార్థులపై భారం తగ్గించే యత్నం
- సీబీఎస్ఈ విధానంలో నిర్వహించే యోచన
- ప్రభుత్వం ఆమోదించాక అధికారిక ప్రకటన

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 26 : తెలంగాణలో పదో తరగతి పరీక్షల షెడ్యూల్ ఖరారైంది. కొత్త మార్పులతో పరీక్షల నిర్వహణకు యంత్రాంగం సిద్ధమవుతోంది. అయితే. గతానికి భిన్నంగా ఒక్కో పరీక్షకు మధ్య ఒకటి, రెండు రోజుల వ్యవధి ఇవ్వాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. సీబీఎస్ఈ పరీక్షల విధానం తరహాలో నిర్వహణ పైన ప్రతిపాదన లు రావటంతో ఆ దిశగా కసరత్తు జరుగుతోంది. పదో తరగతి వార్షిక పరీక్షలు వచ్చే మార్చి 18 నుంచి

..:: మిగతా 2లో

ఇమ్రాన్‌ను చంపేశారని వదంతులు

- జైలు వద్దకు ఆయన సోదరీమణులు
- సోదరుడిని తమకు చూపించాలని డిమాండ్
- అనుమతించని పాకిస్తాన్ పోలీసు అధికారులు
- తమ మీద పోలీసులు దారుణంగా దాడి చేశారు
- పంజాబ్ పోలీస్ చీఫ్‌కు ఇమ్రాన్ సోదరీమణుల ఫిర్యాదు
- ఈ ఘటనపై విచారణ జరపాలన్న పీటీఐ నేతలు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో

న్యూఢిల్లీ, నవంబర్ 26 : పాకిస్తాన్ మాజీ ప్రధాని, ప్రముఖ క్రికెట్ క్రీడాకారులు ఇమ్రాన్ ఖాన్ జైలులో మరణించారనే ప్రచారం ఆ దేశంలో తీవ్ర కలకలం సృష్టించింది. దీంతో రావల్పిండిలోని అదియాలా జైలు వద్ద బుధవారం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. తమ సోదరుడిని కలిసేందుకు అనుమతించాలంటూజైలు వద్దకు వెళ్లిన ఇమ్రాన్ ముగ్గురు సోదరీమణులపై పోలీసులు అత్యంత దారుణంగా దాడి చేశారని ఆరోపణలు వచ్చాయి. ఇమ్రాన్ సోదరీమణులు నూర్యీన్ ఖాన్, అలీమా ఖాన్, ఉజ్మా ఖాన్ పాకిస్తాన్ తెహ్రీక్ ఎ ఇన్సాఫ్ (పీటీఐ) మద్దతుదారులతో కలిసి జైలు వద్దకు చేరుకున్నారు. మూడు వారాలుగా తమ సోదరుడిని కలిసేందుకు అధికారులు అనుమతించడం లేదని

..:: మిగతా 2లో

రాజ్యాంగం మనకు కర్తవ్య బోధ చేస్తోంది

రాజ్యాంగం మనకు గొప్ప కర్తవ్య బోధ చేస్తోందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. మన ప్రజాస్వామ్యం వ్యవస్థకు మూలం రాజ్యాంగం అని కూడా ప్రశంసించారు. సంవిధాన్ సదన్‌లోని సెంట్రల్ హాల్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నేతృత్వంలో బుధవారం రాజ్యాంగ దినోత్సవ సభ జరిగింది.

11

ఉమర్ కు ఆశ్రయమిచ్చిన మరోకరి అరెస్టు

ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడు కేసులో ఎన్ఐఏ మరో నిందితుడు హర్యానాలోని ఫరీదాబాద్ కు చెందిన షోయబ్‌ను అరెస్టు చేసింది. ఉమర్ నబీకి సహకరించాడని ఎన్ఐఏ ఆరోపిస్తోంది.

11

కేంద్రంలో ఎవరున్నా కలిసి పనిచేయాలి

ప్రజాస్వామ్యంలో ఎవరు ఎన్నికైనా వారితో కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ అభిప్రాయపడ్డారు. ఇటీవల ప్రధాని నరేంద్ర మోడీని, కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన ప్రశంసిస్తున్నారు.

11

కాళీమాతను మేరీమాతగా మార్చిన పూజారి

ముంబై నగర శివారు చెంబూర్‌లోని ఒక ఆలయంలో కాళీమాత విగ్రహాన్ని మేరీమాత రూపంలోకి మార్చడం తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనకు బాధ్యుడిగా భావిస్తున్న ఆలయ పూజారిని పోలీసులు అరెస్ట్ చేసారు.

11

రాష్ట్రీయం

ద్విభాషలలో 'రాజ్యాంగం' ఎంతో మేలు

- గ్రంథాన్ని ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 26 : రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం, తెలంగాణ న్యాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు, ఇంగ్లిషు భాషలో ముద్రించిన భారత రాజ్యాంగం ద్విభాషా గ్రంథాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం విడుదల చేశారు. రాజ్యాంగాన్ని సమగ్రంగా తెలుగులో అందించడం అభినందనీయమని అన్నారు. తెలుగు భాష, సంస్కృతిని కాపాడటంతో పాటు భావి తరాలు, మేధావులు, సాహిత్యాభిమానులకు ఎంతో ఉపయుక్తంగా అందుబాటులో ఉంటుందని చెప్పారు. తెలుగులో తర్జుమా చేసి సమగ్రంగా రాజ్యాంగాన్ని తెలుగు - ఇంగ్లిషు ద్విభాషలో అందించడం వల్ల అనేక విషయాలలో స్పష్టత ఉంటుందని, ముఖ్యంగా తెలుగు వారికి, సామాన్యులకు సులభంగా రాజ్యాంగం పట్ల అవగాహన పెంచుకోవడానికి వీలవుతుందని అన్నారు. కార్యక్రమంలో న్యాయ శాఖ కార్యదర్శి పాపిరెడ్డి, లా అడిషనల్ సెక్రటరీ కె.సునీత, జాయింట్ సెక్రటరీ ,(అనువాదం) కె.గీత, తదితరులు ఉన్నారు.

తెలంగాణ వృద్ధికి సఫ్రాన్ మైలురాయి

మొదటిపేజీ తరువాయి

కల్పిస్తుందని తెలిపారు. సఫ్రాన్‌కు చెందిన ఎమ్88 మిలిటరీ ఇంజిన్ ఎమ్ఆర్వోకు కూడా శంకుస్థాపన చేసుకున్నామని వెల్లడించారు. ఈ ఎమ్ఆర్వో భారత వైమానిక దళం, భారత నావికాదళానికి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. హైదరాబాద్ దేశంలోని ప్రధాన ఏరోస్పేస్, డిఫెన్స్ హబ్ అని పేర్కొన్నారు. తెలంగాణలో 25 కంటే ఎక్కువ ప్రధాన ప్రపంచ కంపెనీలు, 1,500కి పైగా ఎంఎస్ఎంఈలు ఉన్నాయన్నారు.

ప్రగతిశీల పారిశ్రామిక విధానం

తమ ప్రగతిశీల పారిశ్రామిక విధానం, ఎమ్ఎస్ఎమ్ఈ విధానం దేశంలోనే అత్యుత్తమమైన వాటిలో ఒకటిగా నిలిచిందని రేవంత్ రెడ్డి చెప్పారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, ఏరోస్పేస్ పార్కులు, సెజ్‌లు ప్రముఖ ప్రపంచ కంపెనీల నుంచి అనేక భారీ పెట్టుబడులను ఆకర్షించాయన్నారు. సఫ్రాన్, బోయింగ్, ఎయిర్ బస్, టాటా, భారత్ ఫోర్జ్ వంటి సంస్థలు హైదరాబాద్‌ను తయారీ, పరిశోధన, అభివృద్ధి కోసం ఎంచుకున్నాయని తెలిపారు. భారతదేశంలోని ప్రముఖ ఎమ్ఆర్వో, ఏరో ఇంజిన్ హబ్‌లలో హైదరాబాద్ ఒకటన్నారు. ఏరోస్పేస్, రక్షణ రంగంలో ఎగుమతులు నిరుడు రెట్టింపయ్యాయన్నారు. తొమ్మిది నెలలలోనూ రూ.30,742 కోట్లకు చేరుకున్నాయన్నారు. పౌర విమానయాన మంత్రిత్వ శాఖ

నుంచి తెలంగాణ ఏరోస్పేస్ అవార్డును పొందిందని గుర్తు చేశారు. టాటా టెక్నాలజీస్ భాగస్వామ్యంతో తెలంగాణ 100 ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్ స్టిట్యూట్‌లను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అప్ గ్రేడ్ చేసిందని చెప్పారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్శిటీ విమానాల నిర్వహణ కోసం ప్రత్యేక శిక్షణపై దృష్టి పెడుతోందన్నారు. 30 వేల ఎకరాల విస్తీర్ణంలో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని వెల్లడించారు. తమ విజన్‌ను ఆవిష్కరించడానికి డిసెంబర్ 8, 9 తేదీలలో భారత్ ఫ్యూచర్ సిటీలో జరిగే తెలంగాణ రైజింగ్ 2047- గ్లోబల్ సమ్మిట్‌కు అందరినీ ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. 2035 నాటికి వన్ ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి త్రీ ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తెలంగాణను తీర్చిదిద్దాలని ప్రయత్నిస్తున్నామన్నారు. బెంగళూరు హైదరాబాద్‌ను డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ కారిడార్‌గా ప్రకటించాలని ప్రధానమంత్రికి విజ్ఞప్తి చేశారు.

సేవలో అగ్రగామి వాసవీ క్లబ్

- రూ. 50 లక్షల స్థలం విరాళం
- హర్షం వ్యక్తం చేసిన భగవద్గీత పారాయణ కమిటీ

ప్రతిపక్షం, షాద్‌నగర్, నవంబర్ 26: వాసవీ క్లబ్ షాద్‌నగర్, వాసవి క్లబ్ వనిత షాద్‌నగర్ ఆధ్వర్యంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు వీసీ గోల్డెన్ కేసీజీఎఫ్ ఇరుకుల రామకృష్ణ బుధవారం గుడ్ విల్ విజిట్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పలు అభివృద్ధి, సేవా కార్యక్రమాలను ప్రారంభించారు. షాద్ నగర్ లోని కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆర్యవైశ్య సంఘం షాద్‌నగర్ కోశాధికారి పోల శశిధర్ సౌజన్యంతో ఆర్థికంగా వెనుకబడిన యువతి వివాహానికి అవసరమైన పుస్తెమెట్టెలను ఇంటర్నేషనల్ అధ్యక్షుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. షాబాద్ మండలం కుర్వగూడ గ్రామంలో దాతలు పలపట్ల పాండురంగం, దండు శ్రీనివాస్, ఎలుకుర్తి శ్రీనివాస్ సహకారంతో నిర్మించిన బస్సు షెల్టర్ను ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ప్రారంభించారు. షాబాద్ మండలం సర్దార్‌నగర్‌లో దాత బూర్గు జగదీశ్వర్, అతని కుమారులు రాఘవేందర్, సతీష్ ఏర్పాటు చేసిన మరో బస్సు షెల్టర్‌ను కూడా ఇరుకుల రామకృష్ణ ప్రారంభించారు. ఈశ్వర్ కాలనీ అమ్మవారి టెంపుల్ వద్ద సిమెంట్ టేబుల్‌ను అందించారు. షాద్‌నగర్ లో భవన నిర్మాణం కోసం దాతలు ఎలుకుర్తి నారాయణ, ఎలుకుర్తి శ్రీనివాస్ పద్మావతి కాలనీలో దాదాపు రూ.50 లక్షలకు పైగా విలువైన 215 గజాల స్థలాన్ని విరాళంగా ఇచ్చారు. ఆర్యవైశ్యులు, భగవద్గీత పారాయణ కమిటీ సభ్యులు, పుర ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సర్వీస్ రివాల్వర్‌నే అమ్మేసిన ఎస్ఐ

- అధికారుల విచారణలో షాకింగ్ నిజాలు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 26 : అంబర్‌పేట్ ఠాణాలో క్రైమ్ ఎస్ఐ భానుప్రకాష్ వ్యవహారం పోలీసువర్గాలలో పెద్ద సంచలనంగా మారింది. భానుప్రకాష్ ఇటీవల నాలుగు తులాల బంగారం చోరీ కేసును విచారించారు. రికవరీ చేసిన బంగారాన్ని బాధితులకు అప్పగించకుండా.. త్వరలో ఇస్తా అని నమ్మబలికి, లోక్ అదాలత్‌లో ఇరు వర్గాలతో మాట్లాడి కేసును క్లోజ్ చేయించాడు. కేసు మూసేసిన తర్వాత కూడా బాధితులకు బంగారం ఇవ్వకుండా తాకట్టు పెట్టుకున్నట్టు విచారణలో తేలింది. విషయం పైస్థాయికి చేరడంతో అతడిపై కేసు నమోదు చేసి, సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇంతటితో ఆగకుండా.. భానుప్రకాష్ మీద మరో పెద్ద షాకింగ్ ఆరోపణ వెలుగులోకి వచ్చింది. తనకు కేటాయించిన 9ఎంఎం సర్వీస్ పిస్టల్ కనిపించడం లేదని ఇటీవల స్టేషన్‌కు వచ్చి గోల చేశాడు. డ్రాలోనే పెట్టా, ఏమైందో తెలియడం లేదని విచారణలో

చెబుతున్నట్టు సమాచారం. బెట్టింగుకు అలవాటు పడ్డ భానుప్రకాష్ దాదాపు రూ.70-80 లక్షలు పోగొట్టుకున్నట్లు తెలుస్తోంది. అప్పుల భారంతోనే భానుప్రకాష్ ఈ అక్రమాలకు పాల్పడ్డాడని అనుమానిస్తున్నారు. ఏపీలో గ్రూప్ 2 ఉద్యోగం వచ్చిందని స్టేషన్‌కు వచ్చి చెప్పి వస్తువులు తీసుకెళుతుండగా పిస్టల్ మిస్సింగ్ కథ వెలుగులోకి వచ్చింది. ఈ గన్‌ను రాయలసీమ లేదా ఇతర ప్రాంతాల ముఠాలకు అమ్మేశాడా? అన్న కోణంలో టాస్క్‌ఫోర్స్ దర్యాప్తు కొనసాగిస్తోంది.



దేశంలోనే అతిపెద్ద కుంభకోణం

- తెర లేపిన కాంగ్రెస్ ప్రభుత్వం
- 9,292 ఎకరాలు: 6.29 లక్షల కోట్ల లూటీ
- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 26 : దేశంలోనే అతిపెద్ద భూ కుంభకోణానికి తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తెరలేపిందని బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్ర పార్టీ కార్యాలయంలో బుధవారం నాడు నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ తో భూ కుంభకోణం గునించి వివరించారు. సీఎం రేవంత్ రెడ్డి తన అనుచరులతో ఈ కుంభకోణానికి పథకం వేశారని పేర్కొన్నారు. జీఓ నంబర్ 27 తో 9,292 ఎకరాలకు సంబంధించి 22 ఎస్టేట్స్‌లను మల్టీ జోన్స్‌క కన్వర్ట్ చేయడానికి దారులు వేశారన్నారు. ఎస్ఆర్ఓ విలువలో 30 శాతానికే ధారదాత్తం చేసే కుట్ర చేస్తున్నారని విమర్శించారు. ఈ ఆస్తి విలువ 6.30 లక్షల కోట్లకు పైనే ఉంటుందని, దీంతో రాష్ట్ర అప్పును సైతం తీర్చేయొచ్చునని పేర్కొన్నారు. సామాన్యులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు గతంలో పారిశ్రామికవాడలుగా గుర్తించిన ఈ భూములను, ఓఆర్ఆర్ వెలుపల గల వేల ఎకరాల భూములను ప్రభుత్వం లూటీ చేసే యోచనలో ఉన్నట్లు తెలిపారు. ఈ పాలసీ రాష్ట్ర ప్రజలకు ఏ విధంగా మేలు చేస్తుందో సీఎం రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. గత ప్రభుత్వంలో కేసీఆర్ సైతం ఇలాంటి పాలసీ తీసుకొచ్చి వేల ఎకరాల కుంభకోణం చేశారని దుయ్యబట్టారు. ఈ హిల్ట్ పాలసీని, జీఓ 27ను ను తక్షణమే రద్దు చేయాలని లేదా ఉద్యమం చేస్తామని ఏలేటి హెచ్చరించారు.

మార్చి 18 నుంచి పరీక్షలు

మొదటిపేజీ తరువాయి

ప్రారంభం కానున్నాయి. ప్రభుత్వం ఆమోదం తరువాత అధికారికంగా ప్రకటించనున్నారు. పరీక్షలకు మధ్య ఒకటిరెండు రోజుల వ్యవధి ఇవ్వాలనే ఆలోచనతో పాఠశాల విద్యాశాఖ అధికారులు మూడు రకాల షెడ్యూళ్లను రూపొందించారు. ఈ నేపథ్యంలోనే తేదీల ప్రకటనలో జాప్యం జరుగుతోందని సమాచారం. సీబీఎస్ఈ పరీక్షల విధానంలో ఎగ్జామ్స్ నిర్వహణలో వ్యవధి ఉంటుంది. అదే విధానాన్ని తెలంగాణలో పదో తరగతికి అమలు చేస్తే విద్యార్థులపై ఒత్తిడి తగ్గుతుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. విద్యార్థులు ఒత్తిడి లేకుండా చదువుకుంటారని నిపుణులు సూచిస్తున్నారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి మార్పులు లేకుండా వరుసగా నిర్వహించటం ద్వారా విద్యార్థులపై ఒత్తిడి ఉండదనే మరో వాదన ఉంది. ప్రభుత్వం తుది నిర్ణయంతో షెడ్యూల విడుదల కానుంది.

ఇమ్రాన్‌ను చంపేశారని వదంతులు

మొదటిపేజీ తరువాయి

ఆరోపించారు, తమ సోదరుడి ఆరోగ్యంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమపై పోలీసులు దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. ఈ మేరకు వారు పంజాబ్ పోలీస్ చీఫ్‌కు లేఖ రాసారు. తాము రోడ్లను దిగ్బంధించలేదని, ఎవరికీ ఆటంకం కలిగించలేదని, అయినా పోలీసులు దాడి చేశారని ఫిర్యాదు చేశారు. వీధి దీపాలను ఉద్దేశపూర్వకంగా ఆపేసి, చీకటిలో దాడికి దిగారని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, ఈ ఘటనపై పీటీఐ తీవ్రంగా స్పందించింది. ఇమ్రాన్ ఖాన్‌ను కలవాలని కోరడమే వారు చేసిన నేరమా? అని ప్రశ్నించింది. ఈ ఘటన మీద నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధ్యులైన పోలీసు సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఇమ్రాన్ ఖాన్ 2023 ఆగస్టు నుంచి అదియాలా జైలులో ఉన్నారు. ఆయనను ఏకాంత నిర్బంధంలో ఉంచారని, కనీసం పుస్తకాలు చదవనీయడం లేదని, న్యాయవాదులతో మాట్లాడేందుకు కూడా అనుమతించడం లేదని పీటీఐ నేతలు చెబుతున్నారు.

పకడ్బందీగా 'పంచాయతీ' ఎన్నికలు

మొదటిపేజీ తరువాయి

ప్రవర్తన నియమావళి పకడ్బందీగా అమలు జరిగేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని, ఉల్లంఘనల ఫిర్యాదులను స్వీకరించి త్వర త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల జియో కోఆర్డినేటర్స్, మ్యాప్ వివరాలు టి ఈ పోల్ పోర్టల్ లో నమోదు చేయడం జరిగిందని, పోలింగ్ కేంద్రాలలో కనీస సౌకర్యాలు అయిన వెలుతురు, ర్యాంపు, త్రాగునీరు, వెబ్ కాస్టింగ్, సీసీ కెమెరాలు, సామాగ్రి ఇతర వసతులు కల్పించాలని తెలిపారు. పంపిణీ కేంద్రాలను మండల కేంద్రాలలో ఏర్పాటు చేయాలని, ఫ్లయింగ్ సర్వేయలెన్స్ బృందం, స్టాటిస్టిక్ సర్వేయలెన్స్ బృందం, వీడియో సర్వేయలెన్స్ బృందం, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్ లను కౌంటింగ్ కు మూడు రోజుల ముందుగా సిద్ధం చేయాలని, పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. అదనపు డీజీపీ మహేశ్ భగవత్ మాట్లాడుతూ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బ్యాలెట్ బాక్సులు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద తగు బందోబస్తు ఏర్పాటు చేస్తామని చెప్పారు. నగదు సీజ్ చేసే సమయంలో అన్ని వివరాలు క్షుణ్ణంగా పరిశీలించిన తరువాత సీజ చేయాలన్నారు.

'గ్లోబల్ సమ్మిట్' ప్రారంభానికి ప్రధాని

మొదటిపేజీ తరువాయి

ఉండాలని చెప్పారు. ఒక్కో ఈవెంట్‌కు ఒక్కో సీనియర్ ఐఏఎస్ అధికారిని బాధ్యుడిగా నియమించాలని సూచించారు.

మౌలిక సదుపాయాల కల్పన

సమ్మిట్ కోసం ఏర్పాటు చేస్తున్న స్టాల్స్ డిజైన్లను అధికారులు వివరించారు. మౌలిక సదుపాయాల కల్పన, సంక్షేమం, పరిశ్రమలు, వైద్య రంగాలకు సంబంధించిన స్టాల్స్ విషయంలో సీఎం అవసరమైన జాగ్రత్తలను సూచించారు. సమ్మిట్ సందర్భంగా ప్రదర్శించే డ్రోన్ షో తెలంగాణ బ్రాండ్ ఇమేజీని పెంచే విధంగా ఉండాలని, అదే రీతిలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈ సదస్సుకు సంబంధించి అన్ని డిజైన్లు నెలాఖరులోగా పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు.

'పంచాయతీ' ఎన్నికలు సజావుగా జరగాలి

- అధికారులకు కలెక్టర్ నారాయణ రెడ్డి ఆదేశం

ప్రతిపక్షం రంగారెడ్డి బ్యూరో, నవంబర్ 26 : గ్రామ పంచాయతీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేలా అన్ని విధాలుగా సన్నద్ధం కావాలని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్ నుంచి ఆర్డీఓలు, ఎంపీడీఓలు, ఎంపీఓలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలని సూచించారు. నిబంధనలపై పూర్తి అవగాహనను ఏర్పర్చుకోవాలని, వివాదాలు, తప్పిదాలకు తావులేకుండా ఎన్నికల విధులను జాగ్రత్తగా నిర్వర్తించాలని అన్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున వెంటనే రాజకీయ పార్టీలకు సంబంధించిన హోర్డింగులు, పోస్టర్లను, ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల గోడలపై రాతలు ఉంటే తొలగించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సురేశ్ మోహన్, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

జీఓ నం.46ను ఉపసంహరించు కోవాలి

మొదటిపేజీ తరువాయి

లేదా వార్డు సభ్యుని సీటు కూడా కేటాయించలేదని లెక్కలతో సహా వివరించారు. బీసీలకు ఇంతకన్నా పెద్ద మోసం మరొకటి లేదని విమర్శించారు. ఈ మోసాన్ని ఖండిస్తూ రాష్ట్రవ్యాప్తంగా శాంతియుతంగా నిరసన తెలపాలన్నారు. ధర్నాలు, మౌన దీక్షలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల ఇండ్ల వద్ద దీక్షలు, ఈ నెల 29న రహదారుల దిగ్బంధం వంటి కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. రిజర్వేషన్ అమలయ్యేంత వరకు ఉద్యమాలను ఆపేది లేదని, అవసరమైతే రోజురోజుకు ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం చేసిన మోసానికి తగిన గుణపాఠం చెప్పాలని, బీసీల హక్కుల సాధన కోసం ఇదే సరైన సమయమని అన్నివర్గాల బీసీ ప్రజలు ఉద్యమాల్లో చురుకుగా పాల్గొనాలని కోరారు.

కాంగ్రెస్ ప్రభుత్వం తీరు సరిగా లేదు

శాసనమండలిలో బీఆర్ఎస్ పక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న చర్యను ఖండించారు. దీన్ని 'తడి గుడ్డతో గొంతు కోయడం లాంటిదని' వ్యాఖ్యానించారు. రిజర్వేషన్ సాధించేంతవరకు విశ్రాంతి తీసుకోబోమని చెప్పారు. ఉద్యమానికి బీఆర్ఎస్ పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని తెలిపారు. డా. వకుళాభరణం కృష్ణమోహనరావు మాట్లాడుతూ కాంగ్రెస్ అంటే మోసం అనేది ప్రజలకు తెలిసిపోయిందన్నారు. ఎన్నికలలో హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక రెండేండ్లు డ్రామా నడిపి, ఇప్పుడు ఇవ్వలేమని చేతులు ఎత్తివేయడం దుర్మార్గమని విమర్శించారు. సినీ దర్శకుడు, నిర్మాత, నటుడు ఆర్. నారాయణమూర్తి మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇలా వ్యవహరించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని తెలిపారు. బీసీ యునైటెడ్ ఫ్రంట్ చైర్మన్ పాలూరు రామకృష్ణయ్య, బీజేపీ బీసీ మోర్చా అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం కోఆర్డినేటర్ డా. ర్యాగ అరుణ్ కుమార్ తదితరులు మాట్లాడారు. వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొని సంఘీభావం ప్రకటించారు.

నిరుద్యోగులకు భారీ కుచ్చుటోపి

- ఎన్ఎస్ఎన్ ఇన్ఫోటెక్ ఘరానా మోసం
- 400 మంది నిరుద్యోగుల డబ్బు స్వాహా

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 26 : ఐటీ హబ్‌గా పేరొందిన మాదాపూర్‌లో మరోసారి ఘరానా మోసం బయటపడింది. 'ఎన్ఎస్ఎన్ ఇన్ఫోటెక్' పేరుతో నడిచిన ఒక ఫేక్ ఐటీ కంపెనీ, నిరుద్యోగ యువతకు శిక్షణ, ఉద్యోగం ఆశగా చూపి కోట్లాది రూపాయలు దోచుకుని రాత్రికి రాత్రి బోర్డు తిప్పేసింది. దీని మాస్టర్‌మైండ్ స్వామి నాయుడు, అతని ఫ్యామిలీ పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు. ఎన్ఎస్ఎన్ ఇన్ఫోటెక్ కంపెనీ మాదాపూర్‌లోని ఓ భవనంలో గత కొన్ని నెలలుగా కార్యకలాపాలను

నడిపింది. 'ఫుల్ స్టాక్ డెవలపర్, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ' వంటి హైడిమాండ్ కోర్సులకు శిక్షణ ఇచ్చి, శిక్షణ అనంతరం తమ కంపెనీలోనే ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చింది. ఒక్కో విద్యార్థి నుంచి రూ. 2.5 లక్షల నుంచి రూ. 3 లక్షల వరకు ఫీజు వసూలు చేసింది. ఇలా దాదాపు 400 మంది విద్యార్థుల నుంచి దాదాపు రూ. 10 కోట్ల నుంచి 12 కోట్ల వరకు సొమ్ము సేకరించారని సమాచారం. బుధవారం ఉదయం క్లాసులకు వచ్చిన విద్యార్థులు షాకయ్యారు. కంపెనీ బోర్డు తిప్పేసి, తలుపులు మూసి ఉన్నాయి. యాజమాన్యం ఫోన్లు స్విచ్ ఆఫ్. వాట్సాప్ గ్రూపులు డిలీట్ చేసింది. కంపెనీకి చెందిన స్వామి నాయుడు, అతని భార్య, మరికొందరు కీలక వ్యక్తులు జాడే లేకుండా పోయారు.

బీఆర్ఎస్ హయాంలో ఎన్టీపీసీ నుంచి ఫేజ్-1లో రూ.4.88 నుంచి రూ.5.98లకు ఒక యూనిట్ చొప్పున 1600 యూనిట్లు.. ఫేజ్-2లో రూ. 4.12కు ఒక యూనిట్ చొప్పున 2400 యూనిట్లకు అగ్రిమెంట్ చేశాం. సీఎం రేవంత్ రెడ్డి తక్కువ ధరకు వచ్చే కరెంటును వద్దని, అప్పు చేసి మరీ ఎక్కువ ధరకు కరెంటు కొనాలనుకోవడంలో మత్లబ్ ఏంటీ?.

- మాజీ మంత్రి హరీశ్ రావు

రాజకీయం

అంగరంగ వైభవంగా 'సూర్య' నిశ్చితార్థం

- గవర్నర్, సీఎం సహా పలువురు ప్రముఖులు హాజరు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 26: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నందిని విక్రమార్క దంపతుల పెద్ద కుమారుడు సూర్య విక్రమాదిత్య, సాక్షిల వివాహ నిశ్చితార్థ వేడుక ప్రజా భవన్ లో బుధవారం అంగరంగ వైభంగా జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతులు, గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మెగా స్టార్ చిరంజీవి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, బ్రహ్మానందం, టి. సుబ్బరామిరెడ్డి తదితరులు కాబోయే వధూవరులను ఆశీర్వదించారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, వాకిటి శ్రీహరి, శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, మొహమ్మద్ అజరుద్దీన్, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సీతక్క, కొండా సురేఖ మంత్రులు ఆశీర్వదించారు. ఎన్టీవీ చైర్మన్ నరేంద్ర చౌదరి, ఏబీఎన్ సీఎండీ వేమూరి రాధాకృష్ణ, ఈనాడు సంస్థల చైర్మన్ కిరణ్, టీవీ9 మేనేజింగ్ ఎడిటర్ రజనీకాంత్, సీఎల్ రాజం తదితరులు ఆశీర్వదించారు. గీతారెడ్డి, పోచారం శ్రీనివాస రెడ్డి, కల్వకుంట్ల కవిత, జగదీష్‌రెడ్డి, రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తదితరులు కార్యక్రమానికి హాజరయ్యారు.

వార్డు నుంచి జడ్పీటీసీ దాకా పోటీ

- బీజేపీ రాష్ట్ర శాఖ సంచలన నిర్ణయం
- శ్రేణులతో కీలక నేతల వీడియో కాన్ఫరెన్స్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 26: పంచాయతీ ఎన్నికలపై బీజేపీ కీలక నిర్ణయం తీసుకుంది. వార్డు మెంబర్ నుండి జడ్పీటీసీ దాకా అన్ని స్థానాలలో పోటీ చేయాలని తీర్మానించింది. పంచాయతీ ఎన్నికలపై బుధవారం నాడు పార్టీ నేతలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. బీజేపీ స్టేట్ చీఫ్ రామచందర్ రావు, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ పాల్గొన్నారు. స్థానిక ఎన్నికలలో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. కేంద్రం నిధులతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతోందని అన్నారు. రెండు సంవత్సరాలలో పంచాయితీలను పూర్తిగా నిర్వీర్యం చేసిన కాంగ్రెస్ పార్టీ ఏ ముఖం పెట్టుకొని ఎన్నికలలో పోటీ చేస్తుందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు ప్రశ్నించారు. గ్రామ పంచాయతీలన్ని దివాళా తీసే పరిస్థితికి బీఆర్ఎస్ తీసుకువస్తే దాన్ని కొనసాగించింది కాంగ్రెస్ పార్టీ అని విమర్శించారు. రైతు వేదికలు, హరితహారం, శ్మశానవాటికలు ఏవి కట్టినా అవన్నీ కేంద్ర ప్రభుత్వ నిధులేనన్నారు. ఏ పని కూడా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా కేటాయించలేదన్నారు. ఉపాధి హామీ పథకం నిధులు కూడా డైవర్ట్ చేసిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ దేనన్నారు. గ్రామీణ పేదలను బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తున్నాయని ధ్వజమెత్తారు.

ప్రాంతాలు వేరైనా మనమంతా ఒక్కటే

- పరస్పర సహకారంతో ముందుకు సాగుదాం
- ఆరోగ్య సదస్సులో మంత్రి దామోదర రాజనర్సింహా

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 26: 'తెలంగాణ -నార్త్ ఈస్ట్ కనెక్ట్'లో భాగంగా రాజ్‌భవన్‌లో జరుగుతున్న ఆరోగ్య సదస్సులో ఆరోగ్య మంత్రి దామోదర్ రాజనర్సింహా బుధవారం పాల్గొన్నారు. రాష్ట్రాలు వేరైనా, దేశ పౌరులుగా మనమంతా ఒక్కటేనని, పరస్పర సహకారంతో కలిసికట్టుగా ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. భిన్న సంస్కృతులు, సాంప్రదాయాలు, భాషలు భారతదేశ బలం అని, ఆ భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడుకుంటూ దేశాన్ని అభివృద్ధి చేసుకోవడానికి ఇలాంటి సదస్సులు దోహదపడతాయన్నారు. ఈశాన్య రాష్ట్రాలతో తెలంగాణ బంధాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. 'రాష్ట్రమేదైనా, ఏ ప్రాంతంలో నివసించే ప్రజలైనా ఆరోగ్యం విషయంలో కోరుకునేది ఒక్కటే, అనారోగ్యం, అత్యవసర ఆపద వచ్చినప్పుడు తక్షణ, మెరుగైన వైద్య సేవలు పొందాలని, చికిత్సకయ్యే ఖర్చు అందుబాటులో ఉండాలని అనుకుంటారు. ప్రభుత్వాలుగా ప్రజలకు ఏది అవసరమో అది ఇస్తూ, వారి ఆశయాలకు అనుగుణంగా పనిచేయడం మన బాధ్యత' అని అన్నారు. ప్రజలకు ఉచితంగా మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో నూ ఈశాన్య రాష్ట్రాల ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. ఆరోగ్యపరంగా ఎటువంటి సహకారానికైనా తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

కేటీఆర్ హరీశ్ రావుది ఫ్యూడల్ మెంటాలిటీ

- చీరల పంపిణీపై దుష్ప్రచారం చేస్తున్నారు
- తీవ్రంగా మండిపడిన మంత్రి డా. సీతక్క

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 26 : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇందిరమ్మ చీరల' పంపిణీ కార్యక్రమం మీద బీఆర్ఎస్ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని మంత్రి సీతక్క మండిపడ్డారు. కేటీఆర్, హరీశ్ రావు తీరును ఆమె ఫ్యూడల్ మెంటాలిటీగా అభివర్ణించారు. సంతోషంగా ఉంటే కండ్లలో నిప్పులు పోసుకుంటున్నారన్నారు. ఇందిరమ్మ జన్మదినం సందర్భంగా రాష్ట్రంలోని ఆడబిడ్డలు, మహిళా సంఘాల సభ్యులు స్వయంగా ఎంపిక చేసుకున్న డిజైన్లు, కలర్స్‌తోనే చీరలను పంపిణీ చేస్తున్నామని స్పష్టం చేశారు. ఆడబిడ్డలు చీరలు తీసుకుని సంతోషంగా ఉంటే, ఆ ఆనందం బీఆర్ఎస్ నేతలకు, ముఖ్యంగా కల్వకుంట్ల కుటుంబానికి కనిపించడం లేదని మండిపడ్డారు. మహిళలు ఎదుగుతుంటే, సంతోషంగా ఉంటే ఓర్వలేనితనం వారిదని అన్నారు. బీఆర్ఎస్ పాలకుల మాదిరిగా తాము ఈ చీరలను సూరత్ లేదా దుబాయి నుంచి కిలోల లెక్కన తీసుకురాలేదని మంత్రి సీతక్క ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ చీరలు సిరిసిల్ల నేతన్నలు తమ చేతితో స్వయంగా నేసినవని కొనియాడారు. బీఆర్ఎస్ నేతలు కావాలని చీరలు బాగా లేవంటూ మాట్లాడటం సిరిసిల్ల నేతన్నలని అవమానించేలా ఉందన్నారు.

రేవంత్ రెడ్డి సర్కారు 50 వేల కోట్ల 'పవర్' స్కాం

- బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపణ



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 26: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం మరో భారీ అవినీతికి పాల్పడిందని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో బుధవారం జరిగిన ప్రెస్ మీట్ లో ఆయన మాట్లాడారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం 'ఇండియాస్ బిగ్గెస్ట్ ల్యాండ్ స్కాం' తర్వాత ఇప్పుడు దాదాపు 50 వేల కోట్ల విలువైన పవర్ స్కాంకు రూపకల్పన చేసిందని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో 30-40 శాతం వరకు కమీషన్లు పంచుకునే ప్రయత్నం జరుగుతోందని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం చేసే ప్రతి చర్య వెనుక 'కమీషన్' ప్రధాన లక్ష్యం అయిపోయిందని, ప్రజల సంక్షేమం, రాష్ట్ర ప్రగతి మీద కాకుండా వాటాల పంచుకోవడంపైనే దృష్టి ఉందని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కేసీఆర్ చేసిన హెచ్చరికలు ఇపుడు నిజమయ్యాయని అన్నారు. రామగుండం, పాల్వంచ, మక్తల్ ప్రాంతాలలో 800 మెగావాట్ల చొప్పున కొత్త థర్మల్ ప్రాజెక్టులను ప్రతిపాదిస్తూ ప్రభుత్వం భారీ ఖర్చులకు శ్రీకారం చుట్టిందన్నారు. ఎన్టీపీసీ ఇప్పటికే 12.23 కోట్ల రూపాయలతో మెగావాట్ నిర్మాణానికి డీపీఆర్ రూపొందించినప్పటికీ, జెన్కో మాత్రం 14 కోట్లు ఖర్చవుతుందనడం అనుమానాస్పదమని అన్నారు. ఇంతకుముందు బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన మెగావాట్ కాస్ట్ 8.63 నుండి 12.23 కోట్లు మధ్యలో ఉండగా, ఇప్పుడు 14 కోట్లు, పూర్తి అయ్యే సరికి 16 కోట్లు వరకు పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ ఖర్చుల తేడా వల్ల ఒక్క 800 మెగావాట్ల ప్లాంట్ పైనే సుమారు 5600 కోట్ల రూపాయల అదనపు భారం పడుతుందని తెలిపారు. ఎన్టీపీసీ 2400 మెగావాట్ల విద్యుత్‌ను 4.12 రూపాయలకే ఇవ్వడానికి సిద్ధంగా ఉందని, అయినా ప్రభుత్వం తిరస్కరించిందని హరీశ్ రావు ఆరోపించారు. స్కాంలపై విచారణ జరపాలని, బీజేపీకూడా స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు.

విలేఖరి ముసుగులో బ్లాక్‌మెయిల్ దందా!

- ఉద్యోగులు, అధికారులను బెదిరిస్తూ వార్తలు
- జర్నలిస్టు నాయకులకు ఫిర్యాదు చేయనున్న బాధితులు?

ప్రతిపక్షం ఆదిలాబాద్ బ్యూరో, నవంబర్ 26: ఏ మాత్రం అవగాహన లేని కొందరు విలేకరులుగా చలామణి అవుతూ బ్లాక్‌మెయిల్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజా సమస్యలను పక్కనపెట్టి ఉద్యోగులు, అధికారుల మీద వార్తలు రాయడం పరిపాటిగా మారిందని అంటున్నారు. మంచిర్యాల జిల్లా మందమర్రి పోస్ట్ ఆఫీస్ ఏరియా సీఐఎస్ఎఫ్ కాలనీకి చెందిన ఓ విలేకరి ఆగడాలు రోజు రోజుకూ మితిమీరి పోతున్నాయని అధికారులు, ఉద్యోగులు వాపోతున్నారు. ప్రభుత్వ అధికారుల నుంచి మొదలుకొని సింగరేణి అధికారులు, ఉద్యోగులపై అబద్ధపు కట్టు కథనాలను రాస్తూ సామాజిక మాధ్యమాలలో పోస్టులు పెట్టి పబ్బం గడుపుకుంటున్నాడని బాహాటంగానే విమర్శిస్తున్నారు. సింగరేణి అధికారులను బ్లాక్‌మెయిల్ చేసి మందమర్రిలో సింగరేణి క్వార్టరు కబ్జా చేశారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. గతంలో మంచిర్యాల కలెక్టర్ కార్యాలయంలో పని చేస్తున్న అధికారిని వేధిస్తే, తట్టుకోలేక ఆ అధికారి కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాకు బదిలీ చేయించుకుని వెళ్లాడని సమాచారం. దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన ఒక వీరుని పేరిట స్వచ్ఛంద సంస్థ పెట్టి అందులో చాలా మంది యువకులను చేరదీసి బ్యాంకుల నుంచి వారి పేరిట రుణాలు తీసుకున్నాడని, విషయం తెలుసుకున్న యువత కూడా దూరం కావడంతో ప్రస్తుతం విలేకరిగా చలామణి అవుతూ బ్లాక్‌మెయిల్ దందా చేస్తున్నాడని పలువురు అధికారులు చెబుతున్నారు. మంచిర్యాల జిల్లాలో ఆయన బాధితులు పెద్ద సంఖ్యలో ఉన్నారని తెలుస్తోంది. జర్నలిస్టులు తలదించుకునేలా, సమాజం పట్ల కనీస బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నాడని బాధితులు వాపోతున్నారు. మందమర్రి పోలీసు స్టేషన్‌లో సదరు విలేఖరిపై ఓ దొంగతనం కేసు కూడ ఉన్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం మంచిర్యాల జిల్లాలోని సదరు విలేఖరి వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. బాధితులు త్వరలోనే జర్నలిస్టు సంఘాల నాయకులు, స్థానిక ప్రెస్ క్లబ్‌బాధ్యులకు ఫిర్యాదు చేయడానికి నిర్ణయించుకున్నట్లు సమాచారం.

బీసీ రిజర్వేషన్ కోసం జాగృతి ఉద్యమం

- కాంగ్రెస్ ను వ్యతిరేకించాలన్న కవిత

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 26 : తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బీసీ రిజర్వేషన్లపై ఘాటుగా స్పందించారు. గ్రామ పంచాయితీ ఎన్నికలలో బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేశారు. 'బీసీలకు ద్రోహం చేస్తున్న కాంగ్రెస్ గద్దెలను కూలగొట్టాలి. ఈ పార్టీతో మనకు ఎటువంటి అవసరం లేదు' అని ఆమె తెలిపారు. 'గ్రామ పంచాయితీలవారీగా అన్ని కులాల జనాభాను వెల్లడించాలి. బీసీ రిజర్వేషన్ల విషయంలో కులగణన తప్పుల కారణంగా బీసీలకు న్యాయం జరగడం లేదు. మేము 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేవరకు పోరాటం కొనసాగిస్తాం' అని పేర్కొన్నారు. అంబేడ్కర్ రాయించిన రాజ్యాంగం ప్రకారం అన్ని వెనుకబడిన వర్గాలకు అవకాశాలు రావాలని అన్నారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో బీసీల హక్కుల కోసం నిరంతరం ఉద్యమం జరిగిందని, తెలంగాణ ప్రభుత్వం కూడా ఇదే అంశంలో అంగీకారం ఇచ్చినప్పటికీ అమలు లేదని' ఆమె తెలిపారు. 'నాన్ రిజర్వేషన్ ఉన్న గ్రామ పంచాయితీలలో బీసీలు పెద్ద ఎత్తున నామినేషన్లు వేయాలి. ప్రతి గ్రామ పంచాయతీలో బీసీలు గెలిచే విధంగా పోరాటం జరగాలి. అవసరమైతే ఎన్నికలను పద్ధతిగా రద్దు చేయాలని కూడా మేము కోరుతున్నాం' అని కవిత చెప్పారు. చెప్పింది. బీజేపీ ఈ సమస్యపై స్పందించలేదని, ప్రత్యక్ష ప్రతిపక్షం కూడా నిద్రపోతుందని విమర్శించారు.

ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటా

- ఎమ్మెల్యేగా నవీన్‌యాదవ్ ప్రమాణం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 26: ఉప ఎన్నికలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా గెలుపొందిన వొల్లాల నవీన్ యాదవ్ బుధవారం ప్రమాణస్వీకారం స్వీకారం చేశారు. స్పీకర్ ప్రసాద్ కుమార్ తన ఆఫీసులో నవీన్ చేత ప్రమాణం చేయించారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ రాజ్యాంగ దినోత్సవం రోజు ప్రమాణ స్వీకారం చేయడం తన అదృష్టమన్నారు. జూబ్లీహిల్స్ ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలపెట్టుకుంటానని తెలిపారు. జూబ్లీహిల్స్ అభివృద్ధి కోసం పని చేస్తానని, ఇచ్చిన హామీలు నెరవేరుస్తామని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేగా గెలిచాక నియోజకవర్గంలోని స్థానిక సమస్యలు తన దృష్టికి వచ్చినట్లు తెలిపారు. సోషల్ మీడియాలో తనతో పాటు కుటుంబ సభ్యులను వ్యక్తిగత టార్గెట్ చేశారని మండిపడ్డారు. జూబ్లీహిల్స్ గెలుపు ప్రజలకు కాంగ్రెస్ పార్టీపై నమ్మకానికి మరింత పెంచిందన్నారు. మాగంటి గోపీనాథ్ చనిపోక పోయినా జూబ్లీహిల్స్‌లో బైపోల్ వచ్చేదన్నారు. కేసు కోర్టులో ఉన్న సమయంలోనే గోపీనాథ్ కాలం చేశారని చెప్పుకొచ్చారు. గోపీనాథ్‌పై వేసిన కేసును వెనక్కి తీసుకున్నట్లు తెలిపారు. ఉప ఎన్నికలో మద్దతు తెలిపిన ఎంఐఎం పార్టీకి కృతజ్ఞతలు తెలియజేశారు.

సేవామార్గంలో ఖమ్మం యువకులు

- యువనేత మురళీ కృష్ణ జన్మదిన వేడుకలు

ప్రతిపక్షం ఖమ్మం బ్యూరో, నవంబర్ 26 : తమ అభిమాన నాయకుడు బలుసు మురళి అన్న జన్మదినాన్ని పురస్కరించుకుని, పలు సేవా కార్యక్రమాలు చేపట్టామని ఆయన అనుచరులు తెలిపారు. 'ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి పరిసరాలలో ఆహార సాయం అందించాము. గాయత్రి రిహాబిలిటేషన్ సెంటర్‌లో ప్రత్యేక అవసరాలున్న చిన్నారులతో కలిసి కేక్ కట్టింగ్ నిర్వహించి, వారికి అవసరమైన వస్తువులను అందజేసాం. పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న నిరాశ్రయులకు ఆహార పంపిణీ, పేదలకు బ్లాంకెట్లు పంపిణీ వంటి అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించాం' అని చెప్పారు. ఈ అన్ని సేవా కార్యక్రమాల ద్వారా తమ అన్న సేవాస్ఫూర్తిని ప్రజలలోకి తీసుకెళ్లడం తమ లక్ష్యం అని ప్రజల సేవ కోసం ఎల్లప్పుడూ ముందుండే అన్నకు దేవుడుఆరోగ్యం, సుఖసంతోషాలు, సర్వం ప్రసాదించాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో సాయి కృష్ణ చైతన్య, కొమ్ము మహేష్, పసునూటి సురేష్, కొనపర్తి గోపి, పోలూరి భరత్ చౌదరి, బొబ్బల సాయికుమార్, కోమటిలి అభినవ్, తుంగల నాని వర్మ పాల్గొన్నారు.

ఫ్యామిలీకి కలిసొచ్చిన రిజర్వేషన్

- ఒకే కుటుంబానికి మూడు పదవులు

ప్రతిపక్షం రంగారెడ్డి బ్యూరో, నవంబర్ 26 : పంచాయతీ రిజర్వేషన్ ఓ కుటుంబానికి అనుకోకుండా కలిసివచ్చింది. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం మంతన్ గౌడ్ ఈ కుటుంబంలో ఉంది. ఇక్కడ 494 మంది ఓటర్లు ఉండగా, 8 వార్డులు ఉన్నాయి. సర్పంచ్ పదవి ఎస్టీ జనరల్ కు, రెండు వార్డులలో ఒకటి ఎస్టీ జనరల్, మరొకటి ఎస్టీ మహిళకు దక్కింది. అయితే, గ్రామంలో ఎరుకలి బీమప్పకు చెందిన ఒకే ఒక ఎస్టీ కులానికి చెందిన కుటుంబం ఉంది. భీమప్ప, వెంకటమ్మ దంపతులు బుట్టలు అల్లుతూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఎల్లప్ప, మహేశ్ అనే ఇద్దరు కుమారులు, స్వప్న, సుజాత ఇద్దరు కోడండ్లు ఉన్నారు. ఆరుగురు ఓటు హక్కు కలిగి ఉన్నారు. ఇద్దరు కుమారులు హైదరాబాదులో ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. ఈ ఫ్యామిలీ నుంచే ఎవరో ఒకరు సర్పంచ్ ఖాయం. మూడు పదవులలో ఆ కుటుంబసభ్యులు ఏకగ్రీవం కానున్నారు. గ్రామస్తులందరూ కలిసి సూచించిన మేరకు ఎవరు సర్పంచ్ గా, ఎవరు వార్డు సభ్యులుగా ఉండాలో నిర్ణయించుకుంటామంటున్నారు ఆ కుటుంబ పెద్ద భీమప్ప.

రాంపూర్ ప్రాథమిక పాఠశాలలో స్వయం పాలన

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 26: నిజాంపేట మండల పరిధిలోని రాంపూర్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులే ఉపాధ్యాయులుగా అవతారమెత్తారు. స్వయం పాలన దినోత్సవం జరుపుకున్నారు. పిల్లలకు పాఠాలు చెప్పడం వారికి గొప్ప అనుభూతిని ఇస్తుందని ,భవిష్యత్తులో గొప్పవారుగా కావడానికి, విద్యార్థుల స్వీయ క్రమ శిక్షణకు ఉపయోగపడతాయని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పరశురాములు గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ఇచ్చారు. హెచ్ఎం గా సింధూర, డీఈఓగా సహర్షిణి , ఎంఈఓగా హార్దిక్ వ్యవహరించారు. కార్యక్రమంలో టీచర్లు గీత, సృజన, వాలంటీర్లు పాల్గొన్నారు.

చెక్ డ్యామ్ బ్లాస్ట్ చేశారని ప్రభుత్వ ఇరిగేషన్ డిప్యూటీ ఇంజినీర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 2024లో ఈ చెక్ డ్యామ్ పూర్తయింది. దానికి విజిలెన్స్ అధికారులు పరీక్షించి నాణ్యత బాగుందని చెప్పారు. డ్యామ్ నాణ్యత బాగుందని చెప్పిన తర్వాత, నాణ్యతా లోపంతో ఎలా కూలిందంటారు.

- ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

ఓపెన్ వాయిస్

టాలీవుడ్‌కు ఐ బొమ్మ రవి సవాల్!

ఇప్పుడు ఎక్కడ చూసినా సరే ఐ బొమ్మ రవి పేరే వినిపిస్తోంది. మారుమూల పల్లెటూర్లలో కూడా రవి పేరు మార్మోగిపోతుంది. పోలీసుల దృష్టిలో అతడో పైరసీ దొంగ. టాలీవుడ్ కోణంలో అతడో రాబిన్‌హుడ్. సామాన్యుల మాటలలో అతడో చిన్నపాటి దేవుడు. ఇలా ఐ బొమ్మ రవి చుట్టూ ఒక రక్తి కట్టించే వెబ్ సిరీస్ పరుగులు పెడుతోంది. రవి ఇప్పుడు తెలుగు రాష్ట్రాలలో 'టాక్ ఆఫ్ ది స్టేట్'గా మారాడు. ఎవడైనా దొంగ దొరికితే 'చట్టప్రకారం శిక్షించండి' అన్నది అన్ని వర్గాల నుంచి వచ్చే మాట. కానీ, ఐ బొమ్మరవిని దొంగ అంటూనే దేవుడుగా కీర్తిస్తోంది ప్రేక్షకుల లోకం. అసలు దొంగలు టాలీవుడ్‌లోనే ఉన్నారంటూ ఎదురుదాడికి దిగుతున్నారు మరికొందరు. ఎవరి వాదన ఎలా ఉన్నా, ఇప్పుడు ఐ బొమ్మరవి రాబిన్‌హుడ్‌తో పోల్చుతున్నారు. పోలీసులు, సినీ ఇండస్ట్రీ చీటర్, హ్యాకర్ అంటున్నా సరే సామాన్య జనాలు మాత్రం మా హీరో అంటున్నారు. ఇంతకీ ఐ బొమ్మ రవి ఇంత భారీ మద్దతు ఎలా కూడగట్టాడనేదే ఇక్కడ అందరిలో మెదులుతున్న ప్రశ్న. దానికి కారణం కూడా సినిమా ఇండస్ట్రీ అనే చెప్పాలి. ఔను సినిమావాళ్లు చేస్తున్న పనుల వల్లే ఐ బొమ్మ రవి సామాన్యుల హీరో అయ్యాడు. సింగిల్ థియేటర్ల ప్లేస్ లో మల్టీప్లెక్స్ లు వచ్చి పడ్డాయి. టికెట్ కౌంటర్ క్లోజ్ అయి బుక్ మై షో లాంటివి వచ్చేసాయి. ప్రతి సినిమాకు విపరీతంగా టికెట్ రేట్లు పెంచేసి అమ్ముకుంటున్నారు. పైగా ప్రభుత్వాలు స్పెషల్ జీఓలు ఇచ్చి మరి బెనిఫిట్ షోలు, టికెట్ రేట్ల పెంపు లాంటివి చేయడం వల్ల సామాన్యులు సినిమా థియేటర్లకు వెళ్లి సినిమాలు చూసే పరిస్థితి లేకుండా పోయింది. వీటికి తోడు ఒక ఫ్యామిలీ సినిమా థియేటర్ కు వెళితే పాప్‌కార్న్, సమోసాలు, కూల్ డ్రింక్స్, వాటర్ బాటిల్ లాంటివి బయట దొరికే రేట్ల కంటే 20 రేట్లు ఎక్కువగా పెంచేసి అమ్మడంతో సామాన్యుల జేబుకు చిల్లు పడుతోంది. పైరసీ తప్పయితే సినిమా టికెట్ల రేట్లు పెంచడమూ తప్పే. 'ఒక ఇంటిలో నలుగురం సినిమాకు పోతే మూడు వేలు ఖతం అవుతున్నాయి. ఐ బొమ్మలో ఫ్రీగా ఇంటిల్లిపాదీ సినిమా చూస్తున్నం' అని అంటున్నారు నెటిజెనులు. ఇంతకు సినిమా నిర్మాతలను వందల కోట్లు పెట్టి ఎవరు సినిమాలు తీయమన్నారంటూ ప్రశ్నిస్తున్నారు. మొన్నటి ప్రెస్ మీట్ లో ఐ బొమ్మ రవిని ఎన్ కౌంటర్ చేయాలన్న నిర్మాత సి. కల్యాణ్ పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆయన చేసిన తప్పుల చిట్టాను ఎత్తి చూపుతున్నారు. పైరసీ చేసేవాళ్లు సంఘ సేవ చేయడం లేదన్న ఎస్ఎస్ రాజమౌళికీ నెటిజెనులు గట్టి జవాబు చెప్పారు. 'మీరేమైనా సంఘ సేవ చేస్తున్నారా? వినోదం పేరుతో బిజినెస్ చేస్తున్నారు కదా? మిమ్మల్ని విదేశాలకు వెళ్లి ఎవరు షూటింగు చేయుమన్నారని' ప్రశ్నిస్తున్నారు. వందల కోట్లు పెట్టి సినిమా ఎవరు తీయమన్నారంటూ సీరియస్ అవుతున్నారు. పైరసీ చేయడం తప్పయితే టికెట్ల రేట్లు పెంచుకోవడం కూడా తప్పే అని ముక్త కంఠంతో వాదిస్తున్నారు. మన తెలుగు రాష్ట్రాలలో సినిమాలను విపరీతంగా ఇష్టపడే జనాలు ఎక్కువ. సినిమాలు చూడాలనే ఆశ ఉన్నా సరే కుటుంబాన్ని తీసుకొని వెళ్లి చూడగలిగే పరిస్థితులు లేకపోవడంతో సామాన్యులు అందరూ కూడా ఐ బొమ్మను ఎంచుకున్నారు. వేలు పెడితే గాని సినిమా చూడలేని వాళ్లకు ఉచితంగా ఐ బొమ్మలో సినిమాలు చూసే అవకాశం రావడం వల్ల థియేటర్లకు వెళ్లి సినిమాలు చూసేవారు చాలా తగ్గిపోయారు. క్రమక్రమంగా ఇది పెరిగి థియేటర్లకు వెళ్లే వాళ్ళ సంఖ్య భారీగా తగ్గిపోయి ఐ బొమ్మకు విపరీతంగా క్రేజ్ పెరిగింది. సోషల్ మీడియాలో రోజురోజుకు మద్దతు పెరుగుతోంది. సోషల్ మీడియా ప్లాట్ ఫాంలలో 'ఐ బొమ్మ' ట్రెండింగ్‌లో ఉంది. పేదలు, మధ్య తరగతి కోసమే పైరసీ చేశాడంటూ పోస్టులు పెడుతున్నారు. థియేటర్ రేట్లు భారీగా పెంచడంతోనే ఐబొమ్మకు అలవాటు పడ్డామం అభిప్రాయాలు కూడా వస్తున్నాయి. సామాన్యులకు అందనంత రేట్లు పెంచి సినిమా థియేటర్లకు రానివ్వని పరిస్థితి తీసుకొచ్చింది టాలీవుడ్‌లోని కొందరు పెద్దలే అంటూ ఐ బొమ్మ రవిని దేవుడిని చేసి చూస్తోంది ప్రేక్షకలోకం. అతడు తమ దృష్టిలో హీరో అని, అసలు విలన్ టాలీవుడే అని పాయింట్‌తో ఐ బొమ్మ రవికి అండగా నిలుస్తున్నారు కొందరు ప్రేక్షకులు.

ప్రతిపక్షం
హైదరాబాద్
గురువారం
27.11.2025

యూఎన్ఓ సంస్కరణలు: గ్లోబల్ న్యాయం

ప్రధాని మోడీ జోహన్నెస్ బర్గ్ లో వివిధ దేశాల అధినేతలతో ద్వైపాక్షిక సమావేశాలను నిర్వహించారు. ఆయన కెనడా ప్రధాని కార్నీ, జపాన్ ప్రధాని తకాయిచీ, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ, జమైకా ప్రధాని హోల్నెస్, నెదర్లాండ్స్ ప్రధాని డిక్ స్కూఫ్ తో సమావేశమయ్యారు. ఈ సమావేశాలలో వ్యాపారం, వాణిజ్యం, పెట్టుబడులు, కీలక రంగాలలో పరస్పర సహకారంపై చర్చించారు. జీ20 సదస్సు సందర్భంగా దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసాతో ప్రత్యేక సమావేశం జరిగింది. సమావేశంలో వ్యాపారం, వాణిజ్యం, మైనింగ్, అరుదైన ఖనిజాలు, కృత్రిమ మేధస్సు, ఆహార భద్రత వంటి రంగాల్లో పరస్పర సహకారంపై విస్తృతంగా చర్చించారు.

డా. కోలాహలం రామ్ కిశోర్
9849328496

ఆధునిక ప్రపంచ వాస్తవాలకు అనుగుణంగా అంతర్జాతీయ సంస్థలు పరిణామం చెందుతూ ఉండాల్సిన అవసరం ఈ రోజులలో ఎంతగానో ఉంది. దక్షిణాఫ్రికా జోహన్నెస్బర్గ్ లో 23 నవంబర్ 2025న జరిగిన ఇండియా బ్రెజిల్ దక్షిణాఫ్రికా (ఐబీఎస్ఏ) నేతల శిఖరాగ్ర సదస్సులో ఈ అవసరాన్ని భారత ప్రధాని నరేంద్ర మోడీ స్పష్టంగా వివరించారు. ప్రపంచ దేశాల మధ్య విభజనలు, అడ్డుగోడలు కనిపిస్తున్న ప్రస్తుత సమయంలో, ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సంస్కరణలు ఇకపై ఐచ్ఛికం కాదని, అవసరమని ఆయన తేల్చి చెప్పారు. ఐబీఎస్ఏ మూడు దేశాల వేదిక మాత్రమే కాదు, ఇది మూడు ఖండాలను, మూడు ప్రధాన ప్రజాస్వామ్య శక్తులను, మూడు ముఖ్యమైన ఆర్థిక వ్యవస్థలను కలిపే కీలకమైన వేదిక. ఈ సంస్థ దక్షిణందక్షిణం సహకారానికి ఒక ప్రత్యేక నమూనాగా నిలుస్తోంది. ప్రధాని నరేంద్ర మోడీ ఈ వేదికను 'మన వైవిధ్యం,అటు 'భాగస్వామ్య విలువలు ఉమ్మడి ఆకాంక్షలలో పాతుకుపోయిన లోతైన, శాశ్వతమైన భాగస్వామ్యం' గా వర్ణించారు . గ్లోబల్ సౌత్ దేశాలు వరుసగా నాలుగు జీ20లో అధ్యక్ష హోదాలో నిర్వహించిన నేపథ్యంలో ఈ సదస్సు ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇందులో చివరగా మూడు జీ20 సదస్సులను ఐబీఎస్ఏ సభ్య దేశాలే నిర్వహించాయి.

ఐరాస సంస్కరణలు అనివార్యం

ప్రధాని మోడీ ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సంస్కరణలపై నిర్ధారిత, స్పష్టమైన వైఖరి తీసుకున్నారు. 'ప్రపంచ సంస్థలు 21వ శతాబ్దపు వాస్తవాలను ప్రతిబింబించడం లేదు. మనలో ఎవరికీ ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం లేదు. ఇది ప్రపంచ సంస్థలు నేటి ప్రపంచానికి ఇకపై ప్రాతినిధ్యం వహించడం లేదని స్పష్టంగా రుజువు చేస్తోంది' 'సంస్థాగత సంస్కరణ అనేది ఒక ఎంపిక కాదు. అది ఒక హక్కు' అని నొక్కి చెప్పారు. భద్రతా మండలి ప్రస్తుత నిర్మాణం రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ప్రపంచానికి ప్రతిబింబంగా ఉంది. ఐదు శాశ్వత సభ్య దేశాలు (అమెరికా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, చైనా) వీటిని పీ5 అని పిలుస్తారు వీటో అధికారాన్ని కలిగి ఉండగా, 10 తాత్కాలిక సభ్య దేశాలు రెండు సంవత్సరాల పాటు ఎన్నికై ఉంటాయి. ఈ నిర్మాణంలో ఆఫ్రికా, లాటిన్ అమెరికా, ఆసియాపసిఫిక్ ప్రాంతాల నుండి శాశ్వత సభ్యులు లేరు. భారత్ జీ4దేశాల (భారత్, జపాన్, జర్మనీ, బ్రెజిల్) తరపున సంస్కరణల కోసం కృషి చేస్తుంది. వారు భద్రతా మండలి సభ్యుల సంఖ్య15 నుండి 25 లేదా 26కి పెంచాలని, ఆరు కొత్త శాశ్వత సభ్య దేశాలను (ఆఫ్రికా, ఆసియాపసిఫిక్ నుండి రెండు చొప్పున, లాటిన్ అమెరికా కరీబియన్ నుండి ఒకటి, పశ్చిమ ఐరోపా, ఇతర దేశాల నుండి ఒకటి) అలాగే, నాలుగు లేదా ఐదు కొత్త తాత్కాలిక సభ్య దేశాలను జోడించాలని ప్రతిపాదించారు.

ఉగ్రవాదంపై పోరాటంలో ద్వంద్వ ప్రమాణాలు

ఉగ్రవాదంపై పోరాటంలో ప్రధాని మోడీ ద్వంద్వ ప్రమాణాలను తీవ్రంగా విమర్శించారు. ఇంతటి తీవ్రమైన సమస్యపై ద్వంద్వ ప్రమాణాలకు చోటు ఉండకూడదు. ప్రపంచ శాంతి, శ్రేయస్సు కోసం ఒకే విధమైన, నిర్ణయాత్మకమైన చర్య అవసరం'. ఈ వ్యాఖ్య ప్రపంచంలో వివిధ ప్రాంతాలలో ఉగ్రవాదాన్ని వేరు వేరు ప్రమాణాలతో అంచనా వేసే దేశాల వైఖరిని లక్ష్యంగా చేసుకుంది. భద్రతా సహకారాన్ని మరింత బలోపేతం చేయడానికి, ఐబీఎస్ఏ జాతీయ భద్రతా సలహాదారుల (ఎన్ఎస్ఏ) సదస్సును సంస్థాగతం చేయాలని మోడీ ప్రతిపాదించారు. మూడు దేశాల మధ్య భద్రతా సహకారాన్ని బలోపేతం చేయడానికి 2021లో భారత్ ఐబీఎస్ఏ అధ్యక్ష స్థానంలో ఉన్నప్పుడు జాతీయ భద్రతా సలహాదారుల మొదటి సమావేశం జరిగింది.

మానవ కేంద్రిత అభివృద్ధిలో సాంకేతికత కీలక పాత్ర పోషిస్తుందని మోడీ ఉద్ఘాటించారు. ఈ లక్ష్యాన్ని సాధించడానికి, ఆయన 'ఐబీఎస్ఏ డిజిటల్ ఇన్నోవేషన్ అలయన్స్' ఏర్పాటును ప్రతిపాదించారు. ఈ అలయన్స్ ద్వారా యూపీఐ వంటి డిజిటల్ పబ్లిక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, కోవిన్ వంటి ఆరోగ్య వేదికలు, సైబర్ సెక్యూరిటీ వ్యవస్థలు, మహిళల నేతృత్వంలోని సాంకేతిక కార్యక్రమాలను మూడు దేశాలు పంచుకోవచ్చు.

సహకారానికి ప్రత్యేక ప్రాధాన్యం

కృత్రిమ మేధస్సు రంగంలో సహకారానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వబడింది. ప్రధాని మోడీ 'సురక్షిత, విశ్వసనీయ, మానవకేంద్రితమైన ఏఐ నిబంధనల రూపకల్పనకు మనం కలసి దోహదపడగలం' అని పేర్కొన్నారు . వచ్చే యేడాది భారత్ లో జరగనున్న ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ కు ఐబీఎస్ఏ నేతలను ఆహ్వానించారు. సుస్థిర అభివృద్ధికి ఐబీఎస్ఏ దేశాలు అనేక రంగాలలో సహకార అవకాశాలను గుర్తించాయి. ప్రధాని మోడీ చిరుధాన్యాలు (మిల్లెట్స్), ప్రకృతి వ్యవసాయం, విపత్తుల నిర్వహణ, గ్రీన్ ఎనర్జీ, సంప్రదాయ ఔషధాలు, ఆరోగ్య భద్రత వంటి రంగాలలో పరస్పర సహకారానికి అవకాశాలు ఉన్నాయని స్పష్టం చేశారు. వాతావరణ మార్పుల సవాళ్లను ఎదుర్కోవడంలోనూ ఐబీఎస్ఏ సహకారం కీలకమైనది. వాతావరణ మార్పులను తట్టుకునే వ్యవసాయ పద్ధతుల కోసం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసుకునేందుకు మోడీ ప్రతిపాదించారు. 40 దేశాలలో విద్య, ఆరోగ్యం, మహిళా సాధికారత, సోలార్ ఎనర్జీ వంటి కార్యక్రమాలకు ఐబీఎస్ఏ నిధులు అందజేస్తున్నందుకు ఆయన ప్రశంసలు వ్యక్తం చేశారు.

ద్వైపాక్షిక సమావేశాలు:- విస్తృత అంతర్జాతీయ నిశ్చితార్థం

ప్రధాని మోడీ జోహన్నెస్ బర్గ్ లో వివిధ దేశాల అధినేతలతో ద్వైపాక్షిక సమావేశాలను నిర్వహించారు. ఆయన కెనడా ప్రధాని కార్నీ, జపాన్ ప్రధాని తకాయిచీ, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ, జమైకా ప్రధాని హోల్నెస్, నెదర్లాండ్స్ ప్రధాని డిక్ స్కూఫ్ తో సమావేశమయ్యారు. ఈ సమావేశాలలో వ్యాపారం, వాణిజ్యం, పెట్టుబడులు, కీలక రంగాలలో పరస్పర సహకారంపై చర్చించారు. జీ20 సదస్సు సందర్భంగా దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసాతో ప్రత్యేక సమావేశం జరిగింది. సమావేశంలో వ్యాపారం, వాణిజ్యం, మైనింగ్, అరుదైన ఖనిజాలు, కృత్రిమ మేధస్సు, ఆహార భద్రత వంటి రంగాల్లో పరస్పర సహకారంపై విస్తృతంగా చర్చించారు. జీ20 కూటమికి విజయవంతంగా సారథ్యం వహిస్తున్నందుకు రమఫోసాకు మోదీ అభినందనలు తెలియజేశారు .

విశ్లేషణ, విమర్శ

ఐక్యరాజ్యసమితి సంస్కరణల అవసరం కాలానుగుణంగా మారిన ప్రపంచ వ్యవస్థలో అత్యంత ముఖ్యమైన అంశంగా నిలిచింది. ప్రస్తుత భద్రతా మండలి నిర్మాణం 1945లో రూపుదిద్దుకున్న ప్రపంచానికి ప్రతిబింబంగా ఉండగా, 21వ శతాబ్దంలో ఆర్థిక, రాజకీయ, వ్యూహాత్మక శక్తి సమతుల్యతలో పెద్ద మార్పులు వచ్చాయి. భారత్, బ్రెజిల్, దక్షిణాఫ్రికా వంటి దేశాలు ప్రపంచ వ్యవహారాల్లో మరింత ముఖ్యమైన పాత్ర పోషించడం ప్రారంభించినా, అంతర్జాతీయ నిర్ణయాధికార ప్రక్రియలలో వాటి ప్రాతినిధ్యం పరిమితంగానే ఉంది. ఐబీఎస్ఏ వేదిక సంస్కరణల కోసం సమన్విత వాణిని అభివృద్ధి చెందిన దేశాలకు అందిస్తుంది. మూడు దేశాలు కలిసి మాట్లాడితే, వ్యక్తిగత దేశాల కంటే ఎక్కువ ప్రభావాన్ని చూపగలవు. అయితే, (యూఎన్ ఎస్సీ) సంస్కరణలు పీ5 దేశాల వీటో అధికారం కారణంగా నిరుత్సాహపరిచిన విషయం. చైనా, పాకిస్థాన్ వంటి దేశాలు ఇప్పటికే సంస్కరణలను వ్యతిరేకించాయి.

(వ్యాస రచయిత సామాజిక, ఆర్థిక విశ్లేషకులు)

అభివృద్ధి ప్రదాతకు పట్టం కట్టే సమయం

సర్పంచ్ ఎన్నికలకు అన్నింటిని ప్రామాణికంగా తీసుకొని అభ్యర్థికి ఓటు వేయాలా లేదా అన్నది చూసుకొని ప్రజలు తమ అడుగును ముందుకు వేయాలి. గెలిచిన అభ్యర్థి ఎవరి స్వలాభాల కోసమో కాకుండా ప్రజలకు లాభాన్ని చేకూర్చే విధంగా ఉంటే, ప్రతి గ్రామం సస్యశ్యామలంగా ఉంటుంది. ముఖ్యంగా గ్రామాన్ని రాష్ట్రంలో ఒక ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్ది నంబర్ వన్ స్థాయిలో ఉండేలా చూస్తే అంతకన్నా ఆనందం మరేమీ లేదు. ప్రతి గ్రామంలో ఉపాధిహామీ పథకాన్ని సక్రమంగా అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత ఉంది. గ్రామ ప్రజలకు రావాల్సిన పథకాల గురించి అవగాహన కల్పించి, ప్రజలకు అందేలా చూడాల్సిన బాధ్యత కూడా ప్రతి సర్పంచ్ కు ఉంటుంది.

వెంగల రణధీర్
9949493707

ఎట్టకేలకు తెలంగాణలో సర్పంచ్ ఎన్నికల నగారా మ్రోగింది.రేపో, మాపో నోటిఫికేషన్ వస్తుందన్న మాటకు ఫుల్ స్టాప్ పడింది. ఎందరో ఆశావాహులు సర్పంచ్ ఎన్నికల కోసం ఎదురుచూస్తున్నవారి ఉత్సాహం, పట్టుదలను పరీక్షించుకునే సమయం రానే వచ్చింది. కొంతమందికి రిజర్వేషన్ కలిసిరాక నిరుత్సాహంలో ఉండిపోయారు, అయినా గ్రామాల అభివృద్ధిలో మంచి నాయకుడికే పట్టం కట్టాలని కసితో యువత ఉన్నారు. ఏదేమైనా గ్రామాలను అభివృద్ధి చేసి గ్రామ ప్రజలకు 24/7 అందుబాటులో ఉన్న నేతకే ప్రజలు పట్టం కట్టాల్సిన బాధ్యత ఉంది. యువత కూడా పోటీలో ఉండి తమ పవరేంటో చూపించాల్సిన అవకాశం ఇదొక్కటే. ఎందుకంటే గ్రామ మొదటి పౌరుడు సర్పంచ్ కాబట్టి గ్రామ ప్రజలకు సేవ చేసే గొప్ప బాధ్యతను దక్కించుకోవడం అసలైన విజయంగా భావించాలి.

ఎవరికి పట్టం కట్టాలంటే

గ్రామంలో ప్రతి సమస్యకు పరిష్కార మార్గం చూపే వ్యక్తికి, కుల మత భేదాలు లేకుండా కష్టసుఖాలు పాలుపంచుకునే వ్యక్తికి,తన వర్గానికి (పార్టీ పరంగా) అధిక ప్రాధాన్యం ఇవ్వకుండా అందరికీ సమన్యాయం చేసే వ్యక్తికి, ప్రతిరోజు గ్రామంలో తిరుగుతూ ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరించే వ్యక్తికి, గ్రామమే తన కుటుంబంగా అనుకొని మెలిగే వ్యక్తికి, ప్రభుత్వంతో కొట్లాడి గ్రామానికి నిధులు, పేదలకు రావలసిన పథకాలను ప్రజల చెంతకు చేర్చే నాయకుడికి పట్టం కట్టడం ఉత్తమం. రాజకీయాలలోకి యువత రావాలని పెద్దపెద్ద నాయకులు చెప్తుండే మాట. స్పీచులలో చెప్పడమే కానీ, కష్టపడిన యువ నాయకునికి ప్రతిఫలం మాత్రం శూన్యం. యువతను ప్రోత్సహించి, పట్టించుకోని మంచి హోదాలో రాజ్యమేలుతున్న నాయకులకు యువత బలం చూపించాలి. యువత అంటే పేరు కాదు ఒక బ్రాండ్ అని చూపించి, పేదల పక్షాన నిరంతరం ఉంటూ ప్రతి పనిని తన పనిగా చేసి ముందుకు వెళ్లి, నేటి యువతకు ఆదర్శంగా మారాలి. యువతలో

ఉన్న ఉత్సాహమేంటి, యువత సత్తా ఏంటో చాటాలి. యువతతో కానిది ఏది లేదని నిరూపించాలి. యువతను అన్ని రంగాల్లో అణగదొక్కుతున్న వారికి గెలుపుతో బుద్ధి చెప్పాలి.

మేనిఫెస్టోనే ముఖ్యం

ఎన్నికలలో గెలిచాక గ్రామానికి ఏం అభివృద్ధి చేస్తారనే దానిపై ప్రజలకు క్లారిటీ ఇచ్చేలా అభ్యర్థులు మేనిఫెస్టోను ముందుంచాలి. మేనిఫెస్టోలో ఉన్నటువంటి అన్ని హామీలను అమలయ్యేలా చూస్తానని ప్రజల సమక్షంలో ఊరు నడిబొడ్డున పత్రం మీద సంతకం చేయాలి. అతను పారదర్శకంగా ఉంటేనే గ్రామాభివృద్ధిని ఎలా నిర్వర్తించగలుగుతాడు! అనే దానిపైన ప్రజలకు ఒక క్లారిటీ వస్తుంది. డబ్బుకు ఆశపడితే ప్రశ్నించలేం. ఎన్నికలు వస్తే చాలు ఓటుకు నోటు తప్పనిసరి అయింది. ఎవరు నోటు ఇస్తే వారికే ఓటెయ్యడం ట్రెండ్ అయిపోయింది. కానీ, నోటు తీసుకుంటే ప్రశ్నించలేమన్న విషయాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలి. ముఖ్యంగా ఈ సర్పంచ్ ఎన్నికలలో డబ్బులు తీసుకుంటే గ్రామంలో ఏ సమస్య ఉన్న గెలిచిన సర్పంచిని నిలదీసి అడగలేము, ఎందుకంటే గ్రామస్థాయిలో ప్రతి పనికి సర్పంచ్ అవసరం ఉంటుంది. ఎమ్మెల్యే,ఎంపీ, ఎమ్మెల్సీ ఎన్నికలు ఒకెత్తయితే, ఈ సర్పంచ్ ఎన్నికలు ఒకెత్తు. కావున పైసకు కాదు ప్రాధాన్యం, ప్రశ్నించి సాధించేందుకు ప్రాధాన్యం ఉండేలా చూసుకోండి. ఓటుకు వచ్చే 200,300 రూపాయలకు ఆశ పడితే మన జీవితాలు కూడా అంతంత మాత్రంగానే ఉంటాయి. మనమేదైనా నిలదీసి అడగాలంటే మనం ఈ ఓటుకు నోటు కాన్సెప్ట్ కు దూరంగా ఉండాలి. అప్పుడు మనం ఏదైనా సమస్య గురించి అడిగితే సర్పంచ్ కూడా మనపై ప్రశ్నించలేదు కానీ ఆ సమస్యను తప్పకుండా పరిష్కరిస్తాడు.

ప్రజలకు లాభాన్ని చేకూర్చే విధంగా

సర్పంచ్ ఎన్నికలకు అన్నింటిని ప్రామాణికంగా తీసుకొని అభ్యర్థికి ఓటు వేయాలా లేదా అన్నది చూసుకొని ప్రజలు తమ అడుగును ముందుకు వేయాలి. గెలిచిన అభ్యర్థి ఎవరి స్వలాభాల కోసమో కాకుండా ప్రజలకు లాభాన్ని చేకూర్చే విధంగా ఉంటే, ప్రతి గ్రామం సస్యశ్యామలంగా ఉంటుంది. ముఖ్యంగా గ్రామాన్ని రాష్ట్రంలో ఒక ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్ది నంబర్ వన్ స్థాయిలో ఉండేలా చూస్తే అంతకన్నా ఆనందం మరేమీ లేదు. ప్రతి గ్రామంలో ఉపాధిహామీ పథకాన్ని సక్రమంగా అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత ఉంది. గ్రామ ప్రజలకు రావాల్సిన పథకాల గురించి అవగాహన కల్పించి, ప్రజలకు అందేలా చూడాల్సిన బాధ్యత కూడా ప్రతి సర్పంచ్ కు ఉంటుంది. కావున ప్రజలు మరి మరి ఆలోచించి అభివృద్ధి చేసే నాయకుడికి, అండగా ఉండే నాయకుడికి పట్టం కడితే బాగుంటుంది.

(వ్యాసకర్త రచయిత, జర్నలిస్ట్)

'అమాత్య' అదృష్టమెవరికో?

అంబీర్ శ్రీకాంత్
81859 68059

తెలంగాణ రాష్ట్ర కేబినెట్ విస్తరణ ఊసు తెరమీదకు కనిపించకున్నా కాంగ్రెస్ అధిష్ఠానం మాత్రం ఇప్పటికే ఓ అంచనాకు వచ్చినట్టు సమాచారం. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు ఏర్పడి 23 నెలలు దాటుతోంది. అయినా పూర్తిస్థాయిలో కేబినెట్ విస్తరణ జరగలేదు. అన్ని సామాజిక సమీకరణాల సమతుల్యత, రాజకీయ సమీకరణాలు కుదర్చుకుని ఇటీవల ముగ్గురిని కేబినెట్‌లోకి తీసుకున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పుణ్యమాని అజారుద్దీన్ కేబినెట్‌లోకి చేరారు. ఆయన్ను మంత్రివర్గంలోకి తీసుకోవాలని ఆరు నెలల ముందే నిర్ణయించుకున్నామని స్వయంగా టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ వెల్లడించారు. ఈ లెక్కన చూస్తే, మిగతా రెండు బెర్తుల భర్తీ విషయమై కూడా చర్చలు కొలిక్కి రావడమే కాదు. దాదాపు ఫైనల్ అయినట్టు వినికిడి. సరైన సందర్భం వచ్చినపుడు సుముహూర్తాన పూర్తి స్థాయి కేబినెట్ కొలువు దీరొచ్చు మరి. రేవంత్ నాయకత్వంలోని మంత్రివర్గంలో ఇప్పటికే ఉన్న మినిస్టర్ల పనితీరు, పర్ఫార్మెన్స్ ఎప్పటికప్పుడు స్వయంగా సీఎం రేవంత్ పరిశీలిస్తున్నట్టు కాంగ్రెస్ వర్గాలలోనే టాక్ నడుస్తోంది. ఇదంతా కూడా అధిష్టానానికి చేరుతున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే మంత్రివర్గం ఏకతాటిపై నడుస్తున్నట్టు చర్చలున్నాయి. ఏది ఏమైనా మిగిలిన రెండు బెర్తులలో ఎవరిని భర్తీ చేయాలనే దానిపై ఇప్పుడున్న పరిస్థితులలో సీఎం రేవంత్‌రెడ్డి సలహాలు, సూచనలు, ఫీడ్‌బ్యాక్‌ను కాంగ్రెస్ అధిష్టానం తీసుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అయితే, మంత్రి కావాలనే కల చాలా మందికే ఉంది. కొందరు ఎవరికి వారే కాంగ్రెస్ పెద్దల వద్ద లాబీయింగ్ చేస్తున్నట్టు తెలుస్తున్నది.

కొరకరాని కొయ్యగా మారి

మంత్రి పదవి ఆశిస్తున్న సుదర్శన్‌రెడ్డి, ప్రేమ్‌సాగర్‌రావులకు కేబినెట్ హోదాతో సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఇక సీరియస్‌గా మినిస్టర్ పోస్టు కోసం కొట్లాడుతున్న కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి విషయమై అధిష్ఠానానికి ఒకరకంగా కొరకరాని కొయ్యగా మారినట్టు కనబడుతోంది. కానీ, అధిష్టానం ఈ విషయంలో చాలా క్లియర్‌గా ఉన్నట్టు తెలిసింది. పార్టీ పటిష్టతే, క్షేత్రస్థాయిలో బలోపేతంతో పాటు భవిష్యత్ పరిణామాల నేపథ్యం, రాజకీయ సమీకరణాల దృష్ట్యా పూర్తి స్థాయిలో స్థానిక నాయకత్వానికి ఫ్రీ హ్యాండ్ ఇవ్వడంతో పాటు కళ్లెం వేస్తున్నట్టుగా భావించేలా బ్యాలెన్స్‌డ్‌గా ముందుకెళ్లేలా సంకేతాలను పంపుతున్నట్టు తెలుస్తున్నది. 'స్థానిక' ఎన్నికల నేపథ్యం, ఫలితాలు కూడా ఓ ప్రాతిపదికగా మంత్రివర్గ విస్తరణ ఉండే అవకాశాలు కనబడుతున్నాయి. ఈ పూర్వరంగంలో 'అమాత్య' అని పిలిపించుకునే ఆ ఇద్దరు అదృష్టవంతులెవరో? అనే దానికి కాలమే సమాధానం చెప్పనుంది.

(వ్యాస రచయిత సీనియర్ జర్నలిస్టు)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula
@gmail.com

ఘట్కేసర్ రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేయాలి

- కేంద్ర మంత్రిని కలిసి వినతిపత్రాన్ని అందజేసిన ఎంపి ఈటల



ప్రతిపక్షం. ప్రతినిధి. మేడ్చల్, నవంబర్ 26: నియోజకవర్గ అభివృద్ధియే తన ధ్యేయమని మేడ్చల్ మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ రైల్వే స్టేషన్ ను అభివృద్ధి చేయాలని ప్రజలు చాలా అర్జీలు ఇచ్చారని, ఈ విషయంపై కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ బుధవారం ఢిల్లీలో ఈటల రాజేందర్ కలిసి పలు అభివృద్ధి పనులపై వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ కు అనుసంధానంగా ఉండే మొట్టమొదటి ప్రాంతం ఘట్కేవర్ పట్టణమని, ఈ ప్రాంతం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఘట్కేసర్ లో పలు ఉన్నంత విద్యా సంస్థలు, సాఫ్ట్ వేర్ కంపెనీలలో పనిచేసే ఉద్యోగులు ప్రయాణాలు చేస్తుంటారని తెలిపారు. ఘట్కేసర్ నుండి లింగంపల్లి, సికింద్రాబాద్ కు ఎంఎంటీఎస్ సర్వీసులు ప్రారంభించాలని వినతిపత్రంలో పేర్కొన్నానని తెలిపారు., 4 ప్లాట్ ఫాంలో 14 రైల్వే సర్వీసులతో అనునిత్యం బిజీగా ఉండే ఘట్కేసర్ రైల్వే స్టేషన్లో ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణం చెపట్టాలని కోరారు. రిసాలబజార్, కౌకుర్, తుంకుంట, కొంపల్లి, యాప్రాల్, దూలపల్లి వంటి ప్రాంతాలకు అనువుగా ఉండే విధంగా రాయలసీమ ఎక్స్ప్రెస్ రైలును ప్యాసింజర్ సౌకర్యం కోసం ఆపే విధంగా చూడాలని తెలిపారు. దీనికి సానుకూలంగా కేంద్ర మంత్రి స్పందించి అభివృద్ధికి తోడ్పాడతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఏనుగు సుదర్శన్ రెడ్డీతో పాటు తదితరులు పాల్గొన్నారు

దళిత ఐక్యవేదిక కమిటీ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం

ప్రతిపక్షం, కుత్బుల్లాపూర్, నవంబర్ 26 : సూరారం బాబు జగ్జీవన్ రావ్ అంబేద్కర్ భవన్ లో దళిత ఐక్యవేదిక కమిటీ ప్రధాన కార్యదర్శి హనుమకొండ ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు అఖిల భారత రాష్ట్రీయ దళిత సేన ఓబీసీ జాతీయ అధ్యక్షులు గూడ ఐలయ్య గౌడ్, దళిత సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు డాక్టర్ భుదాల అమర్ బాబు, రాష్ట్రీయ దళిత సేన జాతీయ అధ్యక్షులు డాక్టర్ అవి జై జేమ్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగం మన ప్రజాస్వామ్యం ఇచ్చిన అమూల్యమైన వారసత్వం అని అన్నారు. మన దేశాన్ని ఒక్క గూటికి నిలిపేందుకు రాజ్యాంగం అసలైన బలం అని, రాజ్యాంగం ప్రతి పౌరుని హక్కులనే కాదు బాధ్యతలను కూడా గుర్తించి నిర్ధారించిందన్నారు. స్వాతంత్రం తరువాత దేశ నిర్మాణానికి బాటలు వేసిన అంబేద్కర్ వంటి మహానుభావుల త్యాగం వల్లనే ప్రతి పౌరుడికి సమాన అవకాశాలు దిశగా ప్రస్తావని మొదలైనదన్నారు. భారత రాజ్యాంగం దినోత్సవం ఫార్మాలిటీగా కాకుండా ప్రతి భారత పౌరుడు బాధ్యతగా గుర్తించి ప్రమాణ పూర్వకంగా పని చేయవలసిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో దళిత ఐక్యవేదిక కమిటీ ప్రధాన కార్యదర్శి హనుమకొండ ప్రేమ్ కుమార్, మట్ట నరసింహులు, కాటం దేవయ్య, బూర్గు రవి, బి ఆనంద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కావాలని మమ్మల్ని కించపరుస్తున్నారు

- మేయర్‌పై బీఆర్ఎస్ కార్పొరేటర్ మన్నే కవిత

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 26 : నగర మేయర్ విజయలక్ష్మిపై బీఆర్ఎస్ కార్పొరేటర్ మన్నే కవిత రెడ్డి తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. 'మేము నిజాయితీ, క్రమశిక్షణతో పని చేస్తున్న గులాబీ సైనికులం. మా మద్దతుతో మేయర్ పిఠాన్ని ఎక్కినప్పటికీ, కించపరుస్తున్నారు' అని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ కృషి, సిద్ధాంతాలకు ఎల్లప్పుడూ మద్దతు ఇస్తామని, ప్రజలకు సేవ చేయడమే ప్రధాన కర్తవ్యం అని స్పష్టం చేశారు. మేయర్ తమ పార్టీ గుర్తుపై గెలిచిన పదవుల కోసం ఇతర పార్టీకు ద్రోహం చేయలేదని, తమ కృషి ప్రజలకు సేవగా నిబద్ధమని చెప్పారు. 'భగవంతుడు అన్ని చూస్తున్నాడు. పాపం పండే రోజు దగ్గరలోనే ఉంది' అని ఆమె పేర్కొన్నారు. సీఎం రేవంత్ ట్రైనింగ్, డైరెక్షన్ లో బీఆర్ఎస్ కార్పొరేటర్లను మేయర్ కించపరుస్తున్నారని ఆరోపించారు. సమస్యలపై నిలదీస్తున్నందుకు మేయర్‌కు కోపముందని, బీసీ రిజర్వేషన్లకు తన సంపూర్ణ మద్దతును కూడా తెలిపారు. ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమాధానాన్ని ఇస్తారని స్పష్టం చేశారు.

చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన దీక్షా దివస్

- ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

ప్రతిపక్షం, కుత్బుల్లాపూర్, నవంబర్ 26 : తెలంగాణ వచ్చుడో... కేసీఆర్ సచ్చుడో అన్న తెగువతో నాలుగు కోట్ల ప్రజలను ఏకం చేసి కశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు రాజకీయ వ్యవస్థలను ఏకం చేసిన దీక్షా దివస్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గండిమైసమ్మలోని తెలంగాణ భవన్ లో ఈనెల 29వ తేదీన నిర్వహించనున్న దీక్షా దివాస్ కార్యక్రమ విజయవంతంపై జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంబీ పూర్ రాజు అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ తో పాటుగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ రావు, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, మర్రి రాజశేఖర్ రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, పార్లమెంట్ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డిలు హాజరై దీక్షా దివాస్ కార్యక్రమ నిర్వహణపై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాలలో తెలంగాణ ప్రాంతానికి జరుగుతున్న వివక్షత తొలగాలంటే కేవలం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటే మార్గమని గుర్తించి తెలంగాణ రాష్ట్ర సాధనకై బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆమరణ నిరాహారదీక్ష చేపట్టిన 29, నవంబర్ 2009 రోజు "దీక్షా దివస్" అని అన్నారు. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న "దీక్షా దివాస్" ప్రాముఖ్యతను నాయకులు, కార్యకర్తలు నేటి తరానికి తెలియజేయాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనేది ఎవరి బిక్షో కాదని, అమరవీరుల త్యాగం, కేసీఆర్ మొక్కవోని దీక్షతోనే తెలంగాణ రాష్ట్ర స్వప్నం సాకారమైందన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా, జీహెచ్ఎంసీకి చెందిన ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళా నాయకురాలు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రతిపక్షం, మొయినాబాద్, నవంబర్ 26 : గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... మండల పరిధిలోని అజీజ్ నగర్ పాత చౌరస్తా నుండి బైక్ పై వస్తున్న ఓ వ్యక్తి కె. ఎల్. హెచ్ పాయింట్ లో గుర్తు తెలియని వాహనం డీకొనడంతో అతడి తలకు తీవ్ర రక్తయాలు అయ్యి అక్కడికక్కడే మృతి చెందాడు. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

రాయల్టీని ఎగ్గొట్టేందుకే రాక్ సౌండ్ క్రషర్ యత్నం?

- ఆ క్రషర్ ముందు టిప్పర్ల యజమానుల ధర్నా
- రాయల్టీ ఇవ్వాలని అడిగితే రేపు మాపంటూ కాలయాపన

ప్రతిపక్షం ప్రతినిధి, మేడ్చల్, నవంబర్ 26: రాయల్టీ ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్న రాక్ స్యాండ్ క్రషర్ కంపెనీ ముందు టిప్పర్ల యజమానులు బుధవారం ధర్నాకు దిగారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాక్ స్యాండ్ క్రషర్ కంపెనీ రాయల్టీ ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని టిప్పర్ల యజమానులు ఆరోపించారు. రేపు మాపంటూ కాలయాపన చేస్తున్నారని రాక్ స్యాండ్ క్రషర్ కంపెనీ వల్ల తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని వాపోయారు. రాయల్టీని ఇవ్వకుండా లోడును బయటకు పంపడం వల్ల మధ్యలో టిప్పర్ల యజమానులు రాయల్టీ కట్టాల్సిన పరిస్థితి వస్తుందని ఆరోపించారు. అంతేకాకుండా మోతాదుకు మించిన కంకరతో టిప్పర్లు వెళ్లడం వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, చేవెళ్ల ఘటన చూసిన తర్వాత కూడా అధిక లోడుతో కంకర పంపిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్, ఎమ్మార్వో, పోలీసులకు ఫిర్యాదు చేశామని, అయినా ఫలితం లేకుండా పోతుందని టిప్పర్ల యజమానులు ఆరోపించారు. అన్ని క్రషర్ యజమానులు రాయల్టీ ఇస్తుండగా ఒక రాక్ స్యాండ్ క్రషర్ యజమానులు మాత్రమే రాయల్టీ ఇవ్వడంలేదని ఆరోపించారు.

ప్రమాదాలు జరుగుతున్న మారరా

మోతాదుకు మించిన లోడుతో వెళ్లే కంకర టిప్పర్లు ప్రమాదాలకు గురవుతున్న క్రషర్ యజమానులు మారడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నిన్నగాక మొన్న రావల్కోల్ లో మోతాదుకు మించిన లోడుతో వెళుతూ కంకర టిప్పర్ అదుపుతప్పి చెట్లల్లోకి దూసుకెళ్లింది. అధిక లోడుతో వెళుతున్న టిప్పర్ తోనే చేవెళ్ల ఘటన చూసి కూడా క్రషర్ యజమానుల్లో మార్పు రాకపోవడం ఆందోళన కలిగించే అంశం, ఏదైనా సంఘటన జరిగాక క్రషర్ యజమాలు నిద్ర లేస్తారేమోనని ప్రజలు ఆరోపిస్తున్నారు. మోతాదుకు మించిన క్రషర్ తీసుకెళ్లే టిప్పర్లపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ చేస్తున్నారు.

ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం

- రాజ్యాంగ విలువలను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత – ఎర్ర యాకన్న

కూకట్ పల్లి, ప్రతిపక్షం, నవంబర్ 26 : భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం కూకట్ పల్లి ఉమ్మడి ప్రెస్ క్లబ్‌లో ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఎర్ర యాకన్న అధ్యక్షత వహించారు. రాజ్యాంగ నిర్మాత, భారత మహా రత్నుడు, భారత ప్రజాస్వామ్యానికి శిల్పి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఎర్ర యాకన్న మాట్లాడుతూ, "భారత రాజ్యాంగం మనందరికీ సమానత్వం, స్వేచ్ఛ, సోదరభావం, న్యాయం అనే ప్రాథమిక హక్కులను ప్రసాదించిన గొప్ప పత్రం. భారత గణతంత్రాన్ని ప్రపంచంలో అత్యుత్తమ ప్రజాస్వామ్యంగా నిలబెట్టడానికి రాజ్యాంగం బలమైన పునాది" అని పేర్కొన్నారు. రాజ్యాంగ విలువలను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు. ప్రజాస్వామ్యం బలోపేతం కావాలంటే యువత రాజ్యాంగాన్ని తెలుసుకోవాలని, సమాజంలో ఉన్న వివక్ష, అసమానతలను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ చైతన్యవంతులవ్వాలని పిలుపునిచ్చారు. దేశ అభివృద్ధిలో మీడియా పాత్ర ఎంతో ముఖ్యమని, నిజాయితీతో ప్రజలకు వాస్తవాలు తెలియజేయడం పత్రిక ధర్మమని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కోశాధికారి నగేష్, సాంస్కృతిక శాఖ కార్యదర్శి రంజిత్ ముదిరాజు, జాయింట్ సెక్రెటరీ అంజిబాబు, సుజాత, సభ్యులు బబ్బికాంత్, వీర శేఖర్ రెడ్డి,అనిల్ కిషోర్, శివ కుమార్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అర్హత లేని ఆర్ఎంపి డాక్టర్ లపై చర్యలు శూన్యం

- డీఎంహెచ్ఓ వ్యవస్థ ఉన్నట్లా, లేనట్లా?

ప్రతిపక్షం. ప్రతినిధి. మేడ్చల్, నవంబర్ 26: అర్హత లేని ఆర్ఎంపి డాక్టర్ లపై చర్యలు ఉంటాయా అంటే శూన్యమనే చెప్పుకోవచ్చు. తెలిసి తెలియక చేస్తున్న వైద్యంతో రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న అర్హత లేని ఆర్ఎంపిలపై వైద్యాధికారులు చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలలో సవాల్ గా మారింది. వివిధ పత్రికల్లో వార్తలు వచ్చిన డీఎంహెచ్ఓ వ్యవస్థ చర్యలు తీసుకోకపోవడం ప్రశార్థకరంగా మారింది. నిమ్మకు నీరెత్తినట్లు వ్యహరిస్తున్న సంభంధిత అధికారులపై పలు అనుమానాలకు దారి తీస్తున్నాయని ప్రజలు ఆరోపణలు గట్టిగానే చేస్తున్నారు. ఇప్పటికైనా అర్హత లేని ఆర్ఎంపీలపై చర్యలు తీసుకువాలని మేడ్చల్ పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

సొంతింటి కల నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

ప్రతిపక్షం. ప్రతినిధి. మేడ్చల్, నవంబర్ 26: రాష్ట్ర పేద ప్రజల సొంతింటి కల నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ నాయకుడు వేణు గోపాల్ రెడ్డి అన్నారు. మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధి పొన్నాల గ్రామంలో విజయకు ఇందిరమ్మ ఇళ్ళు గృహ ప్రవేశ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి, ఎంసిపల్లి కాంగ్రెస్ అధ్యక్షుడు దోసకాయాల వెంకటేష్, అలియాబాద్ మున్సిపల్ అధ్యక్షుడు తుంకి రమేష్, మాజీ కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, అనుబంధ సంఘాల ఎస్సి, ఎస్టీ, బీసీ, మైనారిటీ అధ్యక్షులతో పాటు ఇందిరమ్మ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప స్వామి పల్లకీ సేవ

ప్రతిపక్షం, మొయినాబాద్ నవంబర్ 26 : మండల పరిధిలోని కనకమామిడిలో అయ్యప్ప స్వాముల ఆధ్వర్యంలో బుధవారం కావడి, స్వామివారి కళ్యాణం, నిర్వహించారు. అనంతరం గ్రామంలో పల్లకీ సేవ వైభవంగా నిర్వహించారు. అంతకుముందు గణపతి హోమం, కలశ పూజ, స్వామికి పల్లకీ సేవ, గిరిప్రదక్షిణ నిర్వహించారు. అయ్యప్ప మాలధారులు, భక్తుల శరణుఘోషతో ముంచెత్తింది. గురుస్వాములు ఆలపించిన భక్తిగీతాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విష్ణు పంతులు , గురు స్వాములు రామ్ రెడ్డి , రాఘవేందర్, సుదర్శన్ రెడ్డి, పందు , చంద్రశేఖర్ , అశోక్ గౌడ్, సిదేశ్వర్, రవికుమార్ , రాఘవేందర్ గౌడ్, బాల మల్లేష్, మల్లారెడ్డి, పి. మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి మండల అధ్యక్షునిగా మోంగని శ్రీనివాస్

- ఏకగ్రీవంగా ఎన్నికైన మోంగని శ్రీనివాస్

ప్రతిపక్షం, మొయినాబాద్, నవంబర్ 26: ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి మండల అధ్యక్షునిగా మోంగని శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని ఎన్కేపల్లి గ్రామానికి చెందిన మోంగని శ్రీనివాస్ ను రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు జీనుకుంట్ల భాస్కర్, అధికార ప్రతినిధి వద్ది నిరంజన్, ప్రధాన కార్యదర్శి కాకి వినోద్ ల ఆధ్వర్యంలో ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి మొయినాబాద్ మండల అధ్యక్షునిగా నియమించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మోంగని శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి జాతీయ అధ్యక్షుడు కర్నే శ్రీశైలం అన్నా ఆశయాలను ముందుకు తీసుకుపోవడమే లక్ష్యంగా రంగారెడ్డి జిల్లాలోని అన్ని మండలాలలో ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితిని బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవేందర్, నవీన్, రాహుల్, నాగరాజు, మహేష్, రాజు, ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య రామమందిరం వద్ద కాషాయ జెండాను మోదీ ఎగురవేయడాన్ని పాకిస్తాన్ తప్పుబట్టడం సరికాదు. మతతత్వ, మైనారిటీలపై అణచివేతకు పాల్పడే కళంకిత రికార్డు గల దేశం చేసిన వ్యాఖ్యలను తిరస్కరిస్తున్నాం. ఇతరులకు ఉపన్యాసాలిచ్చే నైతిక హక్కు పాకిస్తాన్ కు లేదు. కపట ఉపదేశాలిచ్చే బదులు తమ దేశంలో దారుణమైన మానవహక్కుల రికార్డుపై దృష్టిపెడితే మంచిది.
- విదేశాంగ శాఖ ప్రతినిధి రణ్ ధీర్ జైస్వాల్

భూములు కోల్పోయిన రైతులకు అండగా ఉంటాం

- రాష్ట్ర మంత్రులు వాకిటి శ్రీహరి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- ప్రియదర్శిని జూరాల భూ నిర్వాసితుల తో ముఖాముఖి

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, నవంబర్ 26: ప్రియదర్శిని జూరాల, సంగం బండ, భూత్పూర్ రిజర్వాయర్ల కింద భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, వాకిటి శ్రీహరి అన్నారు. ఆయా ప్రాజెక్టుల భూ నిర్వాసితులతో వారు మక్తల్ మండలంలోని అనుగొండ గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖాముఖి అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ భూమి నిర్వాసితులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఇచ్చి ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకుంటుందని తెలియజేశారు. రైతులు తాము పడుతున్న ఇబ్బందులను మంత్రి వాకిటి శ్రీహరి దృష్టికి తీసుకురాగా ఈ విషయాలను ఉత్తమ్ కుమార్ రెడ్డితో చర్చించారు. రైతులు అధైర్య పడవద్దని కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతుల పక్షాన ఉంటుందని వారికి భరోసానిచ్చారు.అంతకు ముందు హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ లో వచ్చిన మంత్రులు సంగం బండ, భూత్పూర్ రిజర్వాయర్లను అలాగే జూరాల బ్యాక్ వాటర్ ని ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించారు.

ఎన్నికలు ఎప్పుడు వచ్చినా

కేసీఆర్ స్ఫూర్తిగా ముందుకెళ్తాం

- కేటీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపు

ప్రతిపక్షం, హన్మకొండ, నవంబర్ 26: ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కార్యకర్త నుండి నాయకుల వరకు కేసీఆర్ స్ఫూర్తిగా ముందుకెళ్లాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి కల్వకుంట్ల తారక రామారావు నివాళులర్పించారు. గురువారం హనుమకొండ వరంగల్ జిల్లాల బీఆర్ఎస్ శ్రేణుల ముఖ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మాజీ శాసనసభ్యులు పార్టీ దాస్యం వినయ భాస్కర్ సభ అధ్యక్షత వహించారు. తెలంగాణ వచ్చుడో కేసీఆర్ సచ్చుడో అనే నినాదంతో తెలంగాణ సమాజాన్ని ఒక త్రాటిపై తీసుకు వచ్చిన రోజు నవంబర్ 29 అని ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తు చేశారు. 29న రాష్ట్రవ్యాప్తంగా దీక్షా దివస్ దినాన్ని పెద్ద ఎత్తున కార్యకర్తలు విజయవంతం చేయాలని ఆయన కార్యకర్తలను కోరారు. శ్రీకాంత్ చారి మరణంతో మలిదశ ఉద్యమం మొదలైందని యుద్ధభూమి తలపించే విధంగా తెలంగాణ యావత్ ప్రజలు కదిలారని ఈతరం పిల్లలకు దీక్ష దివస్ గురించి తెలియదని ఆ విషయాన్ని ప్రజలకు తెలియచెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన కార్యకర్తలకు ఉద్బోధించారు. యూ దగ్గర విద్యార్థుల రాస్తారోకోలో నేను పాల్గొన్నానని మమ్మల్ని వరంగల్ సెంట్రల్ జైల్లో పెట్టారని 30 గంటల తర్వాత నన్ను విడుదల చేస్తే నేను ఖమ్మం కు వెళ్లాలని

ఆయన ఈ సందర్భంగా గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఏ దీక్షతోనైతే తెలంగాణ మలుపు తిరిగిందో ఆ దీక్షను గుర్తు చేసుకునే విధంగా ప్రజలు కేసిఆర్ కు నీరాజనం పడతారని ఆయన ఈ సందర్భంగా కార్యకర్తలు తెలిపారు. పరిపాలన చేతకాక అక్రమ కేసులు పెడుతూ అందరినీ కార్యకర్తలను ఇబ్బంది పెడుతున్న విషయాన్ని నేను మర్చిపోలేనని కార్యకర్తలకు ఉద్బోధించారు. రెండు సంవత్సరాల క్రితం తెలంగాణలో అధికారం కు వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గురించి ప్రజలకు అర్థమైందని తిరిగి మళ్ళీ కేసీఆర్ రావాలని కోరుకుంటున్నారని ఆయన అన్నారు. పరిపాలన చేతకాక అక్రమ కేసులు పెడుతూ టిఆర్ఎస్ ఇబ్బంది పెడుతున్న ముఖ్యమంత్రి ఖబర్దార్ అని ఆయన హెచ్చరించారు. బీసీ డిక్లరేషన్ కామారెడ్డి లో జరిగిన సమావేశంలో 42 శాతం రిజర్వేషన్లు బీసీలకు ఇస్తానని మాట తప్పిన ప్రభుత్వాన్ని మీరేం చేయాలో మీరే ఆలోచించుకోండి అని ప్రజలను కోరారు. బీసీలను మోసం చేసిన రేవంత్ సర్కార్ తగిన మూల్యం చెల్లించక తప్పదని ఆయన అభిప్రాయపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఇచ్చిన 24 శాతాన్ని 12 శాతం తగ్గించాలని ఈ విషయాన్ని ప్రజలకు మనం ఎప్పటికప్పుడు తెలియపరచాలని ఆయన కోరారు. చీకటి చూస్తూనే వెలుగు విలువ తెలుస్తుందని దేనికి భయపడలేదని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు, ఈ సమావేశంలో మాజీ ఉప ముఖ్యమంత్రి రాజయ్య, శాసనసభ్యులు పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, నన్నపునేని నరేందర్, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, రాకేష్ రెడ్డి, సంతోష్ కుమార్, సాంబారి సమ్మరావు, మాజీ కార్పొరేటర్లు జోరిక రమేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

జీవో 46 తో బీసీలను నయవంచన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- ధర్నా నిర్వహించి నిరసన తెలియజేసిన బీసీ, ఎస్సి, ఎస్టీ -జేఏసీ జిల్లా కమిటీ

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, నవంబర్ 26: నారాయణపేట జిల్లా కేంద్రంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చౌరస్తా వద్ద బీసీ ఎస్సి ఎస్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ విశారదన్ మహారాజ్ ఆదేశాల మేరకు నారాయణపేట జిల్లా బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ నాయకుల ఆధ్వర్యంలో బీసీలకు జరుగుతున్న జీవో 46 తో బీసీ లను నయవంచన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ధర్నాలో ప్రభుత్వానికి నిరసన పాల్గొన్న జేఏసీ జిల్లా కన్వీనర్ బలిజ వీరేష్ మాట్లాడుతూ జీవో 46 ను రద్దు చేసి స్థానిక సంస్థల ఎన్నికలు నిలిపివేయాలని బీసీ లకు 42% బీసీ రిజర్వేషన్ల న్యాయం చేసిన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని కాంగ్రెస్ పార్టీ ని డిమాండ్ చేశారు. జేఏసీ జిల్లా నాయకులు ఈశ్వర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బీసీలంతా స్వశక్తిగా రోడ్లపైకి వచ్చి ఎన్నో నిరసన కార్యక్రమాలను చేపట్టి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాటాలు చేశారు, మరి నేడు బీసీలకు 42% బీసీ రిజర్వేషన్ల కోసం తెలంగాణ రాష్ట్రంలో పెద్ద ఎత్తున పోరాటం జరిగితే బీసీ సమాజమంతా వారి హక్కుల కోసం పోరాటాలు చేయక పోవడం సిగ్గుచేటు అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ ఎస్సి ఎస్టీ జేఏసీ జిల్లానాయకులు నరేష్ ముదిరాజ్, నాయి బ్రాహ్మణ అంజి, రాజేష్ గౌడ్, లింగప్ప ముదిరాజ్, రామ ముదిరాజ్ ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్ గువ్వల శివరాజ్, మల్లికార్జున్, దశరథ అడ్వకేట్, నరేష్, కృష్ణ, అంజి నరసింహ, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఏబీవీపీ చిట్యాల నూతన కార్యవర్గం

ప్రతిపక్షం, చిట్యాల, నవంబర్ 26: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ చిట్యాల నగర నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. ముఖ్య అతిథిగా నల్గొండ జిల్లా కన్వీనర్ జినుకుంట్ల జయేందర్ హాజరై ఈ కార్యవర్గాన్ని ప్రకటించారు. నగర అధ్యక్షునిగా జాల మల్లేష్, కార్యదర్శిగా వంగూరి గణేష్, సంయుక్త కార్యదర్శిగా సిద్దు, యశ్వంత్, బాలికల కన్వీనర్ గా సైనోజు కావ్య ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ఏబీవీపీ శాఖ ఉపాధ్యక్షుడు కొంపెల్లి సూర్య, నవ్య శ్రీ, రమ్యశ్రీ, ధరణి, తరుణ్, ఫణింద్ర, ముజాహిద్, శశి, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా అభివృద్ధి పనులు

- పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 26 : పటాన్చెరు డివిజన్ పరిధిలోని కాలనీలలో శరవేగంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్చెరు డివిజన్ పరిధిలోని గోకుల్ నగర్ కాలనీలో 10 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పటాన్చెరు డివిజన్ పరిధిలో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తూ నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్, వెంకటేష్, మల్లేష్, సీనియర్ నాయకులు కార్యకర్తలు, పాల్గొన్నారు.

కాంగ్రెస్ లో చేరిన మాజీ ఎంపీటీసీ

ప్రతిపక్షం, చిట్యాల, నవంబర్ 26: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నల్గొండ జిల్లా నకిరేకల్ నియోజకవర్గంలో జంపింగ్‌లు మొదలయ్యాయి. బీఆర్ఎస్ పార్టీకి చెందిన నార్కట్‌పల్లి మండలం గోపాలాయపల్లికి చెందిన మాజీ ఎంపీటీసీ మచ్చ ముత్యాలు బుధవారం అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. నకిరేకల్‌లోని తన నివాసం వద్ద ఎమ్మెల్యే వేముల వీరేశం వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని సూచించారు.

ఎన్నికల కోసమే బతుకమ్మ చీరల హడావిడి

- ఎన్నికల సన్నాహక సమావేశం
- గులాబీ జెండా నే పేదలకు అండ

ప్రతిపక్షం, చిట్యాల, నవంబర్ 26: ఎన్నికల కోసమే కాంగ్రెస్ నాయకులు బతుకమ్మ చీరలతో హడావుడి చేస్తున్నారని జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ బండ నరేందర్ రెడ్డి, నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నల్లగొండ జిల్లా నార్కట్ పల్లి పట్టణ కేంద్రంలో చిట్యాల, నార్కట్ పల్లి మండలాల బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులతో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎన్నికల సమయంలోనే కాంగ్రెస్ ప్రభుత్వానికి సంక్షేమ పథకాలు గుర్తొస్తాయని ఎద్దేవ చేశారు. గులాబీ జెండానే పేద వర్గాలకు శ్రీ రామరక్ష... అని అన్నారు. రిజర్వేషన్లలో కూడా అనేక అవకతవకలు జరిగాయని వారు ఆరోపించారు. ఎవరు ఎన్ని ఇబ్బందులు పెట్టినా ధైర్యంగా టిఆర్ఎస్ అభ్యర్థులు పోటీలో నిలవాలని అన్నారు. అభ్యర్థుల విజయానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని సూచించారు.

డివిజన్ల అభివృద్ధికి సంపూర్ణ సహకారం

- భారతి నగర్ లో సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 26 : భారతి నగర్ డివిజన్ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్చెరు శాసనసభ్యులు మహిపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం భారతి నగర్ డివిజన్ పరిధిలోని ఎల్ఐజి బస్టాప్ వద్ద 98 లక్షల 50 వేల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించ తలపెట్టిన సిసి రోడ్డు పనులకు పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి తో కలిసి ఎమ్మెల్యే జిఎంఆర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో రహదారులు, అంతర్గత మురికినీటి కాలువలు, కమ్యూనిటీ హాళ్లు, నూతన పార్కుల నిర్మాణానికి నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సింధు ఆదర్శ రెడ్డి, పుష్ప నగేష్, మాజీ కార్పొరేటర్ అంజయ్య, సీనియర్ నాయకులు పరమేష్ యాదవ్, ఐలేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధనలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 26 : భారత రాజ్యాంగ పితామహుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని బుధవారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని భారత రత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కాంస్య విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని అట్టడుగు వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం డాక్టర్ బాబాసాహెబ్ రాజ్యాంగం ద్వారా ఎంతగానో కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, దళిత సంఘాల ప్రతినిధులుపాల్గొన్నారు.

ప్రపంచంలోకెల్లా సర్వోన్నతమైనది భారత రాజ్యాంగం

- జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య
- అంబేద్కర్ లా కళాశాలలో ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 26 : మన భారత రాజ్యాంగం అన్ని దేశాల రాజ్యాంగాలలో కంటే సర్వోన్నతమైనదని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. బుధవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని సంగారెడ్డి లోని అంబేద్కర్ ప్రభుత్వ న్యాయ కళాశాలలో జరిగిన భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలకు జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య,జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది కలిసి భారత రాజ్యాంగ ప్రతిజ్ఞ ను చదివి, రాజ్యాంగ విలువలను పాటించేందుకు అంకిత భావంతో ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా న్యాయ కళాశాల విద్యార్థులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడారు. ప్రపంచంలోకెల్లా అతిపెద్ద లిఖితపూర్వక రాజ్యాంగం భారత రాజ్యాంగం అని అన్నారు. భారత రాజ్యాంగం ఎప్పుడు నూతన మైనది అన్నారు. కాలమాన పరిస్థితులకు అనుగుణంగా మన రాజ్యాంగంలో మార్పులు చేర్పులను చేసుకొనే వెసులుబాటు రాజ్యాంగ వర్ణ మార్పులు చేర్పులను చేసుకొనే వెసులుబాటు రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా భారత రాజ్యాంగం మనకు కల్పించిందన్నారు. మన రాజ్యాంగం పరిధిలోకి ప్రజలు అధికారులు ప్రజా ప్రతినిధులకు సమాన అవకాశాలు, సమాన అధికారాలు కల్పించినట్లు కలెక్టర్ తెలిపారు. భారత రాజ్యాంగ పరిరక్షణలో న్యాయ విద్యార్థుల పాత్ర ఎనలేనిదన్నారు. సంగారెడ్డి న్యాయ కళాశాలలో ప్రతిభగల అధ్యాపక బృందం ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. న్యాయ కళాశాల విద్యార్థులు తమ శిక్షణ కార్యక్రమంలో న్యాయవిద్యలో మేలుకువలు సాధించి ఉన్నత విద్యా అవకాశాలతో పాటు ఉత్తమమైన న్యాయవాదులుగా, న్యాయాన్ని న్యాయపుణులుగా గుర్తింపు పొందాలని కలెక్టర్ సూచించారు. న్యాయ విద్యా డిగ్రీ తో సరి పెట్టుకోకుండా ఉన్నత చదువులు చదివి జీవితంలో న్యాయ సంగారెడ్డి న్యాయ కళాశాల విద్యార్థులు స్థిరపడాలని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయ కళాశాల ప్రిన్సిపల్ వైస్ ప్రిన్సిపల్ కళాశాల అధ్యాపకుని ఈ కార్యక్రమంలో న్యాయ కళాశాల ప్రిన్సిపల్ వైస్ ప్రిన్సిపల్ కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ బీసీలను మోసం చేస్తోంది. కులగణనలో 5, 6% బీసీ జనాభాను తగ్గించి చూపించారు. పంచాయతీల వారీగా అన్ని కులాల జనాభాను బయటపెట్టాలి. ప్రధాన ప్రతిపక్షం నిద్రపోతోంది. రిజర్వేషన్లు లేని చోట బీసీలు పెద్ద ఎత్తున నామినేషన్లు వేసి గెలవాలి. అవసరమైతే ఎన్నికలను వాయిదా వేయాలి. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చే వరకు పోరాటం కొనసాగుతుంది.

- జాగృతి అధ్యక్షురాలు కవిత

ప్రాంతీయం

పంచాయితీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ హైమావతి

ప్రతిపక్షం, సిద్దిపేట, నవంబర్ 26: జిల్లాలో గ్రామపంచాయితీ ఎన్నికలను ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి సూచించారు. బుధవారం ఐడీఓసీ మినీ సమావేశ మందిరంలో ఎన్నికల ఏర్పాట్లపై సీపీ విజయ్ కుమార్తో కలిసి జిల్లా ఎన్నికల కోఆర్డినేషన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించి, సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మూడు విడతల్లో జరగనున్న గ్రామపంచాయితీ ఎన్నికల కోసం మొత్తం 508 గ్రామపంచాయతీలు, 4,508 పోలింగ్ కేంద్రాలు ఎన్నికల ప్రవర్తన నియమావళికి అనుగుణంగా సిద్ధంగా ఉన్నాయని, ఎస్ఎస్టి, ఎఫ్ఎస్టీ తదితర బృందాల ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. నవంబర్ 27న మొదటి విడత, 30న రెండో విడత, డిసెంబర్ 3న మూడో విడత నామినేషన్లు స్వీకరించనున్నట్లు చెప్పారు. నామినేషన్ దాఖలు చేయడానికి అభ్యర్థితో పాటు కేవలం ముగ్గురికే అనుమతి ఉంటుందని, అలాగే నామినేషన్ కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో ఎవ్వరినీ అనుమతించవద్దని అధికారులు ఆదేశించారు. నామినేషన్ల పరిశీలనకు సంబంధించి ఆర్డీవోలకు అప్పీలు చేయవచ్చని చెప్పారు. దశల వారీగా అభ్యర్థులు వారీ నామినేషన్ లను ఉపసంహరించుకోవచ్చని, ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్, మధ్యాహ్నం 2 గంటల నుంచి మండల కేంద్రాల్లోనే కౌంటింగ్ నిర్వహించనున్నట్లు వివరించారు. సీపీ విజయ్ కుమార్ మాట్లాడుతూ క్రిటికల్, నార్మల్ పోలింగ్ స్టేషన్ల వద్ద పకడ్బందీ భద్రతా చర్యలను చేపట్టాలని సూచించారు. బ్యాలెట్ బాక్సులు స్ట్రాంగ్ రూమ్‌లకు చేరేవరకు కట్టుదిట్టమైన బందోబస్తు చేయాలని ఆదేశించారు. ముందుగానే రూట్ మ్యాపులను పోలీసు అధికారులకు అందించాలని, పోలింగ్ కేంద్రాల్లో టాయిలెట్లు, లైటింగ్, మంచినీరు వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. పోలింగ్ రోజున ఎన్‌సీసీ, ఫారెస్ట్ సిబ్బంది సహాయాన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు. ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ రోజుల్లో జిల్లాలోని వైన్ షాపులు, బార్లు మూసివేయాలని ఆదేశించారు. అలాగే ఎన్నికల నియమావళికి వ్యతిరేకంగా ఉన్న వాల్‌రైటింగ్, ఫ్లెక్సీలు, పోస్టర్లు వెంటనే తొలగించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డీఆర్డీవో జయదేవ్ ఆర్యా, సీపీఓ నాగేశ్వర్, జడ్పీ సీఈఓ రమేష్, ఆర్డీవోలు, ఏసీపీలు ఇతర ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

గుడి, బడి, మహనీయుల విగ్రహాల సమీపంలో
వైన్స్ షాపులు ఏర్పాటును రద్దు చెయ్యాలి

ప్రతిపక్షం, సిద్దిపేట, నవంబర్ 26: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సిద్దిపేటలో గుడి, బడి మహనీయుల విగ్రహాల సమీపంలో వైన్స్ షాపులు నడిపిస్తుంటే పోలీసులు, ఎక్సైజ్ అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బాసంగారి వెంకట్ ప్రశ్నించారు. సిద్దిపేటలోని రూరల్ పోలీస్ స్టేషన్ చౌరస్తాలో దాసాంజనేయ గుడి సమీపంలో ఉన్న వైన్ షాపులను తొలగించాలని బీజేపీ నాయకులు రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. బీజేపీ నాయకులు రోడ్డుపై బైఠాయించడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. విషయం తెలుసుకున్న త్రీ టౌన్ సీఐ శ్రీను అక్కడికి చేరుకుని బీజేపీ నాయకులకు నచ్చజెప్పి ధర్నా విరమింప చేశారు. ఈ సందర్భంగా బాసంగారి వెంకట్ మాట్లాడుతూ హనుమాన్ గుడి సమీపంలో వైన్ షాపును ఏర్పాటు చేస్తే భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నాయని తెలిపారు. కేవలం 20 మీటర్ల దూరంలో వైన్స్ షాప్ ఉన్నప్పటికీ ఇది ఎండోమెంట్ పరిధిలో లేదని కుంటిసాకులతో అధికారులు నిమ్మకు నిరెత్తినట్టున్నారని ఆవేదన చెందారు. ఇక్కడ ప్రతి సంవత్సరం దసరా ఉత్సవాలే కానీ హనుమాన్ జయంతి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించ బడతాయని భక్తుల మనోభావలతో చెలగాడుతూ వైన్ షాప్ ను తొలగించకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుండ్ల జనార్ధన్, కసనగొట్టుసంతోష్, బొమ్మగోని పద్మ, కెమ్మసరం సంతోష్, బొడ్డు సునీల్, చంది సత్యానారాయణ, పిట్ల నరేష్, బంధారం కనకరాజ్, వీర రెడ్డి. కొంగర పవన్, గాంధే సంతోష్, లక్ష్మారెడ్డి, మహేందర్, సాయిబాబా, ఉమాపతి, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్షురాలు అంక్షారెడ్డికి ఘన సన్మానం

ప్రతిపక్షం, చేగుంట, నవంబర్ 26: గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి కూతురు అంక్షారెడ్డి సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా ఎన్నికైన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, నాచారం ఆలయ కమిటీ చైర్మన్ రవీందర్ గుప్తా, సీనియర్ జర్నలిస్ట్ జానకి రాములు, మెదక్ జిల్లా కాంగ్రెస్ నాయకులు బుద్ధ భాగ్యరాజ్, బాలేష్ గుప్త, ఆశాజ్యోతి, మల్లేశం, సిద్దిరాములు, వెంకటేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా పర్శయ్య

ప్రతిపక్షం, మిరుదొడ్డి, నవంబర్ 25: మిడిదొడ్డి మండలం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా లింగుపల్లి గ్రామానికి చెందిన పెద్దలింగన్నగారి పర్శయ్య ఎన్నికయ్యారు. రైతు బిడ్డ అయిన పర్శయ్యకు ఇవ్వడం పట్ల రైతులు అభినందనలు తెలుపుతున్నారు. రైతు బిడ్డలే మార్కెట్ కమిటీలు చైర్మన్ గా, డైరెక్టర్లుగా ఉంటేనే రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా నియమించినందుకు పర్శయ్య ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుతూ
దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరు పాల్గొనాలి

- జిల్లా కలెక్టర్ హైమావతి

ప్రతిపక్షం, సిద్దిపేట, నవంబర్ 26: , రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుతూ దేశ అభివృద్ధిలో ప్రతీ ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ హైమావతి అన్నారు. సిద్దిపేట ఐడీఓసీ సమావేశ మందిరంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కె. హైమావతి ముఖ్య అతిథిగా హాజరై, కార్యాలయంలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బందితో కలిసి రాజ్యాంగ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భారత స్వాతంత్ర్యం ప్రాధాన్యతను, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. వందల ఏళ్లు ఈస్ట్ ఇండియా కంపెనీ, ఆంగ్లేయుల పాలనలో భారత ప్రజలకు స్వేచ్ఛ లేకపోవడం, ప్రజల ప్రయోజనాలకంటే తమకోసం అనుకూల చట్టాలు అమలు చేశారని పేర్కొన్నారు. స్వాతంత్ర్య ఉద్యమ ఫలితంగా 1947 ఆగస్టు 15న భారతదేశానికి స్వాతంత్ర్యం లభించిందని, అనంతరం రాజ్యాంగ తయారీకి ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసి, 1949 నవంబర్ 26న రాజ్యాంగం ఆమోదించబడిందని తెలిపారు. 1950 జనవరి 26న దేశ రాజ్యాంగం అమల్లోకి రావడంతో ఆ రోజును గణతంత్ర దినోత్సవంగా దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఘనంగా జరుపుకుంటున్నామని వివరించారు. భారత రాజ్యాంగం ప్రతిపాదించే విలువలు, సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం, భావప్రకటన హక్కులు, ప్రతి పౌరుడి జీవితంలో ఆచరణాత్మకంగా ఉండాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

బీసీ రిజర్వేషన్ల అమలులో

కాంగ్రెస్ అన్యాయం

- బీఆర్ఎస్ అధ్యక్షులు మైలారం బాబు

ప్రతిపక్షం, చేగుంట, నవంబర్ 26: బీసీ రిజర్వేషన్ లు అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ తీరని అన్యాయం చేసిందని బీఆర్ఎస్ పార్టీ నార్సింగి మండల అధ్యక్షులు మైలారం బాబు ఎద్దేవా చేశారు. ఇచ్చిన వాగ్దానాలను కాంగ్రెస్ పార్టీ నిలబెట్టుకోలేదని బీసీలకు మాయ మాటలు చెప్పి ఓట్ల రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను కాంగ్రెస్ పార్టీ నిలబెట్టుకోలేదని బాబు వెల్లడించారు . 50 శాతానికి పైగా ఉన్న బీసీలకు జనాభా ప్రాతిపదికన వార్డు సభ్యులకు కేటాయిస్తే మేలు జరిగేదన్నారు. బీసీ ఓట్లను దండుకోవడానికి కపట నాటకంతో బీసీలను మోసం చేశారని మైలారం బాబు విమర్శించారు. ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకొని స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని సూచించారు.

చేగుంట మార్కెట్ కమిటీ చైర్మన్ గా వెంగళరావు

ప్రతిపక్షం, చేగుంట, నవంబర్ 26: చేగుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా తాడేపు వెంగళరావు నియామయ్యారు. ప్రాంతాలవారీగా 14 మంది డైరెక్టర్ లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రికి, మంత్రులకు మెదక్, సిద్దిపేట నియోజక వర్గాల కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జిలకు, దుబ్బాక నియోజకవర్గ ఇన్చార్జి చెరుకు శ్రీనివాసరెడ్డికి చైర్మన్ వెంగళరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ గా ఎన్నికైన వెంగళరావును చెరుకు శ్రీనివాస్ రెడ్డి, పలువురు కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు.

భారత రాజ్యాంగం గొప్పది

- శ్రీ చైతన్య స్కూల్ ఏజీఎం సతీష్
- ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం

ప్రతిపక్షం, హయత్ నగర్, నవంబర్ 26: భారత రాజ్యాంగం గొప్పదని శ్రీ చైతన్య స్కూల్ ఏజీఎం సతీష్ అన్నారు. హయత్ నగర్ పరిధిలోని సాయి నగర్ బ్రాంచ్ శ్రీ చైతన్య స్కూల్లో బుధవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థిని విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శించి పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏజీఎం సతీష్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నవంబర్ 26న భారత రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకుంటామని చెప్పారు. శ్రీ చైతన్య స్కూల్ ఆర్ఐ వెంకట్ రెడ్డి భారత రాజ్యాంగం, దాని యొక్క గొప్పతనం గురించి విద్యార్థులకు వివరించారు. స్కూల్ ప్రిన్సిపాల్ అంజనీదేవి మాట్లాడుతూ భారత రాజ్యాంగం రూపొందించడానికి రెండు సంవత్సరాల 11 నెలల 18 రోజుల సమయం పట్టిందన్నారు. అంబేద్కర్ అధ్యక్షతన ఒక కమిటీ ఏర్పాటు చేసి రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య స్కూల్ కోఆర్డినేటర్ రఘువంశీ, డీన్ రఘుపతి, ప్రైమరీ కోఆర్డినేటర్ కామేశ్వరి, ప్రీ ప్రైమరీ ఇన్ చార్జి స్వరూప రాణి, సి బ్యాచ్ ఇన్ చార్జి సోమయ్య, ఏవో ప్రమోద్ గౌడ్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

నాచగిరి హుండీ లెక్కింపు.. ఆలయానికి భారీ ఆదాయం

- 6 తులాల బంగారం, కిలో వెండి, 29 లక్షల పైగా నగదు

ప్రతిపక్షం, గజ్వేల్(వర్గల్), నవంబర్ 26: దసరా, దీపావళి నుండి కార్తీక మాసం ముగిసే వరకు నాచగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆవరణలో గత 154 రోజులుగా జరిగిన బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని భక్తుల నుండి వివిధ రూపాల్లో వచ్చిన హుండి ఆదాయాన్ని బుధవారం నాడు సిద్దిపేట డివిజన్ ఎండోమెంట్ ఇన్స్పెక్టర్, విజయలక్ష్మి పర్యవేక్షణలో దేవాలయం ఆవరణలో లెక్కించారు. హుండీ మొత్తం లెక్కించగా 29 లక్షల 62 వేల 845 రూపాయలు నగదు, 61 గ్రాములు బంగారం, కిలో 337 గ్రాముల వెండి ఉన్నట్లు దేవస్థానం కమిటీ చైర్మన్ రవీందర్ గుప్తా, ఆలయ కార్య నిర్వాహాధికారి విజయరామ రావులు తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో ధర్మకర్తలు చందా నాగరాజు, గాలి కిష్టయ్య, ఉష్ శ్రీ రాజశేఖర్ శర్మ, కర్రె పద్మ వెంకటేష్, జగ్గయ్య గారి శేఖర్ గుప్తా, నాయకం శ్రీనివాస్, రుద్ర శ్రీహరి మరియు కొత్తపల్లి శ్రీనివాస్, సిబ్బంది సుధాకర్, నరేందర్, పాండు మరియు భ్రమరాంబికా సేవా సమితి సేవకులు లెక్కింపులో పాల్గొన్నారు.

కార్మికులను బానిసత్వంలోకి నెట్టే లేబర్ కోడ్లను రద్దు చేయాలి

- కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన

ప్రతిపక్షం, సిద్దిపేట, నవంబర్ 26: కార్మిక వర్గాన్ని యాజమాన్యాలు యథేచ్ఛగా దోపిడీ చేయడానికి అనుకూలంగా కార్మికులను బానిసత్వంలోకి నెట్టే కార్మిక కోడ్లను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిందని, ఈ కార్మిక కోడ్లను వెంటనే రద్దు చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆముదాల మల్లారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం కార్మిక కోడ్లను రద్దు చేయాలని, రైతు, వ్యవసాయ కార్మికుల వ్యతిరేక విధానాలను విడనాడాలని జాతీయ కార్మిక రైతు వ్యవసాయ కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా సిద్దిపేట పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ కార్మికులను బానిసత్వంలోకి నెట్టే విధంగా కార్మిక కోడ్లను రూపొందించారని, కార్మిక వర్గానికి సామాజిక న్యాయం, ఉద్యోగ భద్రత లేకుండా యాజమాన్యాలకు అనుకూలంగా కార్మిక కోడ్ల రూపొందించారని అన్నారు. దీనివల్ల కార్మికులు ఉద్యోగులు జీవితాలకు భద్రత లేకుండా పోతుంది అన్నారు. యాజమాన్యాలకి అనుకూలంగా తీసుకువచ్చిన కార్మిక కోడ్లను వెంటనే రద్దుచేసి అనేక త్యాగాలు చేసి పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. రైతాంగాన్ని నట్టేట ముంచే విధంగా సాగు వ్యతిరేక నల్ల చట్టాలను ప్రవేశపెడుతున్నారని దీనివలన వ్యవసాయం నుండి రైతు దూరమై కార్పొరేట్లకు అప్పగించే విధంగా చట్టాలను రూపొందించారని, నూతన విద్యుత్ సవరణ బిల్లును తీసుకువచ్చి రైతులు పేదల పైన కరెంటు చార్జీలు పెంచి ఉచిత కరెంటు లేకుండా సబ్సిడీ లేకుండా ప్రజలపై భారాలు వేయడానికి సిద్ధమయ్యారని ఈ విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే విధంగా బడ్జెట్లో కోతలు విధించి అనేక శాఖలతో వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ చట్టాన్ని దూరం చేసే విధంగా విధానాలు రూపొందిస్తున్నారని, ఈ విధానాలను కార్మిక వర్గం ఉద్యోగులు రైతులు కూలీలు పేదలందరూ ఐక్యంగా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కాముని గోపాలస్వామి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్, హెచ్ఎంఎస్ జిల్లా అధ్యక్షులు ఇదారి మల్లేశం, బీఆర్టీయూ జిల్లా కార్యదర్శి నర్సింహులు, శ్రీనివాస్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాళ్ల బండి శశిధర్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొంగరి వెంకట మావో, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య, జిల్లా కోశాధికారి గొడ్డుబర్ల భాస్కర్, సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, ఇప్పకాయల శోభ డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు చల్లార తిరుపతిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు తాడూరు రవీందర్, శిరీష ఏఐటీయూసీ నాయకులు మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం

ప్రతిపక్షం, చేర్యాల, నవంబర్ 26: సుబ్రహ్మణ్య షష్ఠిపురస్కరించుకుని అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో బుధవారం శ్రీ వల్లి దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. పండితులు దేశపతి చేతన్య శర్మ, ప్రహ్లాద్ వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు, అర్చన అభిషేక కార్యాక్రమాలను నిర్వహించి ప్రత్యేక వేదిక ద్వారా శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనగా అయ్యప్ప స్వాములు చేసిన భజన కార్యక్రమంతో ఆలయ ఆవరణ మారుమోగింది. మెదట సుబ్రహ్మణ్య స్వామి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో తీసుకరాగా మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. సాయంత్రం స్వామికి పట్టాభిషేకం నిర్వహించి సకీర్తన చేశారు. వచ్చిన భక్తులకు తీర్ధ ప్రసాదలతో పాటు అన్న ప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వామి దేవాలయ కమిటీ నిర్వాహకులు భక్తులు పాల్గొన్నారు.

“

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025 ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులను ఆహ్వానించాలి. పెట్టుబడులపై ఒప్పందాల విషయంలో ప్లాన్ ప్రకారం ముందుకెళ్లాలి. వివిధ విభాగాలపై స్టాల్స్, రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్ పెంచేలా డ్రోన్ షో, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి.

- గ్లోబల్ సమ్మిట్ సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

ప్రాంతీయం

చేనేత వస్త్రాలు ప్రజల హుందాతనానికి సూచిక

- రష్యా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రొఫెసర్లు

ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 26: చేనేత వస్త్రాలు ప్రజా ఆరోగ్యానికే కాకుండా హుందాతనానికి సూచికలని రష్యా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రొఫెసర్స్ ఆంద్రీ, లుపా, అలీనా అన్నారు. బుధవారం వారు గజ్వేల్ చేనేత సహకార సంఘంలో మర మగ్గాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేత పరిశ్రమ ఎంతో పురాతనమైందని, దీనిని ఇప్పటి వరకు కాపాడుకుని కొన్ని కుటుంబాలు జీవించడం సంతోషదాయకమన్నారు. ఈ పరిశ్రమ ద్వారా మానవుని శరీర ఆకృతి దృఢంగా మారుతుందని, వారి "కళ" పలు దేశాలకు దిక్సూచిగా మారనుందని కొనియాడారు. సంఘం అధ్యక్షులు బొల్లిబత్తుల దేవదాస్ మాట్లాడుతూ దేవతలకు వస్త్రాలు అందించిన పద్మశాలీల గొప్పతనం ఎనలేనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆడెపు బాలచంద్రం, కుల పెద్దలు బింగి పురుషోత్తం రామకోటి రామరాజు, కృష్ణమూర్తి ఆంజనేయులు, పూల సత్యము, గాడిపల్లి శ్రీనివాస్, సిద్దిపేట జిల్లా పద్మశాలి యువజన సంఘం అధ్యక్షులు గాడిపల్లి అనుప్, సిద్దిపేట జిల్లా పద్మశాలి ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి దేవసాని వాసుదేవ్, పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు కోట కిషోర్, ప్రధాన కార్యదర్శి గాడిపల్లి ఎల్లంరాజు కోశాధికారి దేవసాని హనుమాన్ దాస్ ,గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పద్మశాలి యువజన సంఘం అధ్యక్షులు తలకొక్కుల ప్రేమ్ కుమార్ , యువజన సంఘం ప్రధాన కార్యదర్శి హనుమాన్ల నాగరాజు నేత, కోశాధికారి గుండు మల్లేశం, యువజన సంఘ సభ్యులు సుధాకర్, సాయి మహేష్, నరేష్ మహేందర్, సత్యనారాయణ, కృష్ణ, రమేష్, మరియు పద్మశాలి కుల బాంధవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని భూస్థాపితం చేస్తాం

- బీసీల వెంటే తెలంగాణ రాజ్యాధికార పార్టీ
- తెలంగాణ రాజ్య అధికార పార్టీ జిల్లా అధ్యక్షులు భిక్షపతి

ప్రతిపక్షం, సిద్దిపేట, నవంబర్ 26 : కాంగ్రెస్ పార్టీ చేసిన మోసం చేసి అధికారంలోకి రావడానికి తెలంగాణలో ఉన్న మైనారిటీ బీసీలకు 42%రిజర్వేషన్ ఇస్తామని చెప్పి మోసం చేసి కేవలం17%కు యిచ్చి ఎప్పుడు స్థానిక సంస్థ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ ముందుకు వచ్చిందని తెలంగాణ రాజ్య అధికార పార్టీ జిల్లా అధ్యక్షులు తుప్పటి భిక్షపతి అన్నారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో మీడియాతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో బీసీ లను మోసం చేసిందని, రాబోయే 2028 జనరల్ ఎన్నికల్లో ఈ రాష్ట్రం లో కాంగ్రెస్ పార్టీని భూ స్థాపితం చేసి, తెలంగాణలో బీసీ రాజ్యాధికారం తీసుకువస్తామన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రజలకు రాజ్యాధికారం అందించడం కోసం తెలంగాణలో తీన్మార్ మల్లన్న స్థాపించిన తెలంగాణ రాజ్యాధికారం పార్టీతోనే సాధ్యమని, ఈ పార్టీ బీసీల కోసం పనిచేస్తుందన్నారు. ఆదరించి సిద్దిపేట జిల్లాలో స్థానిక సంస్థ ఎన్నికల్లో పోటీ చేస్తున్న సర్పంచ్లకు మా యొక్క పూర్తి మద్దతు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి షాదుల్లా మహమ్మద్, నర్సింగ్, రమేష్, సయ్యద్ బాబా, శ్వేత, మౌనిక పాల్గొన్నారు.

అనంత సాగర్ విద్యార్థులకు అంతర్జాతీయ గుర్తింపు

- అంతర్జాతీయ బాల రచయితల సమ్మేళనానికి ఇద్దరు ఎంపీక

ప్రతిపక్షం, నంగునూరు, నవంబర్ 26: సిద్ధిపేట జిల్లా చిన్నకోడూరు మండలంలోని అనంతసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అంతర్జాతీయ బాల రచయితల సమ్మేళనానికి ఎంపికయ్యారు. ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా) ఆధ్వర్యంలోని ప్రపంచ సాహిత్య వేదిక ప్రతిష్టాత్మకంగా బాలసాహిత్య భేరి పేరిట ఈనెల 30న అంతర్జాతీయ బాల రచయితల సమ్మేళనం నిర్వహిస్తోంది. ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ సమ్మేళనంలో చిన్నకోడూరు మండలంలోని అనంత సాగర్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోట జ్యోతి తెలిపారు. పాఠశాలకు చెందిన బి.విశ్వతేజ, బి. రవిత్రేయని ఈ సమ్మేళనంలో పాల్గొనేందుకు ఆహ్వానం అందిందని చెప్పారు. ఎంపికైన విద్యార్థులు వర్చువల్ గా ఈ సమ్మేళనంలో పాల్గొంటారని చెప్పారు. కథ, వచన కవిత్వం, గేయం, పద్యం విభాగాల్లో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు విద్యార్థిని విద్యార్థులు 101 మంది ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. విశ్వవిద్యాలయాల వైస్ చాన్స్‌లర్లు, కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలు, ప్రఖ్యాత బాల సాహితీవేత్తలు, జాతీయ అంతర్జాతీయ ప్రముఖులు పాల్గొంటున్న ఈ అంతర్జాతీయ బాల రచయితల సమ్మేళనంలో అనంతసాగర్ విద్యార్థులు కథల విభాగంలో మూడు నిమిషాల పాటు కథలు చెబుతారని తెలిపారు. విద్యార్థులకు అంతర్జాతీయ గుర్తింపు రావడం పట్ల ఉపాధ్యాయులు భైతి దుర్గయ్య హర్షం వ్యక్తం చేసారు. తమ పాఠశాల విద్యార్థులకు అరుదైన అవకాశం కల్పించిన తానా అధ్యక్షుడు డాక్టర్ నరేన్ కొడాలి, తానా ప్రపంచ సాహిత్య వేదిక నిర్వాహకుడు డాక్టర్ తోటకూర ప్రసాద్, సమన్వయకర్త చిగురుమళ్ళ శ్రీనివాస్ తదితరులకు ధన్యవాదాలు తెలియజేశారు.

అంబేద్కర్ రాజ్యాంగం ప్రకారమే దేశం నడుస్తోంది

ప్రతిపక్షం, దౌల్తాబాద్, నవంబర్ 26: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారమే భారతదేశం నడుస్తుందని మండల విద్యాధికారి గజ్జల కనకరాజు అన్నారు. బుధవారం భారత రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని దౌల్తాబాద్ మండల కేంద్రంలోని జడ్పీ బాలుర పాఠశాల హెచ్ఎం అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి గజ్జల కనకరాజు హాజరై మాట్లాడుతూ ప్రపంచానికే ఆదర్శం భారత రాజ్యాంగమని, భారత రాజ్యాంగం అతి పెద్ద లిఖిత రాజ్యాంగం బాబాసాహెబ్ అంబెద్కర్ కృషి మరువలేనిదన్నారు. ఈ తరం విద్యార్థులు అంబేద్కర్ను ఆదర్శంగా తీసుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమం ఉద్దేశించి విద్యార్థులకు ఉపన్యాసం, వ్యాసరచన పోటీలు, నిర్వహించారు, విజేతలైన విద్యార్థులకు బహుమతులను అందచేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు సంజీవ గౌడ్, మల్లేశం, విజయ్ కృష్ణ, సత్యనారాయణ, హరికృష్ణ, రవీందర్, ఫిజికల్ డైరెక్టర్ విష్ణుకుమార్, పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో తాము రాష్ట్రంలో అధికారంలోకి వస్తామని వైసీపీ నేతలు కలలు కంటున్నారు. అది జరగదు. 2029లో మేమే వచ్చేస్తామంటున్నారు. రాజోలు గడ్డ సాక్షిగా చెబుతున్నా.. మీరు అలాంటి ఆశలు పెట్టుకోవద్దు. అది జరగదు. మరో 15 ఏళ్లు కూటమి ప్రభుత్వమే అధికారంలో ఉంటుంది.

- ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

కనీస వసతులు కల్పించేందుకు కృషి

- ఎస్సెస్సీలో శత శాతం ఫలితాలను సాధించాలి
- జిల్లా విద్యాధికారి ఎల్లంకి శ్రీనివాసరెడ్డి

ప్రతిపక్షం, కోహెడ, నవంబర్ 26: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు కృషిచేస్తామని, ఎస్సెస్సీ లో శత శాతం ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సిద్దిపేట జిల్లా విద్యాధికారి ఎల్లంకి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సిద్దిపేట జిల్లా కోహెడ మండలంలోని వరికోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను బుధవారం సందర్శించారు. కోహెడ అసిస్టెంట్ ఇంజనీర్ సాయికిరణ్ తో కలిసి ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో మౌలిక వసతులను పరిశీలించారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు తరగతి గదులు లేక రేకుల షెడ్యూల్లో విద్యాభ్యాసం చేస్తున్నారని గుర్తించారు. బాలురకు మూత్రశాలలు లేక ఇబ్బంది కలుగుతోందని పాఠశాల సిబ్బంది డీఈవో కు తెలిపారు. పాఠశాల ఆవరణ ఎగుడు దిగుడుగా ఉండడంతో వర్షాలు పడినప్పుడు పాఠశాల ఎవరణలో నీరు నిలుస్తోందని చెప్పారు. ఉన్నత పాఠశాలలో తరగతి గదుల ఫ్లోరింగ్ దెబ్బతినడమే కాక ప్రహరీ గోడ మరమ్మతు చేయాల్సి ఉందని తోపాటు. మూత్రశాల్లు పూర్తిగా నీటితో నిండిపోవడంతో విద్యార్థులు ఉపయోగించుకోవడానికి వీలు లేకుండా ఉన్నాయని చెప్పారు. వీటిని పరిశీలించిన డీఈవో శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో మౌలిక వసతుల కోసం నూతన తరగతి గదులతో కూడిన భవనం, మూత్రశాలలు, ఫ్లోరింగ్ మరమ్మతు, ఆవరణ చదును చేయడానికి అవసరమైన అంచనాలు రూపొందించి ప్రతిపాదనలను పంపించాలని ఏఈ సాయి కిరణ్ కు సూచించారు. అవసరమైన నిధుల మంజూరు కోసం జిల్లా కలెక్టర్ కు సమగ్ర నివేదికతో సమర్పిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల విద్యార్థుల హాజరు, సమయపాలన, పాఠశాల రికార్డులు పరిశీలించారు. పరీక్షలు సమీపిస్తున్న దృష్ట్యా ఉపాధ్యాయుల సలహాలు సూచనలు పాటిస్తూ మంచి ప్రణాళికతో కష్టపడి చదివి మంచి ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారికి ప్రత్యేక తరగతులను తీసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఎస్ఎస్సి లో శాతం ఉత్తీర్ణత వచ్చేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఆర్.పద్మయ్య, గెజిటెడ్ హెచ్.ఎం. డి.కృష్ణవేణి, కే.వేణుగోపాల్, సీఆర్పీ సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీలో రాజ్యాంగ దినోత్సవం

ప్రతిపక్షం ప్రతినిధి, గోదావరిఖని, నవంబర్ 26: ఎన్టీపీసీ రామగుండం తెలంగాణలో రాజ్యాంగ దినోత్సవాన్ని మహోన్నత భావనతో, దేశభక్తి జ్వాలలతో కాకతీయ ఆడిటోరియంలో బుధవారం ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లో నిర్వహించారు. ఈ మహత్తర సందర్భాన్ని పురస్కరించుకొని ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, టౌన్‌షిప్ నివాసితులు, పాల్గొని న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే రాజ్యాంగ విలువలకు అంకిత భావాన్ని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమం చందన్ కుమార్ సమంత ఆకర్షణీయమైన,ప్రేరణాత్మక ప్రసంగంతో ముగిసింది. ఆయన భారత రాజ్యాంగం, నేటి కాలం లోనూ ఉండే శాశ్వత ప్రాధాన్యత ను వివరించి, వ్యక్తిగత, వృత్తి, సామాజిక జీవితాలలో దాని సూత్రాలను పాటించాలని అందరినీ కోరారు.

మత్స్యకారుల అభివృద్ధికి ఉచిత చేప పిల్లల పంపిణీ

ప్రతిపక్షం, మిడిదొడ్డి, నవంబర్ 26: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మత్స్యకారులకు ఉచిత చేప పిల్లల కార్యక్రమంలో భాగంగా భూంపల్లి గ్రామంలోని పెద్ద చెరువులో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య చెరువులోకి చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా చైర్మన్ వెంకటయ్య మాట్లాడుతూ ఉచిత చేప పిల్లల పథకం మత్స్య వృత్తి దారులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. చేపల పెంపకం వృత్తిగా ఉన్న ముదిరాజ్ , బెస్త, గంగపుత్రులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎంతో వెనుకబడి ఉన్నారని, వీరి ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ వెంకటయ్య పాటు జిల్లా మత్స్యశాఖ అధికారులు, ముదిరాజ్ కుల సంఘం అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సొసైటీ చైర్మన్లు సంఘ సభ్యులు, గ్రామస్తులు ఇతరులు ఉన్నారు.

మెదక్ నూతన విద్యుత్ డివిజన్ ఇంజనీర్ గా రామేశ్వర స్వామి

ప్రతిపక్షం, మెదక్ టౌన్, నవంబర్ 26 : మెదక్ విద్యుత్ శాఖ నూతన డివిజనల్ ఇంజనీర్ (డీఈ)గా రామేశ్వర్ స్వామీ బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. సంగారెడ్డి టీఆర్ఈ ఏడీఈగా విధులు నిర్వహిస్తున్న రామేశ్వర స్వామీ పదోన్నతిపై మెదక్ డివిజన్ డిఈగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా మెదక్ విద్యుత్ అధికారులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రామేశ్వర స్వామీ మాట్లాడుతూ.. విద్యుత్ అధికారులు, సిబ్బంది సహకారంతో మెదక్ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో 1104 యూనియన్ నాయకులు నేత ప్రసాద్, విఠల్, రాంపురం నాగేష్, వరప్రసాద్, కామారం శ్రీనివాస్, వీఎల్ఎన్ రెడ్డి, విజయ్ కుమార్, రవీందర్ గౌడ్, మరాఠీ శ్రీనివాస్, ఇబ్రహీం, దుర్గాప్రసాద్, టేక్మల్ సంగయ్య, బలరాం, తదితరులు పాల్గొన్నారు.

వైభవోపేతంగా వల్లి దేవసేన సుబ్రహ్మణ్య కళ్యాణం

- భక్తజనసంద్రంగా మారిన వర్గల్ విద్యాధరి ఆలయం

ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 26: వల్లి దేవసేన సుబ్రహ్మణ్య స్వామి జన్మదినం సందర్భంగా వర్గల్ మండల క్షేత్రంలో "స్కంద షష్టి" మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. క్షేత్ర వ్యవస్థాపకులు, బ్రహ్మశ్రీ, యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి నేతృత్వంలో వేద పండితులు బుధవారం తెల్లవారుజామున శ్రీ వల్లి దేవసేన సుబ్రహ్మణ్య స్వామికి పంచామృతాభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు, దివ్య దర్శనం, లక్ష పుష్పార్చన తదితర ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తుల భజనలు, కోలాటం, ఆధ్యాత్మిక సంబురాల మధ్య సతీసమేతులైన స్వామిని ఆలయ పురవీధుల్లో ఊరేగించి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన సభా మండపంలోని కళ్యాణ వేదికపై అధిష్టింపజేశారు. ఈ సందర్భంగా పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సిద్ధాంతి దంపతులు అందజేయగా, ఆలయ అర్చకులు, గురువులు, భక్తులు సుమారు మూడు గంటల పాటు నిర్వహించిన కళ్యాణ మహోత్సవం పురస్కరించుకొని స్వామివారి వైభవాన్ని భక్తులకు సిద్ధాంతి చంద్రశేఖర శర్మ చాటి చెప్పారు. పరమశివుడి అంశతో లోక కళ్యాణార్థమై జన్మించిన శ్రీ సుబ్రహ్మణ్య స్వామిని అర్చిస్తే అంతా మంచే జరుగుతుందని స్పష్టం చేశారు. మహత్కార్యంలో పాల్గొన్న, సహకరించిన భక్తులకు పుణ్యఫలం దక్కుతుందని సిద్ధాంతి చంద్రశేఖర శర్మ వివరించారు. కాగా ఆలయ సముదాయంలో ఆధ్యాత్మిక వైభవం సంతరించుకోగా, విశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహా ప్రసాదం అందజేశారు.

పీఆర్సీని వెంటనే అమలు చేయాలి

- పెండింగ్ బిల్లులు, డీఏలను విడుదల చేయాలి
- ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మికులకు హెల్త్ కార్డులను మంజూరు చేయాలి
- టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు కొండల్ రెడ్డి

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 26: రాష్ట్ర ప్రభుత్వం ఇస్తామన్న పీఆర్సీని వెంటనే అమలు చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు కొండల్ రెడ్డి డిమాండ్ చేశారు. ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. పెండింగ్ బిల్లులు, డీఏలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ విరమణ చేసిన టీచర్లకు, ఉద్యోగుల బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. బుధవారం తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ మెదక్ జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు కొంగోటి యాదగిరి అధ్యక్షతన జిల్లా కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరై కొండల్ రెడ్డి మాట్లాడుతూ ఆర్భాటంగా 33 జిల్లాలు ఏర్పాటు చేసి ఎలాంటి విద్యాధికారి పోస్టులను మంజూరి చేయకుండా గత ప్రభుత్వం చేతులు దులుపుకుందని ఈ ప్రభుత్వమైనా ప్రతీ జిల్లాకు జిల్లా విద్యాధికారి పోస్టును మంజూరి చేసి భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నూతనంగా ఏర్పాటు చేసిన మండలంలో ఎంఆర్సీ కార్యాలయ నిర్మాణాలు చేపట్టాలని కోరారు. ఎన్నికల ముందు ప్రభుత్వ హామీ మేరకు పీఆర్సీని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. జేఏసీతో కుదుర్చుకున్న ఒప్పందాలను వెంటనే అమలు చేయాలని, ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు నగదు రహిత వైద్య విధానాన్ని అందించే హెల్త్ కార్డులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా పట్టణ ప్రాంతాల్లో నూతన పాఠశాలలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశ ప్రారంభంలో ఏపీటీఎఫ్ పూర్వ కార్యదర్శి ఉపాధ్యాయ ఉద్యమ నేత నారాయణ మృతికి సంతాప సూచకంగా రెండు నిమిషాల మౌనం పాటించారు. ఈ సమావేశంలో వెంకట్రాంరెడ్డి, ఉపాధ్యాయ మాసపత్రిక మాజీ సంపాదకులు శశిధర్ రెడ్డి సీనియర్ రాష్ట్రకౌన్సిల్ సభ్యులు సంగయ్య, హీరా లాల్, రాజేంద్ర ప్రసాద్, అల్వాల రమేష్, రజిత, జిల్లా కమిటీ ఉపాధ్యక్షులు గోపాల్, విఠల్ రెడ్డి, జిల్లా కార్యదర్శి దేవి సింగ్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు నూతన జిల్లా విద్యాధికారి విజయకు ఉపాధ్యాయుల పలు సమస్యలపై ప్రాతినిధ్యం చేయడం జరిగింది.

ఖనిలో ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

ప్రతిపక్షం ప్రతిపక్షం, గోదావరిఖని, నవంబర్ 26: భారత రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయం లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, విద్యార్థినులు రాజ్యాంగ ప్రవేశిక చదివారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్ మారుతి ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.వి.రామన్,సెక్రెటరీ ఉమా మహేశ్వర్ రావు,అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వర్లు,అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీహరి,టి పి ఎస్ నవీన్,సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్,మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో..

ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలురు గోదావరిఖని లో ఘనంగా రాజ్యాంగ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఇంచార్జి ప్రిన్సిపాల్ కుక్కడపు శ్రీనివాస్ మాట్లాడుతూ భారత దేశ స్వాతంత్ర నంతరము దేశాన్ని అభివృద్ధి వైపు నడిపించే విదంగా, దేశంలోని అన్ని రంగాల అభివృద్దె దేశ అభివృద్ధి గా భావించి,డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భారత రాజ్యాంగాన్ని రచించారని కొనియాడారు.అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించి అందరిచే రాజ్యాంగ పిటిక ను ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జీడి కనకయ్య, శంకరయ్య,కోరే శ్రీనివాస్,శాంతా రామారావు,సతీష్,శ్రీ గోదా, శారదా,ఎస్తేరు రాణి,స్వప్న, జగదీశ్వరి, శైలజ, రామ్మూర్తి, రఫిక్ విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

దుబ్బాక మార్కెట్ కమిటీ చైర్మన్ గా కొంగరి రవి

ప్రతి పక్షం,దుబ్బాక, నవంబర్ 26: దుబ్బాక మార్కెట్ కమిటీని ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ప్రకటించింది. దుబ్బాక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా కొంగరి రవి, వైస్ చైర్మన్ గా బొంగురం బాల్ రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. దుబ్బాక మండలం బల్వంతపూర్ గ్రామానికి చెందిన కొంగరి రవి ప్రస్తుతం దుబ్బాక కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. సామాన్య కాంగ్రెస్ కార్యకర్తకు మార్కెట్ కమిటీ చైర్మన్ గా అవకాశం కల్పించినందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా కొంగరి రవి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలను గుర్తించి తనకు మార్కెట్ కమిటీ చైర్మన్ గా అవకాశాన్ని కల్పించినందుకు అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. బడుగు , బలహీన వర్గాలకు కాంగ్రెస్ పార్టీలోనే సముచిత స్థానం లభిస్తుందని ఆయన తెలిపారు. తనకు చైర్మన్ పదవి రావడానికి కృషిచేసిన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డికి ప్రత్యేక అభినందలు తెలిపారు. అలాగే మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గా బొంగురం బాల్ రెడ్డి (చీకోడ్) డైరెక్టర్లుగా కదురూరి నరేందర్ రెడ్డి (రఘోత్తం పల్లి), ఆకుల భరత్ (దుబ్బాక), మెట్ల సంజీవ్ (ఆకారం), అబ్దుల్ అజీజ్ (హబ్షీపూర్), రామారం మహేందర్ రెడ్డి (తిమ్మాపూర్), బందుగుల బాబు (పెద్ద గుండవెల్లి), చెర్లపల్లి బాల్ రెడ్డి (అప్పనపల్లి), పర్స నర్సింహులు (అచ్చుమాయ పల్లి) మూడ సతీష్ (చీకోడ్), చింత కాశీనాథ్ (దుబ్బాక), నగరం లక్ష్మీనర్సవ్వ (నగరం) లను డైరెక్టర్లుగా కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నియమించింది.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

- **కనీస వేతనం 26 వేల రూపాయలు అందించాలి**
- **సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ డిమాండ్**

ప్రతిపక్షం ప్రతినిధి, రాజన్నసిరిసిల్ల, నవంబర్- 26: మున్సిపల్ కార్మికులకు సంబంధించిన సమస్యలపై యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా బుధవారం సిరిసిల్ల మున్సిపల్ ఆఫీస్ ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం చేపట్టి సమస్యలపై మున్సిపల్ కమిషనర్ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ , జిల్లా ఉపాధ్యక్షులు మూషం రమేష్ మాట్లాడుతూ పట్టణాలను పరిశుభ్రంగా ఉంచడం కోసం తమ ఆరోగ్యాలను సైతం లెక్కచేయకుండా ప్రాణాలు పణంగా పెట్టి పట్టణ ప్రజలకు అనేక సేవలందిస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వం , అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేసి కనీస వేతనం 26 వేల రూపాయలు అందించాలని , మున్సిపల్ కార్మికులకు సంబంధించి రాష్ట్ర ఆర్థిక శాఖ ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా ఇంటిగ్రేటెడ్ ఫైనాన్షియల్ మేనేజ్మెంట్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఆన్లైన్ పోర్టల్ లో మున్సిపల్ లో పనిచేస్తున్న ఉద్యోగ , కార్మికులందరి పేర్లను నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు ఎలిగేటి రాజశేఖర్ , నక్క దేవదాస్ , సందుపట్ల పోచమల్లు , మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కాసారపు శంకర్ , టౌన్ అధ్యక్షులు ఏర్పుల బాలయ్య , బాబా కిషన్ , గడ్డం విజయ , ఉమ , మమత , మల్లేశం , నరేష్ మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తితో ప్రజాసేవ చేయాలి

- **కలెక్టర్ అభిలాష అభినవ్**

ప్రతిపక్షం ప్రతినిధి, నిర్మల్ , నవంబర్ 26 : భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొని అధికారులకు రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

సురభి మెడికల్ కళాశాలలో ర్యాగింగ్ కలకలం

- **మొదటి సంవత్సరం విద్యార్థిపై సీనీయర్ల మానసిక హింస**
- **తల్లిదండ్రుల తీవ్ర ఆరోపణలు**
- **సమగ్ర విచారణ చేయలేదని కళాశాలపై ఆగ్రహం**
- **పోలీసుల దర్యాప్తు ప్రారంభం**

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, నవంబర్ 26 : సిద్దిపేట జిల్లా మిట్టపల్లి గ్రామంలో ఉన్న సురభి మెడికల్ కళాశాలలో బుధవారం చోటుచేసుకున్న ర్యాగింగ్ ఘటన కలకలం రేపింది. మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని నలుగురు సీనియర్లు తీవ్ర మానసిక వేధింపులకు గురిచేశారని బాధిత విద్యార్థి సాయి కృష్ణ, అతని తల్లి ఆవేదన వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళ్తే భక్తి పరంగా మొక్కు నెరవేర్చుకోవడానికి పెంచుకున్న గడ్డాన్ని బలవంతంగా కత్తిరించారని, తనను అవమానకరంగా తిట్టి మానసికంగా కుంగదీసే రీతిలో హింసించారని విద్యార్థి కన్నీటి పర్యంతమయ్యాడు. ఈ విషయంపై ఫిర్యాదు చేయడానికి కళాశాలకు వచ్చినప్పటికీ ఉదయం నుంచి సాయంత్రం వరకు వారిని బయటే నిలబెట్టారని, లోపల జరిగే సమావేశం వివరాలు వెల్లడించలేదని తల్లి వేదన వ్యక్తం చేసింది. యాంటీ ర్యాగింగ్ కమిటీ సభ్యులను ప్రశ్నించగా వారు కూడా బెదిరింపు ధోరణిలో మాట్లాడారని, సీనియర్ల నుంచి తన కుమారుడికి మరింత ప్రమాదం ఉంటుందేమోనని తల్లి తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఘటన గురించి సమాచారం అందుకున్న వెంటనే సిద్దిపేట త్రీ టౌన్ పోలీసులు కళాశాలకు చేరుకుని విద్యార్థులు, యాజమాన్యం, యాంటీ ర్యాగింగ్ కమిటీ సభ్యుల నుండి వివరాలు సేకరించడం ప్రారంభించారు. బాధిత విద్యార్థి ఆరోపణలను తీవ్రంగా పరిగణించి ప్రాథమిక విచారణ కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా

నోడల్ అధికారులు విధులు నిర్వహించాలి

- **ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**

ప్రతిపక్షం ప్రతినిధి, రాజన్న సిరిసిల్ల, నవంబర్- 26: గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నోడల్ అధికారులు తమ విధుల పట్ల పూర్తి అవగాహన కలిగి, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. నోడల్ అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం ఎస్పీ మహేష్ బి గీతే, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి సమావేశమై, వారి విధుల సన్నద్ధతపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ, నోడల్ అధికారుల విధులు, బాధ్యతలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాబోయే ఎన్నికలకు నోడల్ అధికారుల నియామకం చేపట్టినట్లు తెలిపారు. మానవ వనరుల నిర్వహణ, శిక్షణ, రవాణా, మోడల్ కోడ్ కండక్ట్, ఖర్చు పర్యవేక్షణ, పోస్టల్ బ్యాలెట్, ఎలక్టోరల్ రోల్స్, ఎన్నికల పరిశీలకులు విషయమై నోడల్ అధికారుల నియామకం చేసినట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సరిపోను సిబ్బందిని సమకూర్చుకోవాలన్నారు. వివిధ రకాలుగా జిల్లా యంత్రాంగానికి వచ్చే ఎన్నికల ఫిర్యాదులను వేగంగా, క్వాలిటీ పరిష్కారం చూపేలా సన్నద్ధం కావాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఖచ్చితంగా అమలయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, డీఆర్డీఓ శేషాద్రి, జడ్పీ సీఈవో వినోద్ కుమార్, డీపీఓ షర్ఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించాలి

- **ఇటుక బట్టీల యజమానులకు ఎంఈవో పావని సూచన**

ప్రతిపక్షం, హుస్నాబాద్ (చిగురుమామిడి) నవంబర్ 26 : మండలంలో ఆరు నుంచి 14 సంవత్సరాల వయసున్న ప్రతి చిన్నారిని తప్పనిసరిగా పాఠశాలలో చేర్పించాలని మండల విద్యాధికారి పావని సూచించారు. 'బడి బయట పిల్లల సర్వే'లో భాగంగా మండలంలోని ముల్కనూర్ గ్రామ పరిధిలో ఉన్న శ్రీసాయి క్లే బ్రిక్స్, మణికంఠ ఫ్లైయాష్ బ్రిక్స్, శాతవాహన ఫీడ్ ప్లాంట్లను కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మహమ్మద్ ఇర్షాద్‌తో కలిసి ఆమె సందర్శించారు.ఈ సందర్భంగా అక్కడి ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న ఒడిశా, బిహార్ రాష్ట్రాలకు చెందిన వలస కూలీలు, బట్టీల యజమానులతో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిరుపతయ్య, శ్రీనివాస్, రాజురెడ్డి, ఐఈఆర్‌పీ తిరుపతి, సీఆర్‌పీలు ఆంజనేయులు, శ్రీనివాస్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

బాల సాహిత్యంలో రామంచ విద్యార్థుల ప్రతిభ

- **దేశభక్తి గేయాలాపనలో ప్రథమ బహుమతి**

ప్రతిపక్షం, చిన్నకోడూరు, నవంబర్ 26: హైదరాబాదులో తెలంగాణ సారస్వత పరిషత్తు బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని "బాలల సాంస్కృతికోత్సవం పేరిట హైదరాబాద్‌లో నిర్వహించిన బాల సాహిత్యం పోటీలలో సిద్ధిపేట జిల్లా చిన్నకోడూరు మండలంలోని రామంచ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. దేశభక్తి గేయాల ఆలాపనలో ఆరవ తరగతి విద్యార్థిని హాన్విక ప్రథమ స్థానంలో నిలిచింది. దీంతో హాన్విక రు.2000 నగదు గెలుచుకుంది. పద్య రచనలో 10వ తరగతి విద్యార్థి సంజన తృతీయ స్థానంలో నిలిచింది. రూ.1000ల బహుమతి అందుకుంది. పుస్తక సమీక్షలో మాధురి, కథలో నవీన, పద్య రచనలో బ్లెస్సీ ప్రోత్సాహక బహుమతి పొందారు. ఒక్కొక్కరు రూ.500ల నగదుతో పాటు ప్రశంసా పత్రాలు, మెమొంటోలు అందుకున్నారు. ఈ పోటీలలో రామంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి 27 మంది విద్యార్థులు పాల్గొన్నారు. నగదు ప్రోత్సాహకంతో పాటు ప్రశంసా పత్రాలను, మెమొంటోలను తెలంగాణ సారస్వత పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, డాక్టర్ కె.వి రమణాచారి,(విశ్రాంత కలెక్టర్), కార్యదర్శి డా.చెన్నయ్య, పత్తిపాక మోహన్, గరిపెల్లి అశోక్‌ల చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా రామంచ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సత్తవ్వ, ఉపాధ్యాయులు రామిని భాస్కర్ , మల్లయ్య, నరేందర్, గంగా భవాని, శ్రీనివాస్, సాయిరాం, జమున తదితరులు విద్యార్థులతో పాటు వారిని ప్రోత్సహించిన ఉపాధ్యాయురాలు జె.నిర్మలను విద్యార్థులను అభినందించారు.

రాజ్యాంగ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ గౌరవించాలి

- **జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**
- **మెదక్ లో ఘనంగా 76 వ రాజ్యాంగ దినోత్సవం**

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 26 : మెదక్ జిల్లాలో 76వ రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మెదక్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ దినోత్సవం ప్రాధాన్యతను వివరించి అధికారులు, సిబ్బంది భారత రాజ్యాంగం పీఠికను ప్రతిజ్ఞ చేయించారు. రాజ్యాంగంలో పొందుపరిచిన సార్వభౌమ, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్య భావాలకు అనుగుణంగా నడుచుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్అంబేద్కర్ సేవలను స్మరించుకుంటూ రాజ్యాంగ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ గౌరవించాలని, ప్రజాసేవలో నిబద్ధతతో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, కలెక్టరేట్ ఏ.వో యూనస్ , కలెక్టరేట్ పర్యవేక్షకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా ఎస్పీ కార్యాలయంలో...

భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మెదక్ ఎస్పీ కార్యాలయంలో మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రాజ్యాంగ పీఠికను ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రపంచంలో అత్యంత బలమైన ప్రజాస్వామ్య రాజ్యాంగాలలో ఒకటిగా నిలిచిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్, డీఎస్పీలు సుభాష్ చంద్ర బోస్, రంగా నాయక్, సీఐలు కృష్ణమూర్తి, సందీప్ రెడ్డి, శైలేందర్, రామకృష్ణ, ఏఓ మణి, ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

అంబేద్కర్ కాంస్య విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో

జిల్లా కేంద్రంలో అంబేద్కర్ కాంస్య విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో ఎన్జీవో భవన్లో నిర్వహించారు. కమిటీ చైర్మన్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు దొంతి నరేందర్, కాంస్య విగ్రహ కమిటీ అధ్యక్షుడు మందుగుల గంగాధర్, కార్యదర్శి జెల్ల సుధాకర్ ఈ సందర్భంగా అంబేద్కర్ రాజ్యాంగ విశిష్టతను వివరించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంస్య విగ్రహ కమిటీ నాయకులు నాగరాజు, షేక్ అహ్మద్, మనోహర్, తెలంగాణ ఎన్జీవోల నాయకులు ఇక్బాల్ పాషా, లీలా, సలీం, సత్యనారాయణ, శ్రీహర్ష, సంతోష్, హరికృష్ణ, శివకృష్ణ, రిజ్వాన్ అలీ, మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో "సంవిధాన్ దివస్ "

మెదక్ జిల్లా కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా "సంవిధాన్ దివస్ " ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు. పార్టీ కార్యాలయంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి ఈర్ల రంజిత్ రెడ్డి, జిల్లా బిజెపి కార్యదర్శి కల్కి నాగరాజ్ జిల్లా ఓబీసీమోర్చా అధ్యక్షుడు గడ్డం కాశీనాథ్ మెదక్ పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్, మెదక్ రూరల్ అధ్యక్షులు బెండవీన ,మెదక్ జిల్లా సీనియర్ నాయకుడు లోకేష్ ,మెదక్ పట్టణ ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, ఆఫీస్ సెక్రటరీ సాయి కిరణ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పటిష్ట రాజ్యాంగం తోనే ప్రజాస్వామ్యం మనుగడ

- **బీఆర్ఎస్ -మండల అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి**

ప్రతిపక్షం, తొగుట, నవంబర్ 26: భారత్ వంటి ప్రజాస్వామ్య దేశాలకు రాజ్యాంగమే బలమని, ప్రతి వ్యక్తికి సమాన హక్కులు కల్పిస్తూ జాతీయ ఐక్యత సమగ్రతకు పెద్దపీట వేస్తుందని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి పేర్కొన్నారు. భారత రాజ్యాంగ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని వెంకట్రావుపేటలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. దేశ అభివృద్ధిలో రాజ్యాంగ నిర్మాతల సహకారం మరువలేమన్నారు. రాజ్యాంగంలోని నిబంధనలు ప్రజాస్వామ్యానికి రక్షగా నిలుస్తున్నాయన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ సేవలు మరువలేనివి, ఆ మహనీయుల ఆశయాల సాధనలో ప్రతి ఒక్కరు ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండారు స్వామి గౌడ్, ఈదుగళ్ల పర్శరాములు, క్యాస శివకోటి, కల్లెపు యాదగిరి, పాత్కుల బాలేష్, డా. కుమార్, పులిగారి గణేష్, అజామ్, జహంగీర్, బెజ్జనమైన కృష్ణ, లింగం, పోచయ్య, ఆడెపు శ్రీనివాస్, వడ్డె శేఖర్, వడ్డె యాదగిరి, ఈదుగళ్ల స్వామి, నరేష్, సాయిలు, మధు, ఎర్రోళ్ల ఎల్లం, బాలు బెజ్జనమైన గణేష్, యాదగిరి, చింటు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలు ఎంపిక చేసుకున్న డిజైన్లలోనే చీరలను ఇస్తున్నాం. అయినా కలర్ బాలేదని బీఆర్ఎస్ నేతలు విమర్శిస్తున్నారు. సహజంగానే ఆడవాళ్లు ఎదుగుతుంటే ఓర్వలేనితనం హరీష్ రావు, కేటీఆర్లది. ఆడబిడ్డలు చీరలు తీసుకొని సంబరపడుతుంటే అవి వారి కళ్లకు కనిపించడం లేదు. బీఆర్ఎస్ నేతలు ఇకనైనా బుద్ధి మార్చుకోవాలన్నారు.

-రాష్ట్ర మంత్రి సీతక్క

ప్రాంతీయం

కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లను రద్దు చేయాలి

- ఐక్యవేదిక ఆధ్వర్యంలో జీఎం ఆఫీస్ ఎదుట ధర్నా

ప్రతిపక్షం ప్రతినిధి, గోదావరిఖని, నవంబర్ 26 : కార్మికులను కట్టుబానిసలుగా మార్చుకునే విధంగా ఈ దేశంలో ఉన్నటువంటి బడా కార్పొరేట్ వ్యవస్థల కు పూర్తి అనుమతులు ఇచ్చే విధంగా ఉన్న నాలుగు కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆర్ జీ వన్ జీఎం ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహించి ఎస్ఓటు జీఎంకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎంఎస్ రాష్ట్రప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్, ఐఎఫ్టీయూ రాష్ట్ర అధ్యక్షులు ఐ కృష్ణ, ఎస్జిఎల్ బికేఎస్, ఏఐఎఫ్టీయూ రాష్ట్ర అధ్యక్షులు జీ రాములు, టీఎస్టీయూసీ రాష్ట్ర నాయకులు దామోదర్ రెడ్డి, ఐఎఫ్టీయూ రాష్ట్ర అధ్యక్షులు కే. విశ్వనాథ్ మాట్లాడుతూ బడా కార్పొరేట్ కంపెనీల కు మేలు చేసే విధంగా ఈ లేబర్ కోడ్ లు ఉన్నాయని, మతోన్మాద బీజేపీ ప్రభుత్వం, దేశ కార్మిక వర్గంపై కనీసం సవితి తల్లి ప్రేమను కూడా చూపటం లేదని, అనేక సంవత్సరాల పోరాట ఫలితంగా సాధించుకున్న హక్కులను కాలరాస్తున్నారని అన్నారు. ఇకనైనా కార్మిక ప్రయోజనాల కోసం పాలకులు ఆలోచించాలని, నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, లేని పక్షంలో కార్మిక వర్గాన్ని సమీకరించి మిలిటెంట్ పోరాటాలకు కూడా సిద్ధం అవుతామని కేంద్ర ప్రభుత్వాన్ని వారు హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు సారయ్య,దావూ రమేష్,ఈ నరేష్,రత్న కుమార్, కొండి శ్రీనివాస్,గుండేటి మల్లేశం, ఎం.కొమరయ్య,ఎస్ ప్రసాద్, రామచందర్,రాయపోచం, సంతోష్,మల్లేష్,నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి జయంతి వేడుకలు

ప్రతిపక్షం, హుస్నాబాద్ (చిగురుమామిడి) నవంబర్ 26: కరీంనగర్ జిల్లా చిగురుమామిడి గ్రామ శివారులోని శ్రీస్వయంభు పాంబండ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో బుధవారం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి జయంతి వేడుకలను, హోమం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో పాల్గొనేందుకు వేలాది మంది భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. శ్రీపంచముఖ ఆంజనేయ స్వామి వారికి, శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి గురూజీ ఉమేష్ స్వామి చేతుల మీదుగా అత్యంత వైభవపేతంగా పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ నూతనంగా నిర్మిస్తున్న శ్రీపంచముఖ ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధిలో భక్తులు భాగస్వామ్యం కావాలని, భక్తులు తమకు తోచిన విధంగా సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ పూజ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొత్త వినిత శ్రీనివాస్ రెడ్డి, లంబాడిపల్లె మాజీసర్పంచ్ నాగెల్లి వకుల లక్ష్మారెడ్డి, భక్తులు మోహన్ రెడ్డి, తెరాల సత్యనారాయణ, గూడెం లక్ష్మి, తెరాల అమర్, బొల్లబత్తిని సంతోష్, కాశవేని రాజుయాదవ్, సీనియర్ జర్నలిస్ట్ గాదే రఘునాథరెడ్డి, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఎమ్మెల్యే భూపతి రెడ్డిపై కేసు నమోదు చేయాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, నవంబర్ 26: నిజామాబాద్ రూరల్ మండలం పాల్దా గ్రామంలో మంగళవారం డబుల్ బెడ్ రూమ్ పంపిణీ కార్యక్రమంలో బిజెపి నాయకులపై ఎమ్మెల్యే భూపతి రెడ్డి సమక్షంలో చేయి చేసుకున్న కాంగ్రెస్ కార్యకర్తలతో పాటు ఎమ్మెల్యే భూపతిరెడ్డి పై కేసు నమోదు చేయాలని బీజేపీ జిల్లా బృందం అదనపు డీసీపీ బస్వారెడ్డి కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి మాట్లాడుతూ ఎమ్మెల్యే భూపతి రెడ్డి జిల్లా రాజకీయాలను నేరస్థుల మాదిరిగా నడుపుతున్నారు. కబ్జాలు, మొరం, ఇసుక దందాలు, లంచగొండి వ్యవహారాలు మాత్రమే కాదు, ఇప్పుడు బహిరంగంగా గుండాయిజం, రౌడీయిజం కూడా పెంచుతున్నారని ఆరోపించారు. నిన్న పాల్దా గ్రామం లో ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ కార్యక్రమంలో భూపతి రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తూ "సన్నబియ్యం, ఉచిత కరెంట్ ఇస్తున్నాం" అని చెప్పినప్పుడు అక్కడే ఉన్న యువకులు సన్నబియ్యం కేంద్ర ప్రభుత్వం ఇస్తోంది, కరెంట్ బిల్లు మేమే కడుతున్నామని నిజం చెప్పగానే ఎమ్మెల్యే భూపతి రెడ్డి మండిపడి, ఇక్కడ బీజేపీ నాయకులు ఉన్నారు వారిని తరిమేయండి" అంటూ బహిరంగంగా రెచ్చగొట్టారని తెలిపారు. ఎమ్మెల్యే మాటతో కాంగ్రెస్ గుండాలు అక్కడే యువకులపై దాడి చేశారాని చెప్పారు. యువకులపై దాడికి పాల్పడిన కాంగ్రెస్ రౌడీలపై వెంటనే కేసు నమోదు చేయాలని, వారిని రెచ్చగొట్టి దాడులు చేయించిన ఎమ్మెల్యే భూపతి రెడ్డి పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో రూరల్ కన్వీనర్ పద్మారెడ్డి, జగన్ రెడ్డి,కార్పొరేటర్ ప్రమోద్, శంకర్, జిల్లా అధికార ప్రతినిధి శంకర్ రెడ్డి, ఆనంద్, ఆమందు విజయ్ కృష్ణ, జిల్లెల శ్రీనివాస్ బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సైకిల్ యాత్రికులను కలిసిన ఉపాధ్యాయులు

ప్రతిపక్షం ప్రతినిధి, నిర్మల్, నవంబర్ 26 : లోక కళ్యాణార్థము ప్రపంచ శాంతి కొరకు కాలుష్యరహిత సమాజం కొరకు కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు సైకిల్ యాత్ర చేస్తున్న మహారాష్ట్ర వాసులను జిల్లా ఉపాధ్యాయులు తోడిశెట్టి రవికాంత్ ,తోడిశెట్టి చంద్రయ్య ,పోతుగంటి సాయన్న, మారుపాక శ్రీనివాస్ మరియు సేర్పూర్ సత్యనారాయణ లు గంజాల్ టోల్ ప్లాజా వద్ద స్వాగతం పలికారు. మహారాష్ట్ర లోని పూణేకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు దత్త ,విశ్రాంత బ్యాంకు మేనేజర్ అవినాష్ చౌహాన్ లు నవంబర్ 12వ తేదీ సైకిల్ యాత్రను ప్రారంభించారు. ఈ యాత్ర 25 రోజులపాటు కొనసాగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరు కాలుష్యరహిత భారత్ కొరకు కృషిచేయాలని వారు కోరారు.

పంచాయతీ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

- నోడల్ అధికారులు, ఆర్వో, ఏఆర్వోలుకు కలెక్టర్ ఆదేశాలు

ప్రతిపక్షం ప్రతినిధి, నిర్మల్, నవంబర్ 26 : గ్రామ పంచాయతీ ఎన్నికలను పూర్తిస్థాయిలో పారదర్శకంగా, నిబంధనల ప్రకారం నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ, నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ తదితర అంశాలపై ఎన్నికల నోడల్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీ డివో లు, ఆర్వోలు, ఏఆర్వోలు, ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ బృందాలకు నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియలో ఎక్కడా లోపాలకు తావు లేకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. నామినేషన్ ప్రక్రియను సజావుగా నిర్వహించడంతో పాటు అభ్యర్థుల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ సమన్వయంతో చర్యలు చేపట్టాలని తెలిపారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ను కఠినంగా అమలు చేయాలని, ఎటువంటి అక్రమ కార్యకలాపాలు చోటుచేసుకోకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ బృందాలు నిరంతర పర్యవేక్షణ చేపట్టి ఎన్నికల సమయంలో నగదు, మద్యం, వంటి అవాంఛనీయ చర్యలపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి తగిన భద్రత ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఎన్నికల అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది, ఆర్వోలు, ఏఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దివస్

ప్రతిపక్షం ప్రతినిధి, నిర్మల్, నవంబర్ 26 : నిర్మల్ పట్టణంలోని ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఈ రోజు అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తుల రంజిత్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దివస్ వేడుకల్ని ఘనంగా జరపడం జరిగింది అనంతరం మాట్లాడుతూ రాజ్యాంగం ఇచ్చిన ఓటు హక్కు నీ రాబోవు పంచాయతీ ఎన్నికల్లో బీరు బిర్యానీకి అమ్ముకోకుండా ఉండాలని అన్నారు .అంతకు ముందు అందరూ రాజ్యాంగ పీఠిక నీ చదివి ప్రతిజ్ఞ చేయడం జరిగింది జిల్లా ఉపాధ్యక్షులు ఈ, పురుషోత్తం, ఆకుల రమేష్, ఏ, రాజేశ్వర్, డి, లక్మన్,TUTF ప్రధాన కార్యదర్శి బొమ్మన సురేష్, నూతన ప్రసాద్, అడ్డగ బోసు, మధస్తు భూమేష్, సతీష్, అశోక్, వినోద్, శ్రీధర్ తదితర నాయకులు పాల్గొన్నారు

లిఫ్ట్ ఇచ్చి దోచుకున్న వ్యక్తి అరెస్ట్

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, నవంబర్ 26 : బైక్ పై లిఫ్ట్ ఇస్తానని మాయమాటలు చెప్పి అమాయకురాలును దోచుకున్న దొంగను నవీపేట్ పోలీసులు పట్టుకుని అరెస్ట్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. నవీపేట్ మండలం నందిగాం కు చెందిన సార్గం గంగమణి తన భర్త సుభాష్ కుటుంబ సభ్యులతో బుధవారం బోధన్ లో తన కూతురు వద్దకు వెళ్లి, తిరిగి సాయంత్రం నందిగాం కు బయలుదేరింది. భర్త, కొడుకు కోడలు ఒక బైక్ పై వెళ్లగా, గంగమణి బస్సులో బోధన్ నుంచి జానకంపేట వరకు వచ్చి, అక్కడయంచ వెళ్లేందుకు బస్ కొరకు వేచి ఉండగా, ఓ గుర్తు తెలియని వ్యక్తి బైక్ పై వచ్చి లిఫ్ట్ ఇస్తానని మాయమాటలు చెప్పి బైక్ పై ఎక్కించుకొని నందిగాం గ్రామ శివారుకు తీసుకు వెళ్ళాడు. అక్కడ ఆమెను బెదిరించి 2 తులాల పుస్తేలతాడు, ఫోన్ గుంజుకొని ఆమెను వడ్ల కుప్ప పై నెట్టేసి పారిపోయాడు. అనంతరం బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి, రెండు బృందాలుగా ఏర్పడి నిందితుని కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా సీసీ కెమెరాలు, కాల్ డేటా లను పరిశీలించగా నిందితుడు బోధన్ మండలం ఉత్పల్లి గ్రామానికి చెందిన పట్లోత్ శ్రీకాంత్ అని తేలింది. పోలీసులు అతడిని పట్టుకుని అరెస్టు చేసి, అతని వద్ద నుంచి పుస్తేల తాడు స్వాధీన పరుచుకొని కోర్టు లో హాజరు పరుచగా, కోర్టు శ్రీకాంత్ ను రిమాండ్ కి తరలించింది. ఈ కేసును చేధించడంలో కీలక పాత్ర పోషించిన ఎస్సైలు తిరుపతి, యాదగిరి గౌడ్, ఏఎస్ఐ గఫ్ఫార్, సిబ్బంది రాజేశ్వర్, దత్తు, రాకేష్, రాజిరెడ్డి లను నిజామాబాద్ నార్త్ రూరల్ సి ఐ శ్రీనివాస్ లను ఏ సీ పీ రాజా వెంకట్ రెడ్డి అభినందించారు.

స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమలు

ప్రతిపక్షం, సోన్, నవంబర్ 26: రాష్ట్రం లో స్థానిక సంస్థల ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున బుధవారం సోన్ మండల కేంద్రంలో వివిధ రాజకీయ పార్టీల బ్యానర్ లు, వాల్ పోస్టర్లు, స్టిక్కర్లను తొలగిస్తున్నట్లు గ్రామ పంచాయతీ సెక్రటరీ టి.లక్ష్మణ్ తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని అందరు పాటించాలని అన్నారు. నిబంధనల ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామని అన్నారు. ఇందులో గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



నిబంధనలు పాటించని వడ్డీ వ్యాపారులకు జరిమానా

- కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి వెల్లడి

ప్రతిపక్షం, నిజామాబాద్, నవంబర్ 26 : నిబంధనలు పాటించని వడ్డీ వ్యాపారులకు జరిమానాలు విధించడం జరిగిందని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. మనీ లెండర్స్ యాక్టు కేసులను అనుసరిస్తూ నిజామాబాద్ నగరానికి చెందిన ఐదుగురు వడ్డీ వ్యాపారులకు రూ. 25 వేల నుండి రూ. 50 వేల వరకు జరిమానాలు విధించామని వివరించారు. మొదటి తప్పుగా గుర్తించి సాధారణ జరిమానాలు మాత్రమే విధించడం జరిగిందని అన్నారు. వడ్డీ వ్యాపారాలు చేసే వారందరూ తప్పనిసరిగా తగిన అనుమతులు (లైసెన్స్) కలిగి ఉండాలన్నారు. నియమ, నిబంధనలు తు.చ తప్పక పాటించాలని, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా వడ్డీ వ్యాపారాలు నిర్వహించే వారిపై, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞ

భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో ప్రతిజ్ఞ చేశారు. జిల్లా పాలనాధికారి టి.వినయ్ కృష్ణారెడ్డి సమక్షంలో కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ప్రతిజ్ఞ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

- ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించుకుందాం
- నల్సార్ యూనివర్సిటీ ప్రొఫెసర్ వాగిషన్



ప్రతిపక్షం, హుస్నాబాద్, నవంబర్ 26: భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందామని, ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించుకుందామని నల్సార్ యూనివర్సిటీ ప్రొఫెసర్ వాగిషన్ అన్నారు. హుస్నాబాద్ పట్టణం లోని రాజ రాజేశ్వర ఫంక్షన్ హాల్లో "భారత రాజ్యాంగ దినోత్సవం "సందర్భంగా హుస్నాబాద్ నియోజకవర్గం జేఏసీ ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ సదస్సు కు జేఏసీ కోఆర్డినేటర్ మేకల వీరన్న యాదవ్ అధ్యక్షులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్ సదస్సులో పాల్గొన్న విద్యార్థులను ఉద్దేశించి భారత రాజ్యాంగ్యాన్ని ప్రతి ఒక్కరూ అధ్యయనం చేయాలని, ఆచరణలో ఉండాలని అంటూ ఫోన్లో విద్యార్థులకు సందేశం ఇచ్చారు. భారత రాజ్యాంగం విశిష్టత హక్కులు బాధ్యతలు సవాళ్లు అనే అంశంపై నల్సార్ లా యూనివర్సిటీ ప్రొఫెసర్ డా. హెచ్ వాగిషన్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రపంచంలో ని అన్ని దేశాల్లో కంటే ఉత్తమమైన, గొప్ప రాజ్యాంగం అని, ఈ రాజ్యాంగాన్ని కొంత మంది మతవాదులు, రాజ్యాంగ వ్యతిరేకులు కొన్ని పార్టీలు పని కట్టుకొని రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని నిర్మూలించేందుకు కుట్ర చేస్తున్నారని వాళ్ల పట్ల జాగ్రత్త వహించాలని అన్నారు. ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి సిద్దిపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి మాట్లాడుతూ రాజ్యాంగాన్ని తీసివేసే ప్రయత్నాలు చేస్తున్నారని, కేంద్ర పాలకులు ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కి అపహాస్యం చేస్తున్నారని, వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ కవ్వ లక్ష్మా రెడ్డి, హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, హుస్నాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు మాజీ చిత్తారి రవీందర్, బీఎస్పీ నాయకులు ఎనగందుల శంకర్, జేఏసీ కోఆర్డినేటర్ ద్యాగల సారయ్య, తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర కార్యదర్శి చెప్యాల ప్రకాశ్, నాయకులు ఇల్లందుల లక్ష్మణ్ గౌడ్, ఓయూ జేఏసీ వైస్ చైర్మన్ గంపల శ్రీనివాస్, జేఏసీ నాయకులు వేముల జగదీశ్,నాంపల్లి సమ్మయ్య, కోడూరి శ్రీదేవి, గాండ్ల పద్మ ,పెట్టెం కుమారస్వామి,బీసీ ఐక్య వేదిక రాష్ట్ర నాయకులు మార్క అనిల్ గౌడ్, ఎదులాపురం తిరుపతి ,ముక్కెర సంపత్, రచయిత వడ్డేపల్లి మల్లేశం, రాజగోపాల్ రావు, విద్యార్థిని విద్యార్థులు ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



రాజధాని అమరావతి కోసం భూములు ఇచ్చిన రైతుల సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి. గత పాలనలో ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులకు న్యాయం జరగాలి. సాంకేతిక ఇబ్బందులు ఉంటే తక్షణం పరిష్కరించాలి. రాజధానిలో నిర్మాణాలు వేగంగా పూర్తి చేసేందుకు కార్యాచరణ చేయాలి. నిర్మాణాల నాణ్యత, వేగం విషయంలో ఎక్కడా రాజీ పడొద్దు.

- సీఆర్డీఏ సమీక్షలో ఏపీ సీఎం చంద్రబాబు

రాజ్యాంగం మనకు కర్తవ్య బోధ చేస్తోంది

- రాజ్యాంగ దినోత్సవ సభలో రాష్ట్రపతి ముర్ము

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 26 : రాజ్యాంగం మనకు గొప్ప కర్తవ్య బోధ చేస్తోందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. మన ప్రజాస్వామ్యం వ్యవస్థకు మూలం రాజ్యాంగం అని కూడా ప్రశంసించారు. సంవిధాన్ సదన్‌లోని సెంట్రల్ హాల్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ మర్ము నేతృత్వంలో బుధవారం రాజ్యాంగ దినోత్సవ సభ జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల స్వాభిమానాన్ని కాపాడే ఎన్నో హక్కులను రాజ్యాంగం ఇచ్చిందని రాష్ట్రపతి పేర్కొన్నారు. రాజ్యాంగంలో సామాజిక న్యాయానికి పెద్దపీట వేశామని, సామాజిక న్యాయం సాధనలో భాగమే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అని తెలియజేశారు. భారతదేశం త్వరలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగనుందని, ఆర్థిక ఏకీకరణలో భాగంగా జీఎటీ తీసుకొచ్చామని చెప్పారు. దేశాన్ని ముందుకు తీసుకెళ్లడంలో రాజ్యాంగామే మార్గదర్శి అని అన్నారు. శాసనాలలో ఎన్ని మార్పులు చేసినా రాజ్యాంగానికి లోబడి ఉన్నామని, ఇటీవలే బిర్సాముండా 150వ జయంతిని జరుపుకున్నామని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధాని మోడీ, లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, ఎఐసీసీ ప్రెసిడెంట్ మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తదితరులు పాల్గొన్నారు.

విశ్వ వీక్షణం

41 మంది మావోయిస్టుల లొంగుబాటు

- 32 మంది తలలపై రూ.1.19 కోట్ల రివార్డు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, బీజాపూర్, నవంబర్ 26 : కేంద్ర బలగాలు చేపడుతున్న ఆపరేషన్ నేపథ్యంలో భారీగా మావోయిస్టులు లొంగిపోతున్నారు. ఇప్పటికే పలువురు టాప్ కమాండోలతోపాటు పెద్ద ఎత్తున మావోయిస్టులు పోలీసుల ముందు లొంగిపోయారు. తాజాగా మావోయిస్టు పార్టీకి మరో ఎదురు దెబ్బ తగిలింది. బుధవారం ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ జిల్లాలో 12 మంది మహిళలు సహా మొత్తం 41 మంది ఆయుధాలతో సహా సీనియర్ పోలీసు అధికారుల ముందు లొంగిపోయారు. వీరిలో 32 మంది తలలపై రూ.1.19 కోట్ల రివార్డు ఉన్నట్లు అధికారులు తెలిపారు. లొంగిపోయిన 41 మంది మావోయిస్టులలో 39 మంది దక్షిణ సబ్‌జోనల్ బ్యూరో ఆఫ్ మావోయిస్టులకు చెందినవారుగా పోలీసులు వెల్లడించారు. వారందరూ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ, తెలంగాణ రాష్ట్ర కమిటీ, నిషేధిత సంస్థ ధమ్తారి గరియాబంద్‌ను వాపాడ విభాగాలతో సంబంధం కలిగి ఉన్నారని తెలిపారు. కాగా, ఇటీవల పోలీసుల ఎన్ కౌంటర్ లో మావోయిస్టు అగ్ర కమాండర్ హిడ్మా చనిపోయిన సంగతి తెలిసిందే.





మెడచుట్టూ నల్లగా మారిపోతోందా?

మధుమేహ వ్యాధి రావడానికి సంకేతం కావచ్చు!!

చాలా భారతీయ కుటుంబాలలో, మెడ చుట్టూ నల్లటి చర్మం ఉండటం చూస్తూనే ఉంటాం. అయితే, ఇది పరిశుభ్రత లేక ధూళి పేరుకుపోవడంతో వచ్చిందనేది మనందరి అభిప్రాయం. కానీ, శరీర అనారోగ్యాల వల్ల కూడా వచ్చే అవకాశం ఉంది. మధుమేహం రోగులలో, మెడ చర్మం తరచుగా నల్లగా మారడం జరుగవచ్చు. ఇలా చర్మం నల్లగా, ఉబ్బుగా, దళసరిగా ఓ పొరలాగా కనిపించే కండిషన్ ను వైద్యపరిభాషలో 'ఎకాంథోసిస్ నైగ్రికాన్స్' అంటారు. సాధారణంగా ఇలా రావడానికి అనేక కారణాలు ఉన్నప్పటికీ దీన్ని ప్రీ డయాబెటిస్ కి సూచనగా భావించి ముందుగానే తగిన జాగ్రత్తలు తీసుకుంటూ, కొన్ని సూచనలు పాటిస్తే, చాలాకాలం మధుమేహం దరి చేరకుండా చూసుకోవచ్చు. అధిక బరువు, ఊబకాయం, కొన్ని రకాల మందులు ఉదాహరణకు కొన్ని బర్త్ కంట్రోల్ పిల్స్, స్టెరాయిడ్లు వంటివి. హార్మోన్ల సమస్యలు అంటే హైపోథైరాయిడిజం, పీసీఓడీ సమస్య, మధుమేహ వ్యాధి, సంబంధిత అనారోగ్య సమస్యల కారణంగా అకాంథోసిస్ నైగ్రికన్స్ వస్తుంది. అకాంథోసిస్ నైగ్రికన్స్ ఆనేది ఒక సాధారణ చర్మ సంబంధిత సమస్య.

లక్షణాలు ఎలా ఉంటాయంటే?

చర్మం రంగు మారడం: చర్మం ముదురు గోధుమ లేదా నలుపు రంగులోకి మారుతుంది. ప్రభావిత ప్రాంతంలో చర్మం మందంగా, దళసరిగా మారుతుంది. ఈ చర్మం వెల్వెట్ (ముదురు) రంగు లాగా మృదువుగా, మెత్తగా అనిపిస్తుంది. సాధారణంగా ఈ లక్షణాలు శరీరంలో ముడతలు లేదా మడతలు ఉన్న ప్రాంతాలలో ఎక్కువగా కనిపిస్తాయి.

(మెడ వెనుక భాగం , సంకలు , గజ్జలు , మోచేతులు లేదా మోకాళ్ల వంటి ఇతర మడతల దగ్గర కూడా కనిపించవచ్చు).

ప్రధాన కారణం ఏమిటి?

అకాంథోసిస్ నైగ్రికన్స్ సాధారణంగా ఒక అంతర్లీన ఆరోగ్య సమస్యకు సంకేతం. దీనికి ప్రధాన కారణం ఇన్సులిన్ నిరోధకత. శరీరం ఇన్సులిన్‌ను సరిగ్గా వినియోగించనపుడు, ప్యాంక్రియాస్ అధిక మొత్తంలో ఇన్సులిన్ విడుదల చేస్తుంది. ఈ అధిక ఇన్సులిన్ చర్మ కణాల పెరుగుదలను ప్రేరేపించి, ఆ ప్రాంతంలో చర్మం రంగు ముదురుగా మారడానికి , మందంగా మారడానికి కారణమవుతుంది. అందుకే, ఈ సమస్య ఉన్నవారికి మధుమేహం వచ్చే ప్రమాదం అధికం. లేదా ఇప్పటికే వారికి మధుమేహం ఉండవచ్చుకూడా. ఎకాంథోసిస్ నైగ్రికాన్స్ ఎందుకు వస్తుందన్నది ఇంకా తెలియదు. అది రావడానికి నిర్దిష్టంగా ఫలానా అంశమే కారణం అని చెప్పడానికి లేదు. అయితే ఇన్సులిన్ రెసిస్టెన్స్ ఉన్నవాళ్లకు అది వస్తుందన్నది పరిశోధనల వల్ల తెలుస్తుంది. ఇన్సులిన్ అనే హార్మోన్ చక్కెరను కణంలోకి సాఫీగా వెళ్లేలా చేయడం ద్వారా రక్తంలో చక్కెరను రెగ్యులేట్ చేస్తుంది. అంటే కణం తాలూకు జీవక్రియలకు అవసరమయ్యేలా చక్కెరను కణంలోకి ప్రవేశించేలా చేయడం వల్ల రక్తంలో తగినంత చక్కెర కనిపించదు. ఏదైనా కారణాల వల్ల కణంలోకి చక్కెర ప్రవేశించకపోతే అది ఉండిపోతుంది.

అకాంథోసిస్ నైగ్రికన్స్ కంట్రోల్ చేయాలంటే

ఇన్సులిన్ రెసిస్టెన్స్ తగ్గించుకోవాలంటే కాంప్లెక్స్ కార్బోహైడేట్ ఫుడ్స్ తీసుకోవాలి. అంటే బ్రౌన్ రైస్, మిల్లెట్స్, జొన్న రొట్టెలు, చపాతీ వంటివి తీసుకుంటే ఇన్సులిన్ రెసిస్టెన్స్ నెమ్మదిగా తగ్గిపోతుంది. చక్కెర,మైదా వంటి శుద్ధి చేసిన పిండి పదార్థాలను తగ్గించి, పీచుపదార్థాలు, కూరగాయలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల ఇన్సులిన్ రెసిస్టెన్స్ తగ్గి మెడ దగ్గర నల్లబడటం తగ్గుతుంది. కొంతమందిలో జీవిన విధానం లో మార్పులు చేశాక కూడా తగ్గకపోతే వారు రక్త పరీక్షల ద్వారా ఇన్సులిన్, చక్కెర స్థాయిలను నిర్ధారించి, సరైన వైద్యం చేసుకోవాలి . వారి సలహా మేరకు రెటినాయిడ్స్ లేదా లాక్టిక్ యాసిడ్ ఉన్న క్రీములను వాడటం వల్ల చర్మం పైపొర మందం తగ్గి, నలుపు రంగు కొద్దిగా తగ్గవచ్చు. అకాంథోసిస్ నైగ్రికన్స్ అనే సమస్య చాలా అరుదుగా, అంతర్గత క్యాన్సర్ కు కూడా ఒక సంకేతం కావచ్చు. మీరు ఈ లక్షణాలను గమనించినట్లయితే, ఇది దేనికి సంకేతమో తెలుసుకోవడానికి, సరైన చికిత్స తీసుకోవడానికి చర్మవ్యాధి వైద్యుని సంప్రదించడం మంచిది

డా. కౌశల్ గోవర్ధన
7702417779
వైస్ చైర్మన్
శ్రీ రామానుజ సేవా ట్రస్ట్
ధనుంజయ నర్సింగ్ హోమ్, హైదారాబాద్

ముఖ్య సూచిక

ఇది వృత్తిపరమైన వైద్య సలహా, రోగ నిర్ధారణ లేదా ట్రీట్మెంట్ కు ప్రత్యామ్నాయంగా ఉద్దేశించబడలేదు. ఈ వైద్య పరిస్థితికి సంబంధించి మీకు ఏవైనా ప్రశ్నలు ఉంటే మీ వ్యక్తి గత వైద్యుల్ని లేదా సంబంధిత నిపుణుల సలహా తీసుకోండి.

ఉమర్ కు ఆశ్రయమిచ్చిన మరో నిందితుడి అరెస్టు

- ఢిల్లీ ఎర్రకోట పేలుడు ఘటనలో ఎన్ఐఏ విచారణ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 26 : ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడు కేసులో ఎన్ఐఏ మరో నిందితుడు హర్యానాలోని ఫరీదాబాద్ కు చెందిన షోయబ్ ను అరెస్టు చేసింది. షోయబ్ కారు పేలుడుకు ముందు ప్రధాన నిందితుడు ఉమర్ నబీకి సహకరించాడని ఎన్ఐఏ ఆరోపిస్తోంది. ఉమర్ కు ఆశ్రయం కల్పించడంతో పాటు అవసరమైన సహాయం అందించాడు. రెండు వారాల కింద ఢిల్లీలో జరిగిన పేలుడు ఘటనకు ముందు వరకు నిదింతుడు షోయెబ్ ఉమర్‌కు తన ఇంట్లో ఆశ్రయం ఇచ్చాడు. దాంతో పాటు ఉమర్‌కు కావాల్సిన అన్ని సమకూర్చినట్లు ఎన్ఐఏ ప్రాథమిక విచారణలో తేలింది. ఈ అభియోగాలతోనే నిందితుడు షోయెబ్‌ను బుధవారం నాడు ఎన్ఐఏ అరెస్ట్ చేసింది. ఉమర్ నబీకి ఆశ్రయం ఇవ్వడమే కాకుండా, అతనికి షోయెబ్ అన్ని రకాల లాజిస్టిక్ సపోర్ట్ కూడా అందించాడని తెలిపింది. ఇందులో వసతి, సామాగ్రి, ఇతర రకాల సహాయం ఉన్నాయి. ఈ కేసులో ఇంతకుముందు ఎన్ఐఏ మరో ఆరుగురిని అరెస్టు చేసింది. ఈ ఉగ్రదాడి వెనుక ఉన్న పూర్తి కుట్రను ఛేదించేందుకు దర్యాప్తు కొనసాగుతోంది. త్వరలోనే మిగతా నిందితులను, దాడికి ప్లాన్ చేసిన మాస్టర్ మైండ్ దాడికి కారణాలు బయట పెడతామని చెబుతోంది.

కేంద్రంలో ఎవరున్నా వారితో కలిసి పనిచేయాలి

- కాంగ్రెస్ పార్టీ నేతలకు ఎంపీ శశిథరూర్ సూచన

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 26 : ప్రజాస్వామ్యంలో ఎవరు ఎన్నికైనా వారితో కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ అభిప్రాయపడ్డారు. ఇటీవల ప్రధాని నరేంద్ర మోడీని, కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన ప్రశంసిస్తున్నారు. దీనిపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. కొందరు కాంగ్రెస్ నేతలు ఆయనపై విమర్శలు కూడా చేశారు. ఈ నేపథ్యంలో దుబాయిలో ఉన్న శశిథరూర్ కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలపై స్పందించారు. ప్రతి ఒక్కరూ ఒకే సిద్ధాంతాలను అనుసరిస్తూ కేంద్రానికి సహకరించకపోతే కొన్ని పనులు ముందుకు సాగవని అన్నారు. కేవలం సైద్ధాంతిక స్వచ్ఛతతోనే దేశం అభివృద్ధి చెందదని, పరస్పర సహకారంతోనే ఇది సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీలు, నాయకుల వ్యక్తిగత అభిప్రాయాలను పక్కనబెట్టి, ప్రజల ప్రయోజనాలే ముఖ్యంగా వ్యవహరించాలన్నారు. ప్రజలు సిద్ధాంతాలపై ఆసక్తి చూపుతారు కానీ, రాజకీయ పార్టీలు మాత్రం మొండిగా వ్యవహరిస్తే చాలా పనులు జరగవని అభిప్రాయపడ్డారు. కేంద్రంలో ఉన్న ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించాలన్నారు. అలా చేయకపోతే ఎలా అని ప్రశ్నించారు. తాను ప్రధానమంత్రి నరేంద్ర మోడీని ప్రశంసించినట్లు కొందరు చెబుతున్నారని, తాను కేవలం ఆయన చేసిన కొన్ని వ్యాఖ్యలను మాత్రమే ప్రస్తావించానని, ఆయనను పొగడలేదని స్పష్టం చేశారు. అయినప్పటికీ తన వ్యాఖ్యలపై విమర్శలు చేయడం సరికాదని ఆయన అన్నారు.

కాళీమాతను మేరీమాతగా మార్చిన పూజారి

- పూజారిని అరెస్ట్ చేసి విచారిస్తున్న పోలీసులు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, ముంబై, నవంబర్ 26 : ముంబై నగర శివారు చెంబూర్‌లోని ఒక ఆలయంలో కాళీమాత విగ్రహాన్ని మేరీమాత రూపంలోకి మార్చడం తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనకు బాధ్యుడిగా భావిస్తున్న ఆలయ పూజారిని పోలీసులు అరెస్ట్ చేసారు. అనిక్ విలేజ్ హిందూ శ్మశానవాటికలోని కాళీ ఆలయంలో ఈ ఘటన జరిగింది. కాళీమాత నల్లటి విగ్రహానికి తెలుపు రంగు పూసి, బంగారు వస్త్రాలు, సిలువతో కూడిన కిరీటాన్ని అలంకరించారు. అమ్మవారి చేతిలో శిశువు యేసును పోలిన బొమ్మను ఉంచారు. గర్భగుడి నేపథ్యాన్ని కూడా ఎర్రటి వస్త్రం, పెద్ద సిలువతో మార్చేశారు. ఇది చూసి భక్తులు దిగ్భ్రాంతికి గురయ్యారు. దీనిపై పూజారిని ప్రశ్నించగా, కలలో కాళీమాత కనిపించి తనను మేరీమాత రూపంలో అలంకరించమని చెప్పిందని సమాధానమిచ్చాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. ఎలాంటి పుకార్లు వ్యాపించకుండా, ఉద్రిక్తతలు పెరగకుండా ఉండేందుకు పోలీసుల సమక్షంలోనే విగ్రహాన్ని తిరిగి పూర్వస్థితికి మార్చారు. పూజారిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా, రెండు రోజుల పోలీస్ కస్టడీకి అనుమతి లభించింది. మతపరమైన మనోభావాలను దెబ్బతీసినందుకు కేసు నమోదు చేశారు. ఈ చర్య వెనుక అసలు ఉద్దేశం ఏమిటి? ఇతరుల ప్రమేయం ఉందా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనను విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ తీవ్రంగా ఖండించాయి.



సిరీస్ ఓటమితో గంభీర్, పంత్ భావోద్వేగం

- కన్నీరు పెట్టిన టీమిండియా తాత్కాలిక కెప్టెన్

టెస్ట్ క్రికెట్‌లో టీమిండియా ఘోర పరాజయం పాలైంది. సౌతాఫ్రికాతో బుధవారం ముగిసిన రెండో టెస్ట్‌లో టీమిండియా 408 పరుగుల భారీ తేడాతో ఓడిపోయింది. 549 పరుగుల భారీ లక్ష్యంతో, 27/2 ఓవర్‌నైట్ స్కోర్‌తో ఆఖరి రోజు ఆటను ప్రారంభించిన భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 140 పరుగులకే కుప్పకూలింది. జడేజా 54 ఒక్కడే హాఫ్ సెంచరీతో రాణించగా మిగతా బ్యాటర్లు ఎవ్వరూ రాణించలేదు. సౌతాఫ్రికా బౌలర్లలో సిమన్ హర్మర్ ఆరు వికెట్లతో భారత్ పతనాన్ని శాసించగా, కేశవ్ మహరాజ్ రెండు వికెట్లు పడగొట్టాడు. మార్కో జాన్సెన్, సీనర్ ముత్తు సామి తలో వికెట్ తీసారు. టీమిండియా పరాజయం తప్పదని తేలిన వెంటనే తాత్కాలిక కెప్టెన్ రిషభ్ పంత్, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తీవ్ర ఆవేదనకు గురయ్యారు. పంత్ కన్నీటిని ఆపుకునే ప్రయత్నం చేశాడు. గౌతమ్ గంభీర్ కూడా తీవ్ర బాధలో కనిపించాడు. మ్యాచ్ అనంతరం మీడియాతో మాట్లాడిన పంత్ తమకు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోకపోవడంతోనే ఓడిపోయామని చెప్పాడు. ఈ ఓటమి నుంచి గుణపాఠం నేర్చుకొని ముందు ముందు మరింతగా బాగా ఆడేందుకు యత్నిస్తామని పేర్కొన్నాడు. ఈ ఓటమికి తనతో సహా జట్టులోని ప్రతీ ఒక్కరు బాధ్యులేనని గంభీర్ అన్నాడు. కోచ్‌గా తన భవితవ్యం బీసీసీఐ చేతిలో ఉందన్నాడు. జట్టు కంటే ఎవరూ ఎక్కువ కాదని స్పష్టం చేశాడు. తన హయాంలోనే ఛాంపియన్స్ ట్రోఫీ, ఆసియా కప్‌తో పాటు ఇంగ్లండ్ పర్యటనలో టీమిండియా టెస్ట్ సిరీస్ సమం చేసుకుందని తెలిపాడు.

సఫారీల చేతిలో టీమిండియా దారుణ ఓటమి

- 2-0 తేడాతో సిరీస్ గెలుచుకున్న సౌతాఫ్రికా

టెస్ట్ సిరీస్‌లో భారత్‌కు దారుణ పరాభవం ఎదురైంది. తొలి టెస్టులో స్వల్ప స్కోరు ఛేదించలేక, రెండో టెస్టులో మరింత ఘోరంగా ఓటమిపాలైంది. దాంతో పర్యాటక జట్టు దక్షిణాఫ్రికా సిరీస్‌ను 2-0తో క్లీన్ స్వీప్ చేసింది. గౌహతిలో జరిగిన టెస్టులో టీమిండియా మరీ అవమానకర రీతిలో చేతులెత్తేసింది. 500కు వందలకు పైగా టార్గెట్ తో బ్యాటింగ్‌కు దిగిన భారత్ 140 పరుగులకే పెవిలియన్ చేరింది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన మొదటి టెస్ట్‌లో 124 తక్కువ స్కోరును కాపాడుకుని దక్షిణాఫ్రికా సత్తా చాటింది. రెండో టెస్టులో దక్షిణాఫ్రికా జట్టు ఏకంగా 549 భారీ టార్గెట్ ఇచ్చి ప్రత్యర్థి టీమిండియాను మానసికంగా దెబ్బకొట్టింది. ఏ దశలోనూ భారత బ్యాటర్ల నుంచి పోరాటం కనిపించలేదు. భారత్ లో దక్షిణాఫ్రికాకు గత 25 యేండ్లలో ఇదే మొదటి టెస్ట్ సిరీస్ విజయం కావడం విశేషం. తొలి టెస్టులో భారత్‌ను దెబ్బకొట్టిన సైమన్ హార్మర్ రెండో టెస్టులోనూ తొమ్మిది వికెట్లు తీశాడు. రెండో ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లు తీశాడు. తొలి ఇన్నింగ్స్ లో జాన్సెన్ ఆరు వికెట్లతో సత్తా చాటాడు. 27/2 ఓవర్‌నైట్ స్కోర్‌తో ఐదో రోజు ఆట ప్రారంభించిన భారత్ వరుసగా వికెట్లు కోల్పోయింది. రవీంద్ర జడేజా హాఫ్ సెంచరీ చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. నితీశ్ కుమార్ రెడ్డి డకౌట్ అయ్యాడు. అటు వాషింగ్టన్ 16 పరుగులే చేశాడు. సొంతగడ్డపై ఓటమిని అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. సాయిసుదర్శన్ 139 బంతులాడి 14 పరుగులు చేశాడు. మ్యాచ్ ఓడినా కనీసం పరువు దక్కే ప్రదర్శన కూడా చేయకపోవంతో టీమిండియాపై, కోచ్ గౌతమ్ గంభీర్ పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల న్యూజిలాండ్ చేతిలో 3-0, తాజాగా సఫారీల చేతిలో 20తో వరుస సిరీస్ ఓటములు నమోదయ్యాయి. 40 యేండ్ల తరువాత భారత్ స్వదేశంలో రెండు వరుస టెస్ట్ సిరీస్‌లు ఓడిపోయింది.

ప్రతీకారం కాదు, ఫైనల్ చేరడం ముఖ్యం

- టీ20 మెగా టోర్నీపై రోహిత్ శర్మ వ్యాఖ్యలు

టీ20 ప్రపంచకప్ లో టీమిండియా విజేతగా నిలవాలని తాను కోరుకుంటున్నానని మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ తెలిపాడు. మనకు ప్రత్యర్థి ఎవరనేది ఇక్కడ ముఖ్యం కాదని, టీమిండియా ఫైనల్ చేరడమే ముఖ్యమని అన్నాడు. వన్డే ప్రపంచకప్ ఫైనల్ ఓటమికి ప్రతీకారం కూడా అవసరం లేదన్నాడు. సూర్యకుమార్ యాదవ్ ఏదో బాధలో ఆసీస్‌ను ఓడించాలని అన్నాడని పేర్కొన్నాడు. టీ20 ప్రపంచకప్ టోర్నీకి సంబంధించిన షెడ్యూల్‌ను ఐసీసీ మంగళవారం ప్రకటించింది. ఈ కార్యక్రమానికి రోహిత్ శర్మతో పాటు టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, భారత మహిళల వన్డే కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ హాజరయ్యారు. టోర్నీకి రోహిత్ శర్మను ఐసీసీ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించింది. ఈ సందర్భంగా సూర్య మాట్లాడుతూ అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంతో ఆస్ట్రేలియాను ఓడించి ప్రతీకారం తీర్చుకుంటామని సరదాగా అన్నాడు. అయితే, బ్రాండ్ అంబాసిడర్‌గా కొత్త పాత్రలోకి రావడం చాలా సంతోషంగా ఉందని రోహిత్ శర్మ పేర్కొన్నాడు. ఈ టోర్నీ కోసం తమ యువ క్రీడాకారులు ఉత్సాహంగా ఉన్నారని చెప్పాడు. భారత జట్టు తరపున మైదానంలోకి దిగితే ఆ భావోద్వేగం భిన్నంగా ఉంటుందన్నాడు. ఒత్తిడి ఉంటుంది కానీ ప్రజల నుంచి వచ్చే మద్దతు అద్భుతమని రోహిత్ శర్మ చెప్పాడు.

బాస్కెట్ బాల్ యువ క్రీడాకారుడి దుర్మరణం

- హర్యానాలో ప్రాక్టిస్ చేస్తుండగా దుర్ఘటన

హర్యానాలోని రోహ్‌తక్‌లో బుధవారం విషాద ఘటన జరిగింది. 16 యేండ్ల జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు హార్దిక్ ప్రాక్టీస్ చేస్తుండగా ప్రాణాలు కోల్పోయాడు. బాస్కెట్‌బాల్ హూప్‌పై విన్యాసం చేసే ప్రయత్నంలోనే పోల్ అతడిపై ఒక్కసారిగా కూలిపోయింది. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. సహచరులు వెంటనే ఆసుపత్రికి తరలించినా అప్పటికే మరణించాడని వైద్యులు ప్రకటించారు. అధికారులు ఈ ఘటనపై వెంటనే ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించారు. ముఖ్యంగా క్రీడా పరికరాల పరిస్థితి, వాటి నిర్వహణలో నిర్లక్ష్యంపై దృష్టి సారించారు. ప్రాక్టీస్ సెషన్ జరుగుతుండగా ఈ దురదృష్టకర సంఘటన చోటు చేసుకోవడాన్ని అధికారులు సీరియస్ గా తీసుకున్నారు. ఈ ప్రమాదం సీసీటీవీలోనూ రికార్డ్ అయింది. సబ్ జూనియర్ నేషనల్ బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో హర్యానాకు ప్రాతినిధ్యం వహించిన హార్దిక్ ప్రాక్టీస్ చేస్తూ. అతను రిమ్‌ను పట్టుకోగానే, బాస్కెట్‌బాల్ హూప్ ఐరన్ పోల్ అకస్మాత్తుగా కూలి నేరుగా అతని ఛాతీపై పడింది. పోల్ ఎందుకు కూలిందనే దానిపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. విచారణ ముగిసిన తర్వాత బాధ్యులను గుర్తించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ఘటన గురించి హర్యానా ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైనీ మాట్లాడుతూ పూర్తి సమాచారం వచ్చాక వివరాలు చెబుతామన్నారు.

రివాల్వర్ రీటా పర్ఫెక్ట్ కమర్షియల్ డార్క్ కామెడీ ఫిల్మ్

హీరోయిన్ కీర్తి సురేష్

నేషనల్ అవార్డ్ విన్నింగ్ హీరోయిన్ కీర్తి సురేష్ టైటిల్ రోల్ లో నటిస్తున్న క్రైమ్ కామెడీ ఎంటర్ టైనర్ 'రివాల్వర్ రీటా'. జేకే చంద్రు దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని సుధన్ సుందరం & జగదీష్ పళనిసామి నిర్మించారు. రాధికా శరత్‌కుమార్, సూపర్ సుబ్బరాయన్, సునీల్, అజయ్ ఘోష్, రెడిన్ కింగ్స్లీ కీలక పాత్రలు పోషించారు. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ మంచి బజ్ క్రియేట్ చేశాయి. నవంబర్ 28న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీరిలీజ్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ప్రీరిలీజ్ ప్రెస్ మీట్లో హీరోయిన్ కీర్తి సురేష్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. అజయ్ గారితో వర్క్ చేయడం చాలా ఆనందంగా అనిపించింది. అలాగే ఇందులో సునీల్ గారు చాలా డిఫరెంట్ రోల్ చేశారు. మీరందరూ చాలా ఎంజాయ్ చేస్తారు. ఇందులో రాధిక గారు చాలా చక్కని పాత్ర చేశారు. మా ఇద్దరికి కెమిస్ట్రీ చాలా బాగుంటుంది. ఇది పర్ఫెక్ట్ డార్క్ కామెడీ ఫిలిం. ఇప్పటివరకు చాలా డార్క్ కామెడీ సినిమాలు చూసుంటారు. కానీ ఇది ఫిమేల్ లీడ్ చేస్తున్న డార్క్ కామెడీ ఫిలిం. తప్పకుండా మీరందరూ ఎంజాయ్ చేస్తారని ఆశిస్తున్నాను. ఇది ఒక్క రోజులో జరిగే కథ. చాలా అద్భుతమైన పాత్రలు ఉన్నాయి. ఇందులో నటించిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు.షాన్ రోనాల్డ్ చాలా చక్కని మ్యూజిక్ ఇచ్చారు. మా డిఓపి ప్రతి ఫ్రేం ని చాలా అద్భుతంగా తీర్చిదిద్దారు. చంద్రు గారు ఈ సినిమాని పక్కా కమర్షియల్ సినిమా గా తీశారు. తప్పకుండా ఈ సినిమా థియేటర్స్ లో మిమ్మల్ని అందరిని అలరిస్తుంది. నన్ను రీటాగా అద్భుతంగా చూపించిన డైరెక్టర్ చంద్రు కి థాంక్యూ. అలాగే మా నిర్మాతలు లేకపోతే ఈ సినిమా ఇంత అద్భుతంగా వచ్చేది కాదు. వాళ్ళు మహారాజా లాంటి అద్భుతమైన సినిమాలు తీశారు. ఈ సినిమాల్లో పని చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు. ఈ సినిమాని తెలుగు కన్నడలో డిస్ట్రిబ్యూట్ చేస్తున్న కుమార్ గారికి థాంక్యూ. 28న రిలీజ్ అవుతుంది. తప్పకుండా అందరూ చూసి సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను.

'ఛాంపియన్' నుంచి రస్టిక్ మెలోడీ 'గిర గిర గింగిరాగిరే' రిలీజ్

యంగ్ హీరో రోషన్ పీరియాడిక్ స్పోర్ట్స్ డ్రామా 'ఛాంపియన్'తో అలరించబోతున్నారు. జాతీయ అవార్డు గ్రహీత ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహిస్తున్నారు. జీ స్టూడియోస్ సమర్పణలో స్వప్న సినిమాస్, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. కథల ఎంపికలో, ప్రతిసారీ బ్లాక్‌బస్టర్‌లను అందించడంలో స్వప్న సినిమాస్ వెరీ స్పెషల్. ఫస్ట్‌లుక్ పోస్టర్లు, టీజర్ కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఫస్ట్ సింగిల్ గిర గిర గింగిరాగిరే ప్రోమో కూడా మంచి బజ్ క్రియేట్ చేసింది. ఈ రోజుగిర గిర గింగిరాగిరే పాట లిరికల్ వీడియో విడుదలైంది. మిక్కీ జే మేయర్ ఈ సాంగ్ ని మెలోడీయస్ ట్రీట్ గా కంపోజ్ చేశారు. మనుసని హత్తుకునే విధంగా కట్టిపడేసేలా వుంది. కాసర్ల శ్యామ్ రాసిన సాహిత్యం గ్రామ జీవితం, బంధాలు, అల్లికలా ఒక ప్రత్యేకతని తీసుకొస్తుంది. రామ్ మిరియాల రా, రస్టిక్ వాయిస్ పాటకు మరింత స్పెషల్ గా మార్చింది. రోషన్ - అనస్వరల మధ్య కెమిస్ట్రీ అందంగా ఉంది. రోషన్ తన ఎనర్జీ, గ్రేస్‌తో ఆకట్టుకుంటే, అనస్వర తన సహజమైన అందంతో మంత్రముగ్ధులను చేస్తుంది. ఇద్దరి ఆన్‌స్క్రీన్ జోడీ మనసుకి దగ్గరగా అనిపిస్తుంది. తోట తరణి ప్రీఇండిపెండెన్స్ కాలాన్ని అద్భుతమైన డీటెయిల్స్‌తో రిక్రియేట్ చేశారు, ఆర్. మధీ కెమెరా వర్క్ ఆ ప్రపంచంలోకి మనల్ని లీనం చేస్తుంది. ఈ చిత్రానికి ఎడిటింగ్ బాధ్యతలను లెజెండరీ కోటగిరి వెంకటేశ్వరరావు నిర్వహిస్తున్నారు. గిర గిర గింగిరాగిరే తో చాంపియన్ సంగీత ప్రయాణం అద్భుతంగా ఆరంభమైయింది. ఈ చిత్రం డిసెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ క్రిస్మస్ ప్రేక్షకులకు మనసుని హత్తుకునే సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ ఇవ్వనుంది.

బాలకృష్ణ, గోపీచంద్ మలినేని #NBK111 ప్రారంభం

వరుస బ్లాక్‌బస్టర్‌ల దూసుకెళ్తున్న గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, వీరసింహారెడ్డి సంచలన విజయం తర్వాత బ్లాక్‌బస్టర్ మేకర్ గోపీచంద్ మలినేనితో మరోసారి చేతులు కలిపారు. ఈ ఇద్దరి కొలాబరేషన్ లో హిస్టారికల్ ఎపిక్ #NBK111 చిత్రాన్ని ప్రతిష్టాత్మక వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై నిర్మాత వెంకట సతీష్ కిలారు గ్రాండ్ గా నిర్మిస్తున్నారు. బాలకృష్ణ సరసన నయనతార కథానాయికగా నటిస్తున్నారు. సింహా, జై సింహా, శ్రీ రామరాజ్యం తర్వాత బాలకృష్ణ, నయనతార కలిసి నటిస్తున్న నాల్గవ చిత్రం ఇది. ఈ ప్రాజెక్టు నేడు హైదరాబాద్‌లో ఘనంగా పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్ మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్ స్క్రిప్ట్‌ను నిర్మాతలకు అందజేశారు. బాలకృష్ణతో అనేక బ్లాక్‌బస్టర్‌లను అందించిన దర్శకుడు బి గోపాల్ క్లాప్ కొట్టారు. బాలయ్య కుమార్తె తేజస్విని కెమెరా స్విచ్ ఆన్ చేశారు. మొదటి షాట్‌కు బోయపాటి శ్రీను, బాబీ, బుచ్చి బాబు సమిష్టిగా దర్శకత్వం వహించారు. ఈ కార్యక్రమానికి స్టార్ దర్శకులు, నిర్మాతలు అనేక మంది ప్రముఖ అతిథులు హాజరయ్యారు. గోపిచంద్ మలినేని తొలిసారిగా హిస్టారికల్ డ్రామాలోకి అడుగు పెడుతున్నారు. కమర్షియల్ బ్లాక్‌బస్టర్స్ రూపొందించే తన ప్రత్యేక మాస్ టచ్‌ను ఒక భారీ చారిత్రక కథలో మిళితం చేస్తూ, నందమూరి బాలకృష్ణను ఇప్పటి వరకు చూడని ఓ కొత్త అవతార్ చూపించబోతున్నారు. స్పెషల్ పోస్టర్‌లో బాలకృష్ణ.. ఒక చేతిలో ఖడ్గం, మరో చేతిలో యాంకర్ పట్టుకుని అఖండమైన రాజసంతో కనిపించారు. గడ్డం, పొడవాటి జుట్టు, శక్తివంతమైన తీరుతో సమరశూరుడిలా అదరగొట్టారు.

విజయ్ కొత్త మూవీ

కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ దళపతి ఇప్పుడు జన నాయగన్ మూవీ చేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే పూర్తిస్థాయి రాజకీయాల్లో ఎంట్రీ ఇచ్చిన ఆయన.. చివరి సినిమా అదేనని తెలుస్తోంది. హెచ్ వినోత్ దర్శకత్వం వహిస్తున్న ఆ సినిమా.. వచ్చే ఏడాది సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. పొడుగు కాళ్ళ సుందరి పూజా హెగ్డే హీరోయిన్ గా నటిస్తున్న ఆ సినిమాను కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కే నారాయణ, జగదీష్ పళనిస్వామి, లోహిత్ ఎన్‌కే గ్రాండ్ గా రూపొందిస్తున్నారు. దాదాపు 300 కోట్ల రూపాయల భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. 2026 జనవరి 9వ తేదీన ప్రపంచవ్యాప్తంగా పెద్ద ఎత్తున సినిమాను రిలీజ్ చేయనున్నారు. అయితే జన నాయగన్ తెలుగులో కూడా విడుదల అవ్వనుంది. అందుకు గాను మేకర్స్ పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రీ రిలీజ్ బిజినెస్ ప్రస్తుతం జరుపుతున్నట్లు సమాచారం. ఆ సమయంలో తెలుగు థియేట్రికల్ రైట్స్ కు సంబంధించిన ఓ వార్త.. ఇప్పుడు అటు సోషల్ మీడియాలో.. ఇటు సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. జన నాయగన్ మూవీ తెలుగు థియేట్రికల్ హక్కుల్ని ప్రముఖ నిర్మాత సూర్యదేవర నాగవంశీ దక్కించుకునేందుకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే ఆ విషయంపై మేకర్స్, నాగవంశీ మధ్య చర్చలు జరిగినట్లు సమాచారం. మరికొద్ది రోజుల్లో అధికారికంగా ప్రకటించనున్నారని వినికిడి. పెద్ద ఎత్తున సినిమాను నాగవంశీ విడుదల చేయనున్నారని టాక్ వినిపిస్తోంది.

'16 రోజుల పండగ' ప్రారంభం

వినాయకుడు, విలేజ్ లో వినాయకుడు, కేరింత వంటి విజయవంతమైన చిత్రాలని అందించిన డైరెక్టర్ సాయికిరణ్ అడివి దర్శకత్వంలో రూపొందనున్న కొత్త చిత్రం '16 రోజుల పండగ'. సాయి కృష్ణ దమ్మాలపాటి హీరోగా పరిచయం అవుతున్నారు. గోపిక ఉదయన్ హీరోయిన్. ఈ చిత్రంలో రేణు దేశాయ్, అనసూయ భరద్వాజ్, వెన్నల కిషోర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రదా పిక్చర్స్, సాయి సినీ చిత్ర బ్యానర్ పై ప్రొడక్షన్ నెం 1గా సురేష్ కుమార్ దేవత, హరిత దుద్దుకూరు, ప్రతిభ అడివి నిర్మిస్తున్నారు. బుధవారం ఈ చిత్రం పూజాకార్యక్రమాలతో గ్రాండ్ గా ప్రారంభమైయింది. ముహూర్తపు సన్నివేశానికి కోన వెంకట్, కేకే రాధా మోహన్ నిర్మాతలకి స్క్రిప్ట్ అందించారు. డైరెక్టర్ శేఖర్ కమ్ముల క్లాప్ కొట్టారు. నిర్మాత టీజీ విశ్వప్రసాద్ కెమరా స్విచాన్ చేశారు. ఫస్ట్ షాట్ కు డి సురేష్ బాబు గౌరవ దర్శకత్వం వహించారు. నిర్మాతలు అల్లు అరవింద్ గారు, మైత్రి రవి దామోదర ప్రసాద్ ఈ కార్యక్రమానికి హాజరై టీం కి అభినందనలు తెలిపారు. ఈ చిత్రానికి ట్యాలెంటెడ్ టెక్నికల్ టీం పని చేస్తోంది. అనూప్ రూబెన్స్ మ్యూజిక్ అందిస్తున్నారు. పి కళ్యాణి సునీల్ డీవోపీ, సూర్య తేజ లంక ఎడిటర్. డైరెక్టర్ సాయికిరణ్ అడివి తో కలసి మల్లి అంకం, సోమ శేఖర్ పొక్కళ్ల, శ్రీరామ్ మన్నార్ స్క్రీన్ ప్లే అందిస్తున్నారు.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at H.No. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200